మన సమగ్ర **ప్రజావాణి** తెలుగు డైలీ

RNI NO:TGTEL/25/A5443

MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY

| రాజన్న సిరిసిల్ల | శుక్రవారం | 08.05.2026 | సంపుటి : 01 | సంచిక : 122 | పేజీలు : 12 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| RAJANNA SIRICILLA | FRIDAY | 08.05.2026 | Volume : 01 | Issue :122 | Pages : 12 | Cost : 2/- |







# రాజ్యాంగేతర శక్తిగా తమిళ గవర్నర్ వ్యవహారం

- ప్రజాతీర్పును గౌరవించకపోవడం అవమానం
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మండిపాటు



**హైదరాబాద్,మే 7 :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకేను ప్రజలు గెలిపిస్తూ తీర్పు ఇచ్చారని.. దానిని ఆ రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ అగౌరవపరుస్తున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్న తమిళనాడు గవర్నర్.. ప్రజా తీర్పును గౌరవించాలని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం తమిళనాడులో చోటు చేసుకున్న తాజా పరిణామాలపై గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో టీ పీసీసీ చీఫ్ మాట్లాడారు. 108 స్థానాలు గెలిచి సింగిల్ లా÷-జంగ÷స్ట్ పార్టీగా అవతరించిన టీవీకేను ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించక పోవడం దురదృష్టకరమని మహేశ్ కుమార్ గౌడ్ అభివర్ణించారు. గవర్నర్ తీరు రాజ్యాంగ స్ఫూర్తిని సమాధి చేసేదిగా ఉందన్నారు. గవర్నర్ తీసుకుంటున్న ఈ నిర్ణయాలు.. ఢిల్లీలో బీజేపీ హైకమాండ్ నుంచి వస్తున్నాయనే అనుమానం తనకు కలుగుతుందన్నారు. సింగిల్ లా÷-జంగ÷స్ట్ పార్టీకి అవకాశమివ్వాలని సర్కారియా కమిషన్‌తోపాటు ఎస్ఆర్ బొమ్మై కేసులో సుప్రీంకోర్టు తీర్పులు స్పష్టంగా చెబుతున్నాయని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మిగతా2లో...



# పదేళ్లలో గ్లోబల్ సిటీగా హైదరాబాద్

**భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు**

**అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేలా అభివృద్ధి**

**'నాస్కామ్ జీసీసీ సమ్మిట్ 2026'లో మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్,మే 7 :** అంతర్జాతీయ పెట్టుబడులను భారీగా ఆకర్షించేలా... పదేళ్లలో హైదరాబాద్ ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మహా నగరాల అభివృద్ధిలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేలా... భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తోందని వివరించారు. మిగతా2లో...

## దూసుకొస్తున్న ద్రోణి.. రెండు తెలుగు రాష్ట్రాలకు


# వర్షసూచన..!



**అమరావతి,మే 7 :**భానుడి భగభగలతో అల్లాడుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ శుభవార్త చెప్పింది. కర్ణాటక నుంచి రాయలసీమ, తెలంగాణ మీదుగా ఏర్పడిన ద్రోణి ప్రభావంతో రానున్న మూడు రోజులపాటు రెండు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ వాతావరణ మార్పులవల్ల గత కొన్ని రోజులుగా నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గి వాతావరణం చల్లబడే అవకాశం ఉందని తెలిపింది.ఇక తెలంగాణ విషయానికి వస్తే.. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లొండ, మెదక్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఎక్కువగా ఉంది. ఈ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతోపాటు బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అకాలవర్షాల నేపథ్యంలో ఉరుములు సంభవించే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బయట తిరగవద్దని అధికారులు సూచించారు.ఆంధ్రప్రదేశ్‌లో కూడా దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. తీర ప్రాంతాల్లో ఉరుములతో కూడిన జల్లులు పడవచ్చని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ముఖ్యంగా రైతులు కోతకు వచ్చిన పంటలను కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు.

# ముగ్గురి ప్రాణాలు తీసిన ఈత సరదా

**- హల్దీ వాగులో మునిగి ముగ్గురు యువకుల దుర్మరణం**



**సిద్దిపేట,మే 7 :** సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సరదాగా ఈతకు వెళ్లిన ముగ్గురు యువకులు హల్దీ వాగులో మునిగి ప్రాణాలు కోల్పోయిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఒక శుభకార్యానికి హాజరై, ఆ సంతోషాన్ని పంచుకోవాల్సిన యువకులు విగతజీవులుగా మారడంతో మిగతా2లో...

## డ్రగ్స్ కట్టడి చేయడమే

# తొలి ప్రాధాన్యం

- రిపీటెడ్‌గా పట్టుబడితు పిడి యాక్ట్ పెట్టే ఆలోచన
- ఈగల్ ఫోర్స్ ద్వారా మంచి ఫలితాలు
- సమీక్షలో డిజిపి సివి ఆనంద్



**హైదరాబాద్,మే 7 :**రాష్ట్రంలో డ్రగ్స్ కట్టడి చేయడమే తమ తొలి ప్రాధాన్యమని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. రిపీటెడ్‌గా డ్రగ్స్ కేసులో పట్టుబడితే పీడీ యాక్ట్ తరహా చట్టాన్ని ఉపయోగిస్తామన్నారు. రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గురువారం తొలిసారిగా ఈగల్ ఫోర్స్‌పై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలోని 35 విభాగాలపై సమీక్ష నిర్వహించామని తెలిపారు. నార్కోటిక్స్‌పై అలర్ట్‌గా ఉన్నామని.. డ్రగ్స్ కట్టడి చేయడంలో మొదటి ప్రాధాన్యతతో ఉన్నామన్నారు.

మిగతా2లో...

## మహిళా సంగాలకు

# సీతక్క శుభవార్త

- వడ్డీలేని రుణాలు 5 నుంచి పది లక్షలకు పెంపు
- ఈ మొత్తలకు ప్రభుత్వమే వడ్డీల చెల్లింపు
- పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క వెల్లడి



**హైదరాబాద్,మే 7 :** మహిళా స్వయం సహాయక బృందాలకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క గుడ్ న్యూస్ చెప్పారు. ప్రతి ఒక గ్రూపునకు వడ్డీ లేని రుణాలు రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచుతున్నట్లు మంత్రి సీతక్క ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లో మహిళా స్వయం సహాయక బృందాలతో మంత్రి సీతక్క సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ప్రతి మహిళా సంఘం తీసుకునే రూ. 10 లక్షలు బ్యాంకు రుణాలకు వడ్డీ ప్రభుత్వమే చెల్లిస్తోందని హామీ ఇచ్చారు. మహిళా సంఘాల

మిగతా2లో...

## నిజాయితీ, సేవాభావంతో

# పనిచేయండి

**భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాలి**

**ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లకు మంత్రి పొంగులేటి పిలుపు**




**హైదరాబాద్,మే 7 :**ఎంతో మంది మధ్య పోటీపడి, నిబద్ధతతో కష్టపడి సాధించిన గ్రూప్-1 డిప్యూటీ కలెక్టర్ల ఉద్యోగాన్ని ప్రజాసేవకు అంకితం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లకు సూచించారు. వ్యక్తిగతంగానే కాకుండా ప్రభుత్వానికి కూడా మంచి పేరు తీసుకురావాలని, ముఖ్యంగా సమాజంలోని

మిగతా2లో...

## తమిళనాడులో పొలిటికల్ థ్రిల్లర్..

# ప్రభుత్వ ఏర్పాటుపై సస్పెన్స్

- లిఖితపూర్వకంగా బలం చూపించాకే ప్రమాణ స్వీకారం
- 118 మంది ఎమ్మెల్యేల సంతకాలతో తిరిగి రండి
- అప్పటి వరకు వేరే ఎవరికీ అవకాశం ఇవ్వను
- విజయ్‌ను మళ్లీ తిప్పి పంపిన తమిళనాడు గవర్నర్ ఆర్లేకర్
- విజయ్‌కు అవకాశం ఇవ్వాలన్న డీఎంకే, వీసీకే, వామపక్షాలు
- అన్నాడీఎంకేతో టీవీకే చర్చలు
- ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చేందుకు అంగీకారం



**చెన్నై, మే 7 :** తమిళనాడు రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే ఆవిర్భవించినప్పటికీ అధికారం మాత్రం ఇంకా అందని ద్రాక్షలాగే మిగిలిపోయింది. రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ గురువారం వరుసగా రెండో రోజు కూడా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్న టీవీకే అధినేత విజయ్ ప్రతిపాదనను తిరస్కరించారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు విజయ్ గురువారం లోక్‌భవన్‌లో గవర్నర్‌ను మళ్లీ కలిశారు. అయితే 118 మంది ఎమ్మెల్యేల మద్దతు పొందిన తర్వాతే తిరిగి రావాలని గవర్నర్ ఆయనను కోరారని లోక్‌భవన్ వర్గాలు తెలిపాయి. టీవీకేకు ఇంకా అవసరమైన సంఖ్యాబలం తక్కువగా ఉందని, ప్రమాణ స్వీకార ప్రక్రియ జరగడానికి ముందు 118 మంది ఎమ్మెల్యేల సంతకాలతో తిరిగి రావాలని గవర్నర్ విజయ్‌కు చెప్పినట్లు

మిగతా2లో...

## పదేళ్ల బిఆర్ఎస్ కన్నా

# రెండేళ్ల కాంగ్రెస్ బెటర్

- 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల చొప్పన రుణమాఫీ
- బిఆర్ఎస్ నేతల విమర్శలు చూసి రైతులు నవ్వుకుంటున్నారు
- రైతులు ఆర్థానికి వ్యవసాయం దిశగా అడుగులు వేయాలి
- వరంగల్ రైతుమేళాలలో పాల్గొన్న మంత్రి తుమ్మల




**హనుమకొండ,మే 7:** బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని పనులను సీఎం రేవంత్‌రెడ్డి రెండేళ్లలోనే చేశారని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మొదటి ఏడాదిలోనే రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల మంది రైతులకు

మిగతా2లో...




# మహానాడు కన్వీనర్‌గా లోకేశ్

## గంగుల కార్యాలయం,

# కౌశిక్ రెడ్డి కారుపై దాడి

వివరాలు 2లో

# డ్రగ్స్ కట్టడి చేయడమే తొలి ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా జరిగిన ఆపరేషన్‌పై ఈ సమీక్షలో చర్చించామని వివరించారు. ఈగల్ ఫోర్స్ ద్వారా మంచి ఫలితాలు వచ్చాయని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో ఆపరేషన్‌లు నిర్వహించడం ద్వారా నిందితులను అరెస్ట్ చేసి.. వారి వద్ద నుంచి భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. డ్రగ్స్ విషయంలో సరఫరాతోపాటు డిమాండ్.. ఈ రెండింటిపై దృష్టి సారించామని పేర్కొన్నారు. ఈగల్‌లో సిబ్బంది కొరత ఉందన్నారు. సివిల్ ఫోర్స్ అవసరం కూడా ఉందని చెప్పారు. డ్రగ్స్ సప్లయర్స్ ఆస్తులను సీజ్ చేయడం వంటి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ ప్రకటించారు. జిల్లాలో కమిషనర్లు, ఎస్పీలు కూడా డ్రగ్స్ కట్టడిలో కీలక పాత్ర పోషించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. జిల్లా స్థాయిలో నిఘా లోపించిందని ఈ సమీక్షా ద్వారా బహిర్గతమైందని చెప్పారు. నార్కోటిక్ ఐదు పోలీస్ స్టేషన్‌లు మంచిగా పని చేసి, ఫలితాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఇక నుంచి యూనివర్సిటీలతోపాటు విద్యాసంస్థల్లో డ్రగ్స్ దొరికితే ఆ బాధ్యత యజమాన్యాలదేనని డీజీపీ సీవీ ఆనంద్ కుండబద్దలు కొట్టారు. రాష్ట్రవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో డీ అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జిల్లాల్లో అధికారులు డ్రగ్స్ కేసుల దర్యాప్తు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమైందన్నారు.

జిల్లాల్లో డ్రగ్స్ కేసుల విచారణపై అధికారులకు ఈగల్ ఫోర్స్ ద్వారా శిక్షణ ఇస్తామని డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు.

# మహిళా సంగాలకు సీతక్క శుభవార్త

(మొదటి పేజీ తరువాయి)

రుణాలకు ఈ ఏడాది వడ్డీల కోసం రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తామని వివరించారు. అప్పటి వరకు అర్హత గల మహిళా సంఘాలకు రూ. 5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు కల్పించామన్నారు. ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ.10 లక్షలకు పెంచుతున్నామని వివరించారు. మహిళలపై భారాన్ని దించేందుకు వడ్డీ లేకుండా రెట్టింపు లోన్లు ఇస్తున్నామన్నారు. బ్యాంకులకు రీ పేమెంట్ బాగా చేస్తున్నారంటూ మహిళా సంఘాలపై ఈ సందర్భంగా మంత్రి సీతక్క ప్రశంసలు కురిపించారు.మహిళా ఉన్నతి.. తెలంగాణ ప్రగతి అన్న నినాదంతో తమ ప్రభుత్వం పని చేస్తుందని స్పష్టం చేశారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం యజ్ఞంలా తామంతా పని చేస్తున్నామని వివరించారు. మహిళలు పేదరికం నుంచి బయటపడినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అందుకే వడ్డీ లేని రుణాలు ఇప్పించి ఆర్థికంగా మహిళలను ఎదిగేలా చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో తాము పనిచేస్తున్నామని తెలిపారు. అన్ని రంగాల్లో మహిళలకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. 40 శాతం పంట కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకు అప్పగించామని గుర్తు చేశారు. ఏడాది రూ. 26 వేల కోట్లకు పైగా మహిళలకు బ్యాంకు రుణాలుగా అందిస్తున్నట్లు మంత్రి సీతక్క వివరించారు. మహిళల ఆర్థిక సాధికారతలో ఇది ఒక మైలురాయి అని అభివర్ణించారు. ఇది లక్షలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. గతంలో మహిళలకు పట్టుమని రూ. పది వేల లోన్ ద్వారా లభించేవి కాదన్నారు. ఇప్పుడు అదే మహిళలకి బ్యాంకులు లక్షలాది రూపాయలు లోన్ రూపంలో అందిస్తున్నాయని వివరించారు.

# తమిళనాడులో పొలిటికల్ థ్రిల్లర్.. ప్రభుత్వ ఏర్పాటుపై సస్పెన్స్

(మొదటి పేజీ తరువాయి)

ఆ వర్గాలు తెలిపాయి.దయచేసి 118 సంతకాలతో రండి. టీవీకేకు మెజారిటీ ఉందని నిరూపించండి. అప్పుడు ప్రమాణ స్వీకారం జరుగుతుంది అని గవర్నర్ విజయ్‌తో చెప్పినట్లు తెలిసింది. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్థిరంగా ఉండి, కూలిపోకుండా ఉండేందుకే గవర్నర్ లిఖితపూర్వక మద్దతుపై పట్టుబట్టారని ఆ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఏ ఇతర పార్టీని ఆహ్వానించబోమని గవర్నర్ విజయ్‌కు హామీ ఇచ్చారని కూడా తెలిపాయి. తమ సంఖ్యా బలానికి మద్దతుగా సంతకాలతో తిరిగి రావాలని టీవీకేను గవర్నర్ కోరారు. ఆ తర్వాత విజయ్ ప్రమాణ స్వీకారం చేస్తారు. ఏఐఏడీఎంకే నాయకుడు ఎడప్పాడి కే పళనిస్వామి గవర్నర్‌తో ఎలాంటి అపాయింట్‌మెంట్ కోరలేదని సంబంధిత వర్గాలు చెప్పాయి.ప్రస్తుత అసెంబ్లీ పదవీకాలం మే 9న ముగియనున్నందున కొత్త ప్రభుత్వంపై నిర్ణయం తీసుకునేందుకు గవర్నర్ అర్లేకర్‌కు మరి కొన్ని రోజుల వ్యవధి ఉంది. ముందు రోజు కూడా విజయ్ 112 మంది ఎమ్మెల్యేల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు గవర్నర్‌ను కలిశారు. ఐదుగురు ఎమ్మెల్యేలు ఉన్న కాంగ్రెస్ నుంచి విజయ్ మద్దతు పొందినప్పటికీ విజయ్ తనకు పార్టీ అండ ఉందని గవర్నర్‌కు మౌఖికంగా తెలియచేసి సంఖ్యాబలాన్ని మరింత పెంచుకోవడానికి మరికొంత సమయం కోరినట్లు ఆ వర్గాలు తెలిపాయి. అయితే ఈ సంఖ్య సరిపోదని విజయ్‌కు తెలియచేసిన గవర్నర్ 118 మంది ఎమ్మెల్యేల మద్దతుతో తిరిగి రావాలని కోరినట్లు తెలిసింది. దీంతో మళ్లీ కొత్త యత్నాలకు ఇది నాంది పలుకుతున్నది.

**విజయ్‌కు అవకాశం ఇవ్వండి** విడుతలై చిరుత్తైగల్ కచ్చి(వీసీకే) అధినేత తొల్ తిరుమవళవన్ గురువారం గవర్నర్ అర్లేకర్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు విజయ్‌ను ఆహ్వానించి సభలో తన మెజారిటీని నిరూపించుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. తమిళనాడు రాజకీయాల్లోకి బీజేపీ చొరబడి గందరగోళాన్ని సృష్టిస్తున్నదని స్థానిక మీడియాతో మాట్లాడుతూ తిరుమవళవన్ ఆరోపించారు. ఏకైక అతిపెద్ద పార్టీ నాయకుడిగా ఉన్న విజయ్‌ను పదవీ బాధ్యతలు చేపట్టేందుకు, ఆ తర్వాత అసెంబ్లీలో మెజారిటీని నిరూపించుకునేందుకు అనుమతించాలని ఆయన కోరారు. ఇప్పుడు బీజేపీ లేదా అమిత్ షా, మోదీ తమిళనాడు రాజకీయాల్లో జోక్యం చేసుకుని గందరగోళాన్ని సృష్టిస్తున్నారు. టీవీకేని ఏకైక అతిపెద్ద పార్టీగా ప్రజలు ఎంచుకున్నారు.అందువల్ల ఆయనను పదవీ బాధ్యతలు చేపట్టడానికి అనుమతించాలి. రాజ్యాంగం కూడా అదే నిర్దేశిస్తున్నది అని ఆయన చెప్పారు. ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్‌ను గవర్నర్ ఆహ్వానించకపోవడాన్ని తీవ్రంగా విమర్శించిన ఎంఎన్ఎం నేత కమల్ హాసన్ ఇది తమిళనాడు ప్రజలు ఇచ్చిన తీర్పును అగౌరవపర్చడం, అవమానపర్చడమేనని అన్నారు. డీఎంకే నేత ఏ శరవణన్ కూడా విజయ్‌కు మద్దతుగా నిలిచారు. ఎన్నికల ముందు ఎలాంటి పొత్తులు పెట్టుకోకుండా అతి పెద్ద పార్టీగా నిలిచిన టీవీకేను ఆహ్వానించడం సముచితమని అన్నారు.

# పదేళ్ల బిఆర్ఎస్ కన్నా రెండేళ్ల కాంగ్రెస్ బెటర్

(మొదటి పేజీ తరువాయి)

రూ.2 లక్షల చొప్పున రుణమాఫీ చేశారని చెప్పారు. రైతులందరూ ఆర్గానిక్ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని మంత్రి తుమ్మల వ్యాఖ్యానించారు. రసాయనాల వాడకాన్ని తగ్గించకపోతే వ్యవసాయమే ప్రశ్నార్థకంగా మారుతుందని పేర్కొన్నారు. గురువారం హనుమకొండలో జరిగిన రైతుమేళాలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి రైతు మేళాలో తుమ్మల పాల్గొన్నారు. బీఆర్ఎస్ నేతలు వరంగల్ సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిపై చౌవకబారు వ్యాఖ్యలు చేశారని ధ్వజమెత్తారు. రుణమాఫీపై కేటీఆర్ అండ్ కో అసత్యాలు మాట్లాడుతున్నారని ఆగ్రహించారు. రుణమాఫీపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కి లేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు ఎగ్గొడితే సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చారని ప్రస్తావించారు. యుద్ధం వల్ల యూరియా ఆగిపోయినా మన రైతులకు యూరియా అందించామని మంత్రి తుమ్మల తెలిపారు. యూరియాపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదన్నారు. ఎన్ని కష్టాలు ఉన్నా రూ.లక్షకోట్లను రైతుల కోసం ఖర్చుపెట్టామని తెలిపారు. కేసీఆర్ హయాంలోని అవినీతి, అహంకారాన్ని రైతులు ఎప్పటికీ మరచిపోరని చెప్పుకొచ్చారు. కాకతీయుల గడ్డపై కేటీఆర్, తదితరులు చేసిన ప్రసంగాన్ని ప్రజలంతా అసహ్యించు కుంటున్నారని విమర్శించారు. మొక్క జొన్నలు కొనే ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. ధాన్యం, మొక్కజొన్నలు వీలైనంత త్వరగా కొనుగోలు చేయాలని వేదికపైనే కలెక్టర్లను ఆదేశిస్తున్నానని అన్నారు. దేశంలో రైతులకు యూరియా అందించిన మొదటి రాష్ట్రం తెలంగాణ అని మంత్రి తుమ్మల తెలిపారు. రైతులకు సంబంధించిన అంశంలో వెనకడుగు వేయబోమని అన్నారు. బీఆర్ఎస్ నేతలు కొంతమంది తనను అవమాన పరచాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి పెట్టాలని సూచించారు. అన్నదాతలు పంట మార్పిడి చేయాలని, ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిశానిర్దేశం చేశారు. రైతుల ఖాతాల్లో కాంగ్రెస్ సర్కార్ రూ.21 వేల కోట్లను జమ చేసింది. రూ.లక్ష రుణమా ఫీని కేసీఆర్ పదేళ్లలో ఏనాడూ పూర్తి చేయలేదు. రుణ మాఫీకి బీఆర్ఎస్ ఐదేళ్ల సమయం తీసుకోవడంతో.. వాళ్లిచ్చింది వడ్డీలకు కూడా సరిపోలేదు. ఒక్క రైతుబం ధు ఇచ్చి.. మిగతా పథకాలన్నింటినీ నిలిపివేశారు. బీఆర్ఎస్ అహంకార వైఖరిని ప్రజలు ఇంకా మర్చిపోలేదు. మళ్లీ ఆ పార్టీకి అధికారం ఇచ్చేందుకు రైతులు సిద్ధంగా లేరు. ఇవాళ రైతులకు అప్పులు తక్కువున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందుందని తుమ్మల తెలిపారు.

# గంగుల కార్యాలయం, కౌశిక్ రెడ్డి కారుపై దాడి

## బిజెపి కార్యకర్తల గుండాల్లో దాడులు చేయడమేంటి..?

## మండిపడ్డ కెటిఆర్ ,హరీష్ రావులు




**హైదరాబాద్,మే 7 :** కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంపై, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కారుపై బీజేపీ శ్రేణులు దాడి చేయడంపై మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. దాడులను తీవ్రంగా ఖండించారు. పట్టపగలు గూండాల్లా వచ్చి వాహనాలు, ఆఫీసుపై దాడి చేయడం దుర్మార్గమైన చర్య అంటూ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నేతలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఈ పిరికిపంద చర్యలకు ఉసిగొల్పుతున్నారంటూ బండి సంజయ్‌పై మాజీ మంత్రి ఫైర్ అయ్యారు. 'ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితో పాటు కరీంనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ అనుచరుల హేయమైన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా. దాడి జరిగిన వెంటనే ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డితో మాట్లాడాం. పట్టపగలు గుండాల మాదిరిగా క్యాంపు కార్యాలయంలోకి ప్రవేశించి వాహనాలను, ఆఫీసును ధ్వంసం చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య. కళ్లముందే ఇంత అరాచకం సృష్టిస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తూ చోద్యం చూడటం సిగ్గుచేటు. సీఎం రేవంత్‌కు బీ-టీంగా మారిన బండి సంజయ్.. బీఆర్ఎస్ నేతలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఈ పిరికిపంద చర్యలకు ఉసిగొలుపుతున్నారు. ప్రతిసారి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకు కుప్పిగంతులు వేయడం తప్ప కరీంనగర్ ప్రజలకు బండి సంజయ్ చేసిందేమీ లేదు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉండి తన అనుచరులతోనే శాంతి భద్రతలను దెబ్బతీసేలా వ్యవహరించడం ప్రజాస్వామ్యా న్ని అపహాస్యం చేయడమే. జై తెలంగాణ' అంటూ కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. బండి సంజయ్ అను చరుల దాడిని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. కరీంనగర్ పట్టణంలో బీజేపీ గుండాలు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీస్‌పై కర్రలు, రాడ్లతో దాడి చేసి కిటికీల అద్దాలు పగులగొట్టారని తెలిసిందే. హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రెస్ మీట్ ముగిసిన 10 నిమిషాలకే బీజేపీ నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడి కౌశిక్ రెడ్డి వాహనం ధ్వంసం చేశారు. కౌశిక్ రెడ్డిపై సైతం దాడికి యత్నిం చారు.కేటీఆర్ ఎమ్మెల్యే పార్టీ కౌశిక్ రెడ్డితో ఫోన్లో మాట్లాడి నాయకులు, కార్య కర్తల యోగక్షేమాల అడిగి తెలుసుకున్నారు. ఏకంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే, ఆయన అనుచరులు దాడి చేయడం అత్యంత దురదృష్టకరమని కేటీఆర్ అన్నారు. దాడులకు పాల్పడిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని హరీష్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# నిజాయితీ, సేవాభావంతో పనిచేయండి

(మొదటి పేజీ తరువాయి)

'ఫూరెస్ట్ ఆఫ్ ది పూర్' కు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకుంటూ ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలవాలని ఉద్బోధించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన 44 మంది గ్రూప్-1 ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు గురువారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ, ప్రజల సమస్యలకు వెంటనే స్పందించాల్సిన కీలక బాధ్యత రెవెన్యూ శాఖ అధికారులపై ఉంటుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను ఛాలెంజ్‌గా స్వీకరించి ముందుకు సాగితే కలిగే సంతృప్తి అమూల్యమని అన్నారు.దర్పవంతమైన సేవలతో భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాలని యువ అధికారులకు మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మహానాడు కన్వీనర్‌గా లోకేశ్

**అమరావతి,మే 7 :**శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఇఫ్కో కిసాన్ సెజ్ వేదికగా టీడీపీ మహానాడు- 2026 ను నిర్వహించనున్నారు. ఈ మహానాడు నిర్వహణకు వివిధ కమిటీలను పార్టీ హైకమాండ్ నియమించింది. మొత్తం 21 కమిటీలను నియమించింది. సమన్వయ కమిటీ కన్వీనర్‌గా పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేశ్ నియమించింది. ఈ మహానాడు మే 27న ప్రారంభమై.. 29వ తేదీతో ముగియనుంది.ఈ మహానాడు నిర్వహణ కోసం మే 6వ తేదీన ఇఫ్కో కిసాన్ సెజ్‌లో భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులు, మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలతోపాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మొదటి రెండు రోజులు 20 వేల మంది డెలిగేట్స్ ఈ మహానాడుకు వస్తారని.. మూడో రోజు బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ ముగింపు సభకు దాదాపు ఏడు లక్షలకు పైగా కార్యకర్తలు తరలి వస్తారని అంచనా వేస్తున్నారు.

# రాజ్యాంగేతర శక్తిగా తమిళ గవర్నర్ వ్యవహారం

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. గవర్నర్‌కు రాజ్యాంగం చదవడం తెలియదా? లేక రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రవర్తించాలనే ఉద్దేశపూర్వకంగా ఆయన ఇలా చేస్తున్నారా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. తమిళనాడులో గవర్నర్ ద్వారా పాలించాలని బీజేపీ చూస్తోందని టీపీసీసీ చీఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 59 సంవత్సరాల ద్రావిడ పార్టీల పాలనకు ప్రజలు చెక్ పెట్టిన.. దానిని అడ్డుకోవడానికి గవర్నర్‌ను ఆయుధంగా వాడుకుంటోందంటూ బీజేపీపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ మద్దతు ప్రకటించిన తర్వాత కూడా టీవీకే పార్టీకి అవకాశం ఇవ్వకపోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన వ్యాఖ్యానించారు. కేరళ పర్యటన పేరుతో మరింత జాప్యం చేయడం యాదృచ్ఛికం కాదు.. కుట్ర రాజకీయాల్లో భాగమే అంటూ గవర్నర్ తీరును ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ ఎండగట్టారు. విజయ్ రెండుసార్లు రాజ్‌భవన్‌కు వెళ్ళినా వట్టి చేతులతో తిరిగి రావడం చూస్తే గవర్నర్.. రాజ్యాంగ పదవిలో ఉన్న బీజేపీ గేట్‌కీపర్ అని స్పష్టమవుతోందని వ్యంగ్యంగా అన్నారు. రాజ్యాంగం ప్రకారం గవర్నర్ హోదా నామ మాత్రమే.. విచక్షణాధికారాన్ని బీజేపీ కోసం దుర్వినియోగం చేయడం రాజ్యాంగ ద్రోహం చేయడమేనని గవర్నర్ తీరును ఆయన ఎండగట్టారు.కోట్ల మంది ఓట్లు వేసి విజయ్ పార్టీని గెలిపిస్తే.. వారి కలలను గవర్నర్ రాజ్‌భవన్‌లో బంధించడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని మహేశ్ కుమార్ గౌడ్ అభివర్ణించారు. గవర్నర్ పదవి రాజ్యాంగ పదవి.. దాన్ని బీజేపీ రాజకీయ పావుగా వాడుకుంటే దేశంలో ఫెడరల్ వ్యవస్థకే ప్రమాదమని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు.

# పదేళ్లలో గ్లోబల్ సిటీగా హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

గురువారం ముంబైలో నిర్వహించిన 'నాస్కామ్ జీసీసీ సమ్మిట్ 2026'లో 'బియాండ్ పాలసీ: డిజైన్డ్ టు విన్ ది గ్లోబల్ జీసీసీ రేస్' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలనే సంకల్పంతో 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047'కు శ్రీకారం చుట్టామని వివరించారు. ప్రపంచంలోని అనేక నగరాలు అస్తవ్యస్త పట్టణీకరణ వల్ల 'అర్బన్ కొలాప్స్' కోరల్లో చిక్కుకున్నాయని, అలాంటి చారిత్రక తప్పిదాన్ని హైదరాబాద్ విషయంలో తాము చేయాలనుకోవడం లేదన్నారు. అందుకే... భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా, దాన్ని నిర్మించే బాధ్యతను తీసుకున్నామన్నారు. ఆ దిశగానే భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, మెట్రో విస్తరణ, కొత్త విమానాశ్రయాల అభివృద్ధి, ఆర్ఆర్ఆర్, మూసీ ప్రక్షాళన, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఐకం ఇన్నోవేషన్ హబ్ తదితర కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామన్నారు. కేవలం టెక్ కంపెనీలే కాకుండా... బ్యాంకింగ్, లైఫ్ సైన్సెస్, సెమీ కండక్టర్లు, రక్షణ రంగం, ఎఫ్ఎంసీజీ, స్పేస్ టెక్, ఆతిథ్యం తదితర బహుళ రంగాలకు చెందిన దిగ్గజ సంస్థలు జీసీసీల ఏర్పాటుకు హైదరాబాద్ ను తమ మొదటి ప్రాధాన్యంగా ఎంచుకుంటున్నాయన్నారు. గతేడాది 70కి పైగా జీసీసీలు ప్రారంభమయ్యాయని, దేశంలో ఇదే అత్యధికమని వివరించారు. ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. నాస్కాం ఛైర్మన్ శ్రీకాంత్, ప్రెసిడెంట్ రాజేష్ నంబియార్ తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గురి ప్రాణాలు తీసిన ఈత సరదా

(మొదటి పేజీ తరువాయి)

వారి కుటుంబాల్లో తీరని శోకం మిగిలింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన ప్రశాంత్ (27), వికాస్ (27), ఆనంద్ రెడ్డి (27) అనే ముగ్గురు స్నేహితులు బుధవారం నాడు మెదక్ జిల్లా తూప్రాన్‌లో జరిగిన ఒక పెళ్లి వేడుకకు హాజరయ్యారు. వివాహ వేడుక అనంతరం, గురువారం ఉదయం తిరుగు ప్రయాణంలో సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం సమీపంలోని హల్దీ వాగు వద్దకు చేరుకున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో.. సరదాగా వాగులో ఈత కొట్టాలని నిర్ణయించు కున్నారు. వాగులోకి దిగిన ఈ ముగ్గురు స్నేహితులకు నీటి లోతుపై అవగాహన లేకపోవడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయారు. గల్లంతైన యువకుల కోసం స్థానికులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం ఉదయం పోలీసులు మరియు గజ ఈతగాళ్ల సహాయంతో గాలించగా.. ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతులంతా ఒకే వయసు వారు (27 ఏళ్లు) కావడంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఒకే ఊరికి చెందిన ముగ్గురు యువకులు, అందులోనూ ప్రాణ స్నేహితులు ఇలా ఒకేసారి మృతి చెందడంతో నర్సాపూర్‌లో విషాదం నెలకొంది. పెళ్లికి వెళ్లి వస్తామని చెప్పిన కొడుకులు శవాలై రావడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జలాశయాలు, వాగుల వద్దకు వెళ్లేటప్పుడు యువత అప్రమత్తంగా ఉండాలని, నీటి లోతు తెలియకుండా లోపలికి వెళ్లడం ప్రాణాంతకమని ఈ ఘటన మరోసారి హెచ్చరిస్తోంది.

# వివాదాల్లో ఉన్న మిల్లుకు ధాన్యం కేటాయింపుపై అభ్యంతరం

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి : మిల్లు భాగస్వామి ఎల్లెంకి సుధాకర్



**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, మే 07 :**పెద్దపల్లి మండలం పెద్దబొంకూరులోని సాయి గణేష్ ఇండస్ట్రీస్‌కు నిబంధనలకు విరుద్ధంగా ధాన్యం కేటాయిస్తున్న అధికారులపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆ మిల్లు భాగస్వామి ఎల్లెంకి సుధాకర్ డిమాండ్ చేశారు.గురువారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తమ మిల్లులో కొనసాగుతున్న వివాదాల విషయాన్ని అధికారులకు ముందుగానే తెలియజేసినా పట్టించుకోకుండా ధాన్యం కేటాయించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.మిల్లులో మొత్తం తొమ్మిది మంది భాగస్వాములు ఉన్నారని, గత కొంతకాలంగా ఆర్థిక, వ్యాపార లావాదేవీలపై వివాదాలు కొనసాగుతున్నాయని తెలిపారు. మేనేజింగ్ పార్టనర్లుగా ఉన్న ఎల్లెంకి రవీందర్, ఎల్లెంకి మధుకర్ మరణించిన తర్వాత మిల్లుకు సంబంధించిన బ్యాంకు ఖాతాలు నిలిపివేయబడినట్లు పేర్కొన్నారు.అయితే మరో భాగస్వామి ఎల్లెంకి దివాకర్ ఫోర్జరీ సంతకాలు, నకిలీ పత్రాలు సృష్టించి అధికారులను మరియు మిగతా భాగస్వాములను మోసం చేస్తూ మిల్లును నిర్వహిస్తున్నారని ఆరోపించారు. గత ఐదేళ్లుగా భాగస్వామ్య ఒప్పందాలను ఉల్లంఘిస్తూ లాభాల్లో వాటా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇండియన్ పార్టనర్‌షిప్ చట్టం ప్రకారం భాగస్వాములందరి అంగీకారం లేకుండా ఎలాంటి ధాన్యం కేటాయింపు ఒప్పందాలు జరగకూడదని, కానీ పౌర సరఫరాల శాఖ అధికారులు దివాకర్‌తో కుమ్మక్కై నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు.ఈ యాసంగి సీజన్‌లో కూడా మిల్లుకు ధాన్యం కేటాయించవద్దని ఏప్రిల్ నెలాఖరులో జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులకు విన్నవించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. అయినప్పటికీ అదే మిల్లుకు మళ్లీ ధాన్యం కేటాయించడం శోచనీయమని పేర్కొన్నారు.తమకు తెలియకుండా కేటాయించిన ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లో విక్రయించి ప్రభుత్వానికి సీఎంఆర్ ఎగవేస్తే దానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. సాధారణంగా మిల్లర్లు ఎగవేతలకు పాల్పడితే భాగస్వాములందరిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తారని, ఇవన్నీ తెలిసి కూడా అధికారులు అక్రమంగా ధాన్యం కేటాయించడం దురదృష్టకరమని మండిపడ్డారు.ప్రభుత్వం వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరిపి,బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎల్లెంకి సుధాకర్ కోరారు.

# గత 30 సంవత్సరాలనుండి అంబలి రూపంలో ప్రజల దాహం తీరుస్తున్న వెల్డింగ్ మణయ్య





**మన సమగ్ర ప్రజావాణి మే 07సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**అందోల్ మండల్ జోగిపేట పట్టణంలో ప్రతి ఎండాకాలంలో ప్రజల దాహం తీరుస్తున్న అంబలి దాత వెల్డింగ్ మణయ్య ఎండాకాలంలో శరీరానికి చల్లదనం ఇచ్చే పానీయాల్లో అంబలి ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. రాగి, జొన్న లేదా బియ్యంతో తయారయ్యే అంబలి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇందులో ఉన్న పోషకాలు శరీరానికి శక్తినిస్తూ, వేడిని తగ్గించడంలో సహాయపడతాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ ఎంతో మంది అంబలిని ఉదయం అల్పాహారంగా తీసుకుంటున్నారు.అంబలిలో పెరుగు, ఉల్లిపాయ, పచ్చిమిర్చి కలిపి తాగితే మరింత రుచిగా ఉంటుంది. ఇది దాహాన్ని తీర్చడమే కాకుండా జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. వేసవి తాపానికి చెక్ పెట్టే సహజమైన ఆరోగ్యకర పానీయంగా అంబలి ప్రజాదరణ పొందుతోంది. చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చే ప్రజలు అంబలి తాగకుండా ఎవ్వరు వెళ్లారు అని చెబుతున్నారు.

# చికాగో అమరుల స్ఫూర్తితో ఉద్యమిద్దాం

- నాలుగు లేబర్ కోడ్ ల రద్దుకై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి
- పోటు లక్ష్మయ్య
- సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి



**గరిడేపల్లి ప్రజావాణి మే 7:**గరిడేపల్లి మండల పరిధిలోని వెలిదండ గ్రామంలో సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మేడే సందర్భంగా గ్రామ శాఖ కార్యదర్శి మేకల కనకరావు అధ్యక్షతన నాలుగు సెంటర్ లో జెండా ఆవిష్కరణ చేసి మేడే కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి పోటు లక్ష్మయ్య, గ్రామ శాఖ కార్యదర్శి మేకల కనకరావు లు మాట్లాడుతూ కార్ఖానాలు, ప్రైవేటు కంపెనీలలో కార్మికుల శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా 140 సంవత్సరాల క్రితం అమెరికా దేశంలోని చికాగో నగరంలో కార్మికులు చేసిన పోరాట ఫలితంగా 8 గంటల పనిదినాలు సాధించారన్నారు. నాటి నుండి ప్రపంచ వ్యాప్తంగా మే 1 నుండి 7 వరకు మేడే వారోత్సవాలు వాడవాడను జరుపుకుంటున్నారు. కార్మికుల శ్రమ దోపిడిని పెట్టుబడుదారులు, ప్రైవేటు కంపెనీల యాజమాన్యాలు, ప్రభుత్వాలు, పాలకులు కొనసాగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు దేశంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీ కార్మిక చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చి కార్మికుల హక్కులను హరించి వేస్తున్నారు. కార్మికులు కార్మిక సంఘాలను నిర్మాణం చేసుకోనివ్వకుండా, సమ్మెలు, ఇతర అనేక రకాల హక్కులను కోల్పోయే ప్రమాదంలో కార్మిక రంగం ఉందన్నారు. కార్మికులను విచ్చిన్నం చేసే కుట్రలు చేస్తున్నారన్నారు. పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వాలు, పాలకులు కార్పొరేట్ కంపెనీలకు, పెట్టుబడుదారులకు దళారులుగా మారి కార్మికుల శ్రమ దోపిడిని కొనసాగించే కుట్రలు చేస్తున్నారన్నారు. దీనికి వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు ఐక్యం కావాలన్నారు. దోపిడీ పీడన లేని సమసమాజ స్థాపన కోసం చికాగో అమరులు అందించిన ఎర్రజెండా చేతబుని ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు కామల్ల నవీన్, పి ఓ డబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు మేకల రాజేశ్వరి, బి ఓ సి రాష్ట్ర నాయకులు కామల్ల శ్రీను, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు మాశెట్టి అంజయ్య, గండు నగేష్, పర్వతాలు, చింతమల అంజయ్య, నరేష్, మంగమ్మ, సువార్త, కోటయ్య, బిక్షం, శ్రీహరి, టి సూర్యం, లక్ష్మీ, చంద్రకళ, నాగేంద్ర, లచ్చయ్య, నరేష్, మల్లయ్య, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులతో పాటు సెర్ప్ VOA లకు సమాన వేతనం ఇవ్వాలి

- బూర్గంపహాడ్ మండల VOA ల సంఘం అధ్యక్షులు నిర్మల, కార్యదర్శి దారావత్.సక్రు





**బూర్గంపహాడ్ మండలం / మన ప్రజావాణి / మే 7:**బూర్గంపాడు మండలం లో ప్రభుత్వ ఉద్యోగులతో పాటు సమానంగా పని చేస్తున్నటువంటి వి వో ఏ లకు ప్రభుత్వం జీతాలు పెంచాలని, పనికి తగ్గ వేతనం రావట్లేదని ఆవేదన చెందారు. ప్రభుత్వం స్పందించి 25వేల రూపాయలు నెలనెలా జీతం ఇవ్వాలని VOA లు కోరారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు VOA లకు బ్యాంకు లోన్ సౌకర్యం కల్పించాలని , డ్రెస్ కోడ్ ఇవ్వాలని, ఐడి కార్డులు జారీ చేయాలని , ఆరోగ్య భీమా కల్పించాలని, చనిపోయిన వివోఏల కుటుంబాలకు 10 లక్షల ఎక్స్గ్రేషియా కల్పించాలని కోరారు. లేనిపక్షంలో ఈ నెల మే 18 నుండి సమ్మె నిర్వహిస్తామని అన్నారు. వివో ఏల ఆధ్వర్యంలో సమ్మెకు సంబందించిన లిఖిత పూర్వక మెమోరాండం పత్రాన్ని బూర్గంపాడు ఏపిఎం (APM )హేమంతిని గారికి సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బూర్గంపహాడ్ మండల ఖూాా ల సంఘం అధ్యక్షురాలు నిర్మల , కార్యదర్శి దారావత్ సక్రు , కోశాధికారి సావిత్రి వివిధ పంచాయతీలకు సంబంధించిన ఖూాాలు అందరూ పాల్గొన్నారు

# బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి క్యాంపు కార్యాలయంపై దాడి దుర్మార్గం

- దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- గుగులోతు నీలా హేమ్లా నాయక్



**గరిడేపల్లి ప్రజావాణి మే 7:**కరీంనగర్‌లో బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడిని హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుగులోతు నీలా హేమ్లా నాయక్ తీవ్రంగా ఖండించారు. మండల కేంద్రమైన గరిడేపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ భేదాలు ఉండొచ్చని కానీ దాడులు హింసాత్మక చర్యలు ఏ మాత్రం సమర్థనీయం కాదన్నారు.దేశంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే ఇటువంటి దాడులు జరగడం అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార అహంకారంతో బిఆర్ఎస్ నాయకులను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చే చర్య అని మండిపడ్డారు.ప్రజల్లో రోజురోజుకు పెరుగుతున్న బిఆర్ఎస్ ఆదరణను చూసి ఓర్వలేకే ప్రతిపక్ష నాయకులపై కుట్రపూరిత దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై దాడి చేయడం సిగ్గుచేటు చర్య అని పేర్కొన్నారు. రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేకనే ఇటువంటి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.దాడులకు పాల్పడిన వారిని వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు.బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఎలాంటి బెదిరింపులకు భయపడరని, ప్రజల అండతో మరింత బలంగా ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు.

# ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ పాకెట్ల పంపిణీ





**గరిడేపల్లి ప్రజావాణి మే 7:**గరిడేపల్లి మండలం లోని గరిడేపల్లి లో జోరుగా ఉపాధి హామీ పనులు మొదలై పనులు కొనసాగుతున్నాయి ఇట్టి పనులను గ్రామ సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ చంద్రయ్య గౌడ్ ఉప సర్పంచ్ మాతంగి సంజీవ కార్యదర్శి నాగేశ్వరరావు ఉపాధి హామీ పనులను పరిశీలించి ఉపాధి హామీ కూలీలకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు ఇట్టి కార్యక్రమం లో ఫీల్డ్ అసిస్టెంట్ సరిత,ఆశా వర్కర్ ఉమా వార్డు మెంబర్ చిక్కుళ్ళ మట్టయ్య. మేట్లు మేకపోతుల శ్రీనివాస్, యడవెల్లి నాగరాజు. పెండెం సోమశేఖర్, మేకపోతుల నరేష్ ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు

# శ్రీశైలం దేవస్థానంలోని చెంచుగూడెములలో ‘మా స్వామి మల్లన్న - మా చెంతకే’ కార్యక్రమం

- హిందూ ధర్మప్రచారంలో భాగంగా చెంచుగూడెముల లో ‘మా స్వామి మల్లన్న - మా చెంతకే’ కార్యక్రమాలు
- మార్కాపురం జిల్లాలోని చింతల చెంచుగూడెంలో సంప్రదాయబద్ధంగా కార్యక్రమ నిర్వహణ
- సాయంకాలం దేవస్థాన ధర్మప్రచారం రథం ద్వారా శోభాయాత్ర
- చింతల చెంచుగూడెంలో శ్రీస్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం





**నంద్యాల జిల్లా శ్రీశైలం మే 7 (ప్రజావాణి):**హిందూ ధర్మప్రచారంలో భాగంగా పలు చెంచుగూడెములలో ‘మా స్వామి మల్లన్న – మా చెంతకే’ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.ఇందులో భాగంగా ఈ రోజు ( 07.05.2026) మార్కాపురం జిల్లా చింతల చెంచుగూడెంలో శోభాయాత్ర అనంతరం కల్యాణోత్సవం నిర్వహించబడుతుంది.ఈ రోజు సాయంకాలం గం. 6.30లకు ముందుగా దేవస్థానం ధర్మప్రచారం ద్వారా శోభాయాత్ర నిర్వహించబడుతుంది. తరువాత కల్యాణోత్సవం జరిపించబడుతుంది.కల్యాణోత్సవంలో ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు కల్యాణోత్సవ సంకల్పాన్ని పఠిస్తారు. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా మరియు శుభప్రదంగా జరగాలని మహాగణపతి పూజ జరిపించబడుతుంది.అనంతరం కంకణపూజ కార్యక్రమాన్ని జరిపి శ్రీ స్వామివారికి కంకణధారణ చేయబడుతుంది. ఆ తరువాత యజ్ఞోపవీత పూజ జరిపి శ్రీ స్వామివారికియజ్ఞోపవీతధారణ కార్యక్రమం జరిపించబడుతుంది. శ్రీస్వామివారి యజ్ఞోపవీతధారణ అనంతరం కన్యావరణం కార్యక్రమం, గౌరీపూజ, అమ్మవారి కంకణధారణ కార్యక్రమాలు జరిపించబడుతాయి. తరువాత శ్రీ స్వామిఅమ్మవార్ల ప్రవర పఠించడుతుంది. అనంతరం స్వామివారికి వరపూజ నిర్వహించి శ్రీ స్వామిఅమ్మవార్లకు బాషికాలను అలంకరిస్తారు తరువాత ఈ భూమండలం మరియు శ్రీశైలక్షేత్రవర్ణనతో కూడిన మహాసంకల్పం పఠించచబడుతుంది.మహాసంకల్ప పఠన తరువాత అర్చకస్వాములు మంగళాష్టకాలను పఠిస్తూ సుముహూర్త సమయంలో శ్రీ స్వామిఅమ్మవార్ల శిరస్సులపై జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని సమర్పించనున్నారు.అనంతరం లోకకల్యాణం కోసం అమ్మవారికి మాంగల్యధారణ జరిపించబడుతుంది. తరువాత శ్రీ స్వామిఅమ్మవార్లకు తలంబ్రాలను సమర్పించడం జరుగుతుంది.ఆ తరువాత శ్రీ స్వామిఅమ్మవార్ల వస్త్రాల కొంగులను కలుపుతూ బ్రహ్మముడి వేయడం బడుతుంది. చివరగా శ్రీ స్వామిఅమ్మవార్లకు పున:పూజలు జరిపి ఆశీర్వచనం, భక్తులకు ప్రసాద వితరణ చేయబడుతుంది.ఈ కార్యక్రమములో పాల్గొనే చెంచు భక్తులందరికీ కూడా ఆశీర్వచనముతో శేషవస్త్రాలను (పురుషులకు పంచ – కండువా మరియు మహిళలకు చీర –– రవిక వస్త్రము) అందజేయబడుతాయి.

# కో-ఆప్షన్ సభ్యుల ప్రమాణస్వీకారంలో పాల్గొన్న భువనగిరి ఎమ్మెల్యే...

- కుంభం అనిల్ కుమార్ రెడ్డి.




**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి మే 07:**యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణ మున్సిపల్ కార్యాలయంలో గురువారం రోజు నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం , కో–ఆప్షన్ సభ్యుల ఎన్నిక కార్యక్రమానికి భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ మాట్లాడుతూ భువనగిరి పట్టణ సుందరీ కరణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. భువనగిరి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించే దిశగా అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న ఎమ్మెల్యే , భువనగిరిలో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్లకు సంబంధించిన మౌలిక సదుపాయాల పనులు ఈ నెలాఖరు నాటికి పూర్తవు తాయని ఆయన తెలిపారు. అనంతరం అతి త్వరలోనే గృహప్రవేశ కార్యక్రమం నిర్వహిస్తామని వెల్లడించారు. మూసి ప్రక్షాళన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని పేర్కొన్న ఆయన , మూసి నదిపై రూ.50 కోట్ల వ్యయంతో బ్రిడ్జి మంజూ రైందన్నారు. అలాగే జూలూరు , అనాజీపురం , శివారెడ్డి గూడెం ప్రాంతాలకు సంబంధించిన బ్రిడ్జిల నిర్మాణ పనులు కూడా ప్రజాపాలనలో భాగంగా చేపడుతున్నట్లు తెలిపారు. భువనగిరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పలు అభివృద్ధి అంశాలపై చర్చించి కో–ఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన కో–ఆప్షన్ సభ్యులకు స్థానిక ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ , వైస్ చైర్మన్ , కౌన్సిలర్లు , మున్సిపల్ కమిషనర్ , ప్రజా ప్రతినిధులు , నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామస్తుల సహకారంతో గూడెంలో మినరల్ ప్లాంట్ ప్రారంభం



**బెజ్జంకి, మే 7 (ప్రజావాణి):**సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని గూడెం గ్రామంలో గ్రామ ప్రజలకు పరిశుభ్రమైన, సురక్షితమైన తాగునీరు అందించేందుకు గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన మినరల్ ప్లాంట్‌ను గురువారం గ్రామ సర్పంచ్( బెజ్జంకి సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు)గూడెల్లి శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మినరల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, గ్రామస్తుల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. మినరల్ ప్లాంట్ ఏర్పాటు పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ యాలాల పరుశరాములు, వార్డు సభ్యులు బోనాల రమేష్, మంకాల సుగుణ, బోనాల లక్ష్మి, నూనె రవి, నారెడ్డి శ్రీనాథ్, గూడెల్లి స్వప్న, గ్రామపంచాయతీ కార్యదర్శి యాదగిరి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గాగిల్లాపూర్‌లో ఘనంగా అఖండ హోమం

● హనుమాన్ మాలదారుల ఆధ్వర్యంలో భక్తి కార్యక్రమాలు



**బెజ్జంకి, మే 7 (ప్రజావాణి):**సిద్ధిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని గాగిల్లాపూర్ గ్రామంలో హనుమాన్ మాలదారుల ఆధ్వర్యంలో అఖండ హోమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలు నిర్వహించి గ్రామం సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో జీవించాలని ఆంజనేయ స్వామిని ప్రార్థించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ మాలదారులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కనీస వేతనం ఇవ్వకుంటే సమ్మె తప్పదు: వివోఏల హెచ్చరిక



**చెన్నారావుపేట మే 7 ప్రజావాణి :**తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చెన్నారావుపేట మండల పరిధిలోని ఆశాజ్యోతి మండల సమైక్య గ్రామ సంఘ సహాయకులు వివోఏ సమ్మె బాట పట్టారు. గురువారం మండల కేంద్రంలో ఏపీఎం తిలక్, ఎంఎస్ఓబిలకు వివోఏలు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా మండల వివోఏల గౌరవాధ్యక్షుడు బోళ్ల ఐలయ్య మాట్లాడుతూ.. పెరుగుతున్న నిత్యావసర ధరల దృష్ట్యా ప్రస్తుతం ఇస్తున్న చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించడం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలన్నీ ఆన్‌లైన్ చేస్తున్నా పని భారం పెరిగిందే తప్ప వేతనాలు పెరగలేదని విమర్శించారు. వివోఏలకు నెలకు రూ. 20 వేల గౌరవ వేతనం చెల్లించాలని, రూ. 20 లక్షల ప్రమాద మరియు ఆరోగ్య బీమా కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అర్హులైన వారికి సీసీలుగా పదోన్నతి కల్పించడంతో పాటు, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్‌ఆర్ పాలసీ వర్తింపజేయాలని, వివాదాస్పద 58 జీవోను సవరించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఈ నెల 18 నుంచి రాష్ట్రవ్యాప్తంగా శాంతియుతంగా సమ్మె చేపడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు సుధ, కార్యదర్శి మంజుల, ఆమని, అస్మా, పర్వీన్, మహేందర్, రమేష్, శరత్ బాబు, వెంకటేష్, కుమారస్వామి,శ్రీనివాస్,శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

# సోలార్ విద్యుత్‌పై అవగాహన సదస్సు



**చెన్నారావుపేట మే 7 ప్రజావాణి:**మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా టీఎస్ఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో సోలార్ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రైతులు, వినియోగదారులు సోలార్ విద్యుత్ ప్లాంట్లు, సోలార్ పంపు సెట్ల ఏర్పాటు ద్వారా విద్యుత్ ఖర్చును తగ్గించుకోవచ్చని సూచించారు. సోలార్ పంపు సెట్ల వినియోగం, సబ్సిడీ వివరాలను రైతులకు క్షుణ్ణంగా వివరించారు. పర్యావరణ హితమైన సౌర శక్తిని అందిపుచ్చుకోవాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ వి. శ్రీధర్, ఏఈ సంపత్, ఏఓ సిహెచ్. గోపాలరెడ్డి,మండల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్ల సహకార సంఘం కార్యాలయంలో పదవి బాధ్యతలు చేపట్టిన దేవర వెంకటరెడ్డి





**చేవెళ్ళ//మే 7(ప్రజావాణి):**ఈరోజు చేవెళ్ల సహకార సంఘం కార్యాలయంలో పదవి బాధ్యతలు చేపట్టిన దేవర వెంకటరెడ్డి .తెలంగాణ హైకోర్టు తీర్పు ప్రకారం జీవో విడుదలైన సందర్భంగా గురువారం చేవెళ్ల సహకార సంఘం చైర్మన్ గా దేవర వెంకట్ రెడ్డి, డైరెక్టర్లు కార్యాలయంలో పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారికి రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ సింపుల్ సత్యనారాయణ రెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్ కౌన్సిలర్ బండారి శైలజ ఆగిరెడ్డి, శాలువాతో సన్మానించి పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతుల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని చెప్పారు. రైతులకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమతా రెడ్డి వైస్ చైర్మన్ కాసుల రాము గౌడ్, చేవెళ్ల మాజీ జ్రాజ సభ్యురాలు చింపుల శైలజ, కౌన్సిలర్లు పైండ్ల మధుసూదన్ రెడ్డి, తాళ్లపల్లి నరసింహులు, మాజీ ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్,నాయకులు అత్తెల్లి రవీందర్ రెడ్డి, మల్గారి శ్రీకాంత్ రెడ్డి, సహకార సంఘం సిబ్బంది పలువురు నాయకులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమానికే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యత

● రైతు సంక్షేమంపై కేటీఆర్ మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయి

● ప్రభుత్వ విప్ విజయరామణారావు



**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి మే 07:**హైదరాబాద్, రాష్ట్రంలో రైతుల సంక్షేమం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే శ్రీ చింతకుంట విజయరమణారావు అన్నారు. హైదరాబాద్ అసెంబ్లీ సీఎల్‌ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం పై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. రైతు సంక్షేమం గురించి కేటీఆర్ మాట్లాడడం "దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని" విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతు సమస్యలు, రుణమాఫీ అంశాలను పట్టించుకోని కేసీఆర్, కేటీఆర్‌లు ఇప్పుడు రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకకాలంలో దాదాపు రూ.20 వేల కోట్ల రైతు రుణమాఫీ చేసి దేశ చరిత్రలో నిలిచే నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. అయితే కేవలం రూ.12 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ జరిగిందని కేటీఆర్ అసత్య ప్రచారం చేయడం ఆయన నైజాన్ని తెలియజేస్తోందన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా రైతులే రుణమాఫీ అమలు తీరు గురించి చెబుతారని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పాలనలో "వరి వేస్తే ఉరే" అంటూ రైతుల్లో అయోమయం సృష్టించారని, పత్తి, సన్నవడ్ల సాగుపై గందరగోళ పరిస్థితులు తీసుకువచ్చారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సన్న వడ్లు పండించిన రైతులకు రూ. 1,740 కోట్ల బోనస్ చెల్లించి ఆదుకుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నష్టాలను భరిస్తూ కూడా మార్క్‌ఫెడ్ ద్వారా మక్కజొన్నలను కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర కల్పిస్తోందని పేర్కొన్నారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, రైతుల పక్షాన ప్రభుత్వం ఎల్లప్పుడూ నిలుస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లడమే బీఆర్ఎస్ పనిగా పెట్టుకుందని, రాష్ట్ర రైతాంగం మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వంపై పూర్తి విశ్వాసంతో ఉందన్నారు. ఎన్ని కుట్రలు చేసినా రైతులు కాంగ్రెస్ పార్టీ వెన్నంటే ఉంటారని విజయరమణారావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య పాల్గొన్నారు.

# ఆధునిక వైద్య పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి:

● జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష





**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి మే 07:**రూ.39 లక్షల విలువైన నూతన వైద్య పరికరాల ఏర్పాటు పూర్తి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ నిర్వహించిన జిల్లా కలెక్టర్ పెద్దపల్లి, మే 7:పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆధునిక వైద్య పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ఆసుపత్రికి కొత్తగా వచ్చిన సుమారు రూ. 39 లక్షల విలువైన ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు పూర్తయ్యిందని తెలిపారు. చిన్నపాటి సాంకేతిక ప్రక్రియలు పూర్తయ్యిన అనంతరం ప్రభుత్వ విప్ చేతుల మీదుగా వీటి ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన పరికరాలను సమర్థవంతంగా వినియోగించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రతిరోజూ సుమారు వెయ్యి మంది ఓపీ రోగులు ఆసుపత్రికి వస్తున్నందున, వారికి అవసరమైన సేవలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఫార్మసీ విభాగాన్ని పరిశీలించి మందుల లభ్యతపై ఆరా తీశారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన స్లిట్ ల్యాంప్, 90డి లెన్స్, సి-ఆర్మ్ మిషన్, యూరాలజీ పరికరాలు, స్పిరోమీటర్, ఆడియోమీటర్, ఫైబర్ ఆప్టిక్ లారింగోస్కోప్, డెర్మా చెయిర్, అల్ట్రాసౌండ్ మిషన్, హీటింగ్ ప్యాడ్, చెస్ట్ వైబ్రేటర్, రూట్ కెనాల్ చికిత్సకు అవసరమైన ఎండోమోటర్, మైక్రోమోటర్ హ్యాండ్‌పీస్ తదితర ఆధునిక పరికరాల వినియోగంపై కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ తనిఖీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. శ్రీధర్, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కురుమ కార్పొరేషన్ కు సహకరించిన సీఎంకు శనార్తులు...

● ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య.



**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి మే 07:**తెలంగాణ రాష్ట్రంలో కురుమ సమాజ ఆత్మగౌరవాన్ని నిల బెట్టే దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కురుమ కార్పొరేషన్ ఏర్పాటు నిర్ణయం చారిత్రాత్మకమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా కురుమ సమాజం కోరుతున్న కోరికను కురుమ ఏకైక ఎమ్మెల్యేగా తాను అడగగానే కురుమ కులాన్ని గౌరవించిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి వెంటనే నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి , రాష్ట్ర ప్రభుత్వానికి , సంబంధిత మంత్రివర్గానికి స్థానిక శాసన సభ్యులు బీర్ల అయిలయ్యకు యావత్ కురుమ సమాజం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కురుమ సమాజం తరఫున తమ మాటను వినిపించగా , వెంటనే స్పందించి కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. కురుమ సంఘం అభివృద్ధి , సంక్షేమం , ఆర్థిక పురోగతిని దృష్టిలో పెట్టుకొని తీసుకున్న ఈ నిర్ణయం సమాజానికి కొత్త నమ్మకాన్ని ఇచ్చిందన్నారు. అలాగే కురుమ సమాజానికి సేవ చేసే నాయకుడిని త్వరలోనే కార్పొరేషన్ చైర్మన్‌గా నియమిస్తామని ప్రభుత్వం ప్రకటించడం మరింత ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. ఈ ప్రజా ప్రభుత్వం అన్ని కులాలను సమానంగా గౌరవిస్తూ , బీసీల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ సామాజిక న్యాయం దిశగా ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కొనియాడారు. చివరిగా కురుమ సమాజం తరఫున మరోసారి రాష్ట్ర ప్రభుత్వానికి , ముఖ్య మంత్రికి, మంత్రివర్గానికి ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# గృహ నిర్మాణ అంశాలపై మంత్రి పొంగులేటి సమీక్ష...

● హాజరైన భువనగిరి ఆలేరు శాసనసభ్యులు.







**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి మే 07:** హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం రోజు ఉమ్మడి నల్గొండ జిల్లాకు సంబంధించిన రెవెన్యూ , గృహ నిర్మాణ అంశాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వం విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య , భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలేరు భువనగిరి శాసనసభ్యులు కలసి మాట్లాడుతూ గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించిన యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట , ఆలేరు ప్రాంతాల్లో 22ఏ కింద నిషేధిత జాబితాలో నమోదైన పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన సుమారు 20 వేల ఇళ్లు , ఇళ్ల స్థలాలను నిషేధిత జాబితా నుండి తొల గించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరినట్లు తెలిపారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ సమస్యను తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని సిసి ఎల్‌ఏ అధికారుల తో పాటు జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. అలాగే యాదగిరి గుట్ట రిజిస్ట్రేషన్ కార్యాలయానికి నూతన భవనం మంజూరు చేయాలని కోరగా , దీనిపై కూడా మంత్రి సాను కూలంగా స్పందించి నట్లు తెలిపారు. అదేవిధంగా తుర్కపల్లి మండలానికి అదనంగా మరో 50 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని కోరగా, వాటి మంజూరుకు చర్యలు తీసు కుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇంకా తుర్కపల్లి మండలం మల్కాపూర్ గ్రామంలో గతంలో నిర్మించిన ఇళ్లను ఫారెస్ట్ భూములుగా గుర్తించడం వల్ల కొత్త ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు నిలిచిపోయిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే సంబంధిత భూములను ఫారెస్ట్ జాబితా నుండి తొలగించి ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అదే విధంగా పెరిగిన రేషన్ కార్డుల సంఖ్యకు అనుగుణంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కొత్త రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయాలనగానే మంత్రి సానుకూలంగా స్పందించి నట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి జాప్యం జరగకుండా రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని , అలాగే కొనుగోలు చేసిన ధాన్యం రవాణాలో కూడా ఆలస్యం లేకుండా అందుబాటులో ఉన్న వాహనాలను వినియోగించు కునేలా చర్యలు తీసు కోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లాకు సంబంధించిన అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

# కాంగ్రెస్‌లోకి బిఆర్ఎస్ సర్పంచ్ చేరిక

● ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో కండువా కప్పుకున్న రామ్‌లాల్



**నల్లబెల్లి, మే 7 ప్రజావాణి:**మండలంలోని అర్వాయ్యపల్లి గ్రామపంచాయతీలో రాజకీయ సమీకరణాలు మారాయి. ఆ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ మాలోత్ రామ్‌లాల్ గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తన నివాసంలో రామ్‌లాల్‌కు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేసే వారికి కాంగ్రెస్ పార్టీలో ఎల్లప్పుడూ తగిన ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు మాలోతు రమేష్ నాయక్, ఎర్రబెల్లి రఘుపతిరావు, తేజావత్ సమ్మయ్య నాయక్, కంచ రవి తదితరులు పాల్గొన్నారు.

# పలాస డివిజన్లో ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో భారీగా వసూలు చేస్తున్న ఫీజులు

- నిబంధనలకు బిన్నంగా నడిపిస్తున్న ప్రైవేటు ఐటీఐ కాలేజీలు.
- విద్యార్ధులు వద్ద భారీగా వసూలు చేస్తున్న ఫీజులు
- పైసలు ఇస్తే ఆఫ్లైన్లో పరీక్షకు వెళ్ళకుండానే పాస్ చేస్తారట?.





**పలాస ప్రజావాణి ప్రతినిధి :** ప్రభుత్వము ఐటిఐ పూర్తి చేసిన వారికి పరిశ్రమల్లో , ప్రైవేటు కంపెనీలు లో ఉపాధి అవకాశాలు కోసము ఏర్పాటు చేసిన ఐటిఐ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు మోసము జరుగుతుందని పలువురు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.. పలాస డివిజన్లో నడుస్తున్న ప్రవేట్ ఐటీఐ కళాశాలలు నిబంధనలు పాటించడం లేదని పలువురు పేర్కొంటున్నారు..నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ ప్రైవేట్ ఐటీఐ కళాశాలలు నడుస్తున్నాయని ఇక్కడ చర్చ జరుగుతుంది. ముఖ్యంగా రికార్డుల్లో ఉండే విద్యార్ధులు సంఖ్యకు ఆచరణలో కళాశాలకు వస్తున్న విద్యార్ధులకు పొంతన లేకుండా ఉందనీ తెలిసింది.ఐటీఐ కళాశాలలకు రాకుండా పరీక్షల్లో ఉత్తీర్ణులు గా చేస్తున్నారని పలువురు ఆరోపణలున్నాయి..ఐటిఐ కళాశాలలో ట్రేడలకు సంబంధించిన టీచర్లు లేకుండా క్లాసులు జరిపిస్తున్నారని విమర్శలున్నాయి ...మెజార్టీ ప్రైవేట్ ఐటీఐ కాలేజీలు నిలువుదోపిడీ చేస్తున్నరన్న విమర్శలున్నాయి. నిబంధనలు గాలికి వదిలేసి విద్యార్థుల నుంచి ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నారని పలు సంఘాలు ఆరోపణలు చేస్తూనారు.ప్రశ్నిస్తే విద్యార్థులు, వారి తల్లిదండ్రులను బెదిరిస్తూ.. ఈ ఫీజుల దందాను యథేచ్ఛగా కొనసాగిస్తుయని ఆరోపణలు ఉన్నాయి.. నిజానికి ఐటీఐ కళాశాలలో ఆయా ట్రేడ్ల ను భట్టి ఫీజులు వసూలు చేయాల్సి ఉండగా దీనికి విరుద్ధంగా 40 వేల నుంచి 50 వేల రూపాయల వరకు ఐటిఐ విద్యార్థుల వద్ద నుంచి వసూలు చేస్తున్నారని కొందరు విద్యార్థులు వాపోయారు. రెండు సంవత్సరాల సంబంధించిన కోర్సు కు (ఫిట్టర్/ఎలక్ట్రీషన్ ల కోర్సు లకు 20వేలు రూపాయలు వరకు విద్యార్డులు నుంచి ఫీజులు వసూలు చేయాల్సి ఉండగా 40 వేల నుంచి 50 వేల రూపాయలు వరకు ఫీజులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.. దీనికి తోడు ట్యూషన్ ఫీజు అడ్మిషన్ ఫీజు ,ఎగ్జామినేషన్ ఫీజు ,పరీక్షల ఫీజులు అదనంగా వసూలు చేస్తున్నారనీ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా యూనిఫారం కు చెందిన ఫీజులు వసూలు చేస్తున్నారన్న అని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.. ప్రైవేట్ ఐటిఐ లో విద్యార్థులకు జరుగుతున్న అన్యాయాలకు సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని నిజాలను వెలుగు లోకి తేవాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి..

# కూలీల సంక్షేమమే ధ్యేయం రంగాపురంలో ఉపాధి హామీ సదస్సు

- పనికి తగిన వేతనం కొలతలపై అవగాహన



**నల్లబెల్లి, మే 7 ప్రజావాణి:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలు తమ హక్కులు, పనుల విధానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలనిఅధికారులు సూచించారు. గురువారం మండలంలోని రంగాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో కూలీలకు భారీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఉదయం 7 గంటలకే ప్రారంభమైన ఈ కార్యక్రమంలో అధికారుల బృందం కూలీలతో ముఖాముఖి చర్చించింది.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.కూలీలు చేసిన పనికి తగిన వేతనం పొందేలా మెజర్మెంట్ (కొలతల) విధానంలో మార్పులు తెచ్చినట్లు వివరించారు. పనుల్లో పారదర్శకత పాటించడం ద్వారానే సకాలంలో వేతనాల చెల్లింపు సాధ్యమవుతుందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ పనిదినాలను సద్వినియోగం చేసుకోవాలని, పనుల వద్ద ఎండ తీవ్రత దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా వివరించారు.కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ ఓరుగంటి మాధురి రాజు మాట్లాడుతూ. కూలీలకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే గ్రామ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి రామారావు, ఫీల్డ్ అసిస్టెంట్ సుమన్ తోటకూరి కూలీల సందేహాలకు సమాధానాలిచ్చారు. వేతనాల చెల్లింపులో జాప్యం జరగకుండా చూడాలని కూలీలు కోరగా, అధికారులు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సిబ్బందితో పాటు కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డ్రంకెను డ్రైవ్ మరియు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వ్యక్తులకు జరిమానా

**ప్రజావాణి శాయంపేట:** పోలీసుస్టేషన్ కు చెందిన డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వక్తులకు మరియు రోడ్లపై న్యూసెన్స్ చేసిన వ్యక్తులకు, బహిరంగ ప్రదేశాలలో మద్యం త్రాగిన వక్తులకు, జరిమానా. విధించారు

1)పిట్టల యుగేందర్ R/o పరకాల,

2) ఆలేటి ప్రవీణ్ R/o కొత్తగట్టు సింగారం

3) పుష్పేందర్ R/o మధ్యప్రదేశ్ 4)బొంద శ్రీను R/o హైదరాబాద్ ,. అను వ్యక్తులకు 4600/- జరిమానా వేసినారు..

అర్థ రాత్రి రోడ్లపై తాగుతూ న్యూసెన్స్ చేసిన ఆకతాయి మారపెల్లిరఘు వర్మ S/o రమేష్, R/o శాయంపేట అను వ్యక్తికి 1000/- జరిమానా వేసి మరో సారి ఇలా అర్థ రాత్రి న్యూసెన్స్ చేస్తే జైలుకు పంపుతా అని హెచ్చరించారు..సెకండ్ క్లాస్ ఇంచార్జ్ .మేజిస్ట్రేట్ శ్రీవల్లి శైలజ మరోకసారి డ్రింక్ చేసి వాహనం నడిపితే జైలుకు పంపిస్తా అని హెచ్చరించారు.

# మొక్కల కొనుగోలు పై రైతుల పోరుబాట

- ఎం సిపిఐ యు మండల కమిటీ ఆధ్వర్యంలో రాస్తారోకో
- నేటి నుంచి కొంటామని అధికారుల హామీ





**నల్లబెల్లి, మే 7 ప్రజావాణి:** నెల రోజులుగా వేచి చూస్తున్నా మొక్కజొన్న కొనుగోలులో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ నల్లబెల్లి మండల రైతులు గురువారం కదం తొక్కారు. ఎం సి పి ఐ యు. మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ యార్డు సమీపంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు రైతులు తమ ఆవేదనను తెలియజేస్తూ రోడ్డుపైనే మొక్కజొన్న కుప్పలకు నిప్పు పెట్టడం, ధాన్యాన్ని పారబోయడం వంటి చర్యలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి దామ సాంబయ్య, సహాయ కార్యదర్శి మార్త నాగరాజు మాట్లాడుతూ. రైతు నాలుగు నెలలు కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి దిక్కులేకుండా పోయిందని మండిపడ్డారు. లారీలు, ట్రాక్టర్లు రోడ్డుపైనే పడిగాపులు కాస్తున్నా ప్రభుత్వం కళ్ళు తెరవడం లేదు. వర్షాకాలం ముంచుకొస్తోంది, మరోవైపు అప్పుల వడ్డీలు పెరుగుతున్నాయి. వెంటనే కల్లాల్లో ఉన్న ప్రతి గింజా కొనుగోలు చేయాలి అని డిమాండ్ చేశారు. తక్షణమే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకుంటే కలెక్టరేట్ను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.రైతుల ఆందోళనతో ప్రధాన రహదారిపై ట్రాఫిక్ స్తంభించిపోయింది. సమాచారం అందుకున్న నల్లబెల్లి తహసీల్దార్ ముప్పు కృష్ణ, ఎస్సై సాయి ప్రసన్న కుమార్ తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. రైతులను శాంతింపజేసేందుకు వారితో చర్చలు జరిపారు.శుక్రవారం నుంచే నల్లబెల్లి మార్కెట్ యార్డ్లో మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను ప్రారంభిస్తామని, రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.అధికారుల హామీతో రైతులు తాత్కాలికంగా నిరసన విరమించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే సమ్మర్ క్యాంప్ ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

- పాఠశాలలో మాట్లాడుతున్న ఎంఈవో గుజ్జులనరసింహారెడ్డి






**చిలుకూరు మే07(ప్రజావాణి)::** చిలుకూరు మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే సమ్మర్ క్యాంప్ ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో గుజ్జుల నరసింహారెడ్డి అన్నారు. గురువారం చిలుకూరులో పీఎం శ్రీ జిల్లా పరిషత్ పాఠశాలలో సమ్మర్ క్యాంప్ నిర్వాహణపై నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు 'అర్హులని తెలిపారు. ఈనెల 11వ తేదీ నుండి 25వ తేదీ వరకు ఈ సమ్మర్ క్యాంపు నిర్వహిస్తారని తెలిపారు. సమ్మర్ కాంప్ లో విద్యార్థులకు ఆటలతో పాటు క్విజ్, ఆర్ట్ డాన్స్, స్కిల్ దెవలప్మెంట్ నేర్పించనున్నట్లుగా తెలిపారు. సమ్మర్ క్యాంపుకు వచ్చే విద్యార్థులు తప్పనిసరిగా తల్లిదండ్రుల అనుమతి పత్రం తీసుకొని రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజారాం, ఉపాధ్యాయులు కోదండ రామయ్య రామారావు రవికుమార్ పిడి రేణుక తదితరులు పాల్గొన్నారు.

# విద్య, వైద్య మౌళిక వసతుల నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- విద్య, వైద్య మౌళిక వసతుల నిర్మాణ పనులపై సమీక్షించిన జిల్లా కలెక్టర్





**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి :** జిల్లాలో కొనసాగుతున్న విద్య, వైద్య మౌళిక వసతుల అభివృద్ధి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు నాణ్యమైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ గురువారం కలెక్టరేట్లో సంబంధిత శాఖల అధికారులతో కలిసి విద్య, వైద్య రంగాల మౌళిక వసతుల నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించారు.జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, పనులను నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా జిల్లాలో 15 జూనియర్ కళాశాలల మరమ్మతు పనులు, అమ్మ ఆదర్శ పాఠశాల పనులు చేపడుతున్నట్లు తెలిపారు.ఇకపై నిర్వహించే ప్రతి సమీక్ష సమావేశానికి ప్రాజెక్ట్ వారీగా ఎదురవుతున్న సమస్యలను స్పష్టంగా నివేదికల్లో పొందుపరచాలని అధికారులను ఆదేశించారు. విద్య, వైద్య మౌళిక వసతుల అభివృద్ధి పనుల్లో ఎదురయ్యే ఏవైనా సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.టీజీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో 50 లక్షలకు పైబడిన 11 ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని, తిరుమలాయపాలెంలో 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ను 50 పడకలకు విస్తరించడం, జిల్లాలో జరుగుతున్న 100 పడకల ఆసుపత్రుల నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.టీజీఈడబ్ల్యూఐడీసీ ద్వారా 50 లక్షలకు పైబడిన 24 ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. అన్ని భవిత కేంద్రాల పనులను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని, వైరా జూనియర్ కళాశాల అదనపు తరగతి గదుల టెండర్ ప్రక్రియను త్వరగా ముగించాలని తెలిపారు.కెజిబివి పనులను సమయానికి పూర్తి చేయడంతో పాటు నిధులను క్రమం తప్పకుండా వినియోగించాలన్నారు. 14 కేజీబీవీ పనులకు నాబార్డ్ నిధులు మంజూరైనందున పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో పీఆర్ ఎస్ఈ వై. వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ ఎం. యాకోబు, టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ బుగ్గయ్య, టీజీఎంఎస్ఐడీసీ ఈఈ టి. ఉమా మహేష్, ఆర్ అండ్ బి ఈఈ ఎం.ఎ. బషీర్, పీఆర్ ఈఈ యు. మహేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలి : డీఎల్పీఓ నాగరాజా




**మన ప్రజావాణి చౌడేపల్లి, మే 7** పంచాయతీలకు సంబంధించిన పన్నుల వసూళ్లలో ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలపై గ్రామీణ ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని మదనపల్లి డీఎల్పీఓ నాగరాజా సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.మారుతున్న పరిపాలనా విధానాలకు అనుగుణంగా పంచాయతీ కార్యదర్శులు తమ పనితీరులో మార్పు తీసుకురావాలని, ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. గ్రామీణ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా కృషి చేయాలని అన్నారు. గ్రామాల్లో చేపట్టే ప్రతి పనికి సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు నవీకరించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం లేదా నిబంధనల అతిక్రమణ జరిగితే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.అనంతరం పన్నుల వసూళ్లు, తాగునీటి సమస్యలు, కాలువల నిర్వహణ, పైపులైన్ వ్యవస్థ వంటి అంశాలపై కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో ప్రజా సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో ఎస్.ఏ. గఫూర్, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


# సిపిఎం .సిఐటియు ఆధ్వర్యంలో మేడే



**గరిడేపల్లి ప్రజావాణి మే 7** :గరిడేపల్లి మండలం కీతవారిగూడేం లో సిపిఎం . సి ఐ టి యు ఆధ్వర్యంలో మేడే కార్యక్రమం చేయటం జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి షేక్ యాకోబు హాజరైనారు కార్యక్రమానికి అధ్యక్షుడిగా సిపిఎం పార్టీ శాఖకార్యదర్శి సుందరి వీర రాఘవయ్య అధ్యక్షత న జరిగినది ఇట్టి కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం పార్టీ మండల కార్యదర్శి షేక్ యాకోబు సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు తుమ్మల సైదయ్య మాట్లాడుతూ అమెరికా దేశంలోని చికాగో నగరంలో కార్మికులు 14 గంటలుపని విధానాన్ని 8 గంట లు అమలు చేయాలని పెద్ద ఎత్తున ధర్నా చేస్తున్న క్రమంలో అక్కడున్నటువంటి పెట్టుబడిదారులు పోలీసు యంత్రాంగంతో కాల్పులు జరపడం జరిగినది ఆ కాల్పులలో వేలాదిమంది కార్మికులు మరణించడం జరిగినది ఆ పోరాట ఫలితమే మేడే ఈనాడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్నటువంటి ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం పార్టీ ఉద్యమిస్తున్నదని అన్నారు ఈ కార్యక్రమంలోసిఐటియు నాయకులు అమరగాని గురవయ్య జుట్టు కొండ వెంకటేశ్వర్లు బొల్లేపల్లిశ్రీనివాసు ఆవుల సైదులు ఎల్లావులనారాయణ జుట్టు కొండమట్టయ్య సుందరి రమాదేవి జుట్టు కొండ కలమ్మ పాలెల్లి జంగయ్య జుట్టు కొండ వీరస్వామి పెండెం ధనమూర్తి పాలెల్లి సూరయ్య బంగారు శ్రీనివాసు కొత్తకొండ సైదులు భూతం నాగరాజు తుమ్మల వెంకటేశ్వర్లు పెండెం శేఖర్ జుట్టు కొండశ్రీనివాసు పెదమర్తి సైదులు దొంతగాని లక్ష్మయ్య ఇండ్ల వెంకటేష్ బంగారు రాజేష్ పాలెల్లి రాజు పోలంపల్లి గోపయ్య షేక్ సైదులు ఎడ్ల పిచ్చమ్మ బండారు రాంబాబు గూడెపురాములు పెదమర్తి వెంకటయ్య అమరగాని వెంకటయ్య మరియు తదితరులు పాల్గొన్నారు

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక విద్యుత్ శాఖ అధ్వర్యంలో





**పాల్వంచ/మన ప్రజావాణి (మే 07):** ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం రోజు ఉదయం 9.00 నుండి 12.00 వరకు జగన్నాధపురం రైతు వేదికలో ఈ కార్యక్రమం నిర్వహించబడినది. విద్యుత్ శాఖకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాల వివరాలు, విద్యుత్ శాఖచే అమలుపరుస్తున్న పలు పథకాలు, గృహజ్యోతి, పి.ఎం.జె.యు.జి.ఎం, పి.ఎం.కె.యు.ఎస్.యు.ఎం, ప్రజా బాట, విద్యుత్ వినియోగదారులకు, రైతులకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాలు, విద్యుత్ ప్రమాదాలపై రైతులకు, విద్యుత్ వినియోగదారులకు అవగాహన, వీటిపై విద్యుత్ శాఖ తీసుకున్నటువంటి భద్రతా చర్యలు మొదలగునవి వివరించడం జరిగినది. ఈ కార్యక్రమానికి పాల్వంచ మండల ఎంపీడీవో, అగ్రికల్చర్ ఆఫీసర్, మండల పరిధిలోని సర్పంచులు, అధికారులు, పాల్వంచ మండల విద్యుత్ వినియోగదారులు, రైతులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం గండుగులపల్లి కార్యక్రమంలో వివరించిన ఎమ్మెల్యే జారె





**గండుగులపల్లి,ప్రజావాణి న్యూస్ , మే 7:**దమ్మపేట మండలం గండుగులపల్లి రైతువేదికలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతిప్రణాళిక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది వ్యవసాయ విద్యుత్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహన సమావేశానికి అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు రైతులకు మరియు ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సేవలు సంక్షేమ పథకాలు వ్యవసాయ రంగ అభివృద్ధి సబ్సిడీ ద్వారా అందిస్తున్న రుణాలు యాంత్రికరణ పనిముట్ల సరఫరా గురించి రైతులకు వివరించారు విద్యుత్ శాఖ ద్వారా ప్రజలకు అందుతున్న గృహజ్యోతి 24 గంటల ఉచిత కరెంట్ నూతనంగా చేపట్టిన సోలార్ విద్యుత్ ప్రాజెక్టుల ప్రయోజనాలను వివరించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు అలాగే ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఎమ్మెల్యే అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని గ్రామీణాభివృద్ధి మరియు రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి బాబురావు,జిల్లా విద్యుత్ అధికారి మహేందర్,రెండు శాఖల ఉన్నతాధికారులు,ఆత్మ కమిటీ చైర్మన్ సుంకపల్లి వీరభద్ర రావు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ప్రజాప్రతినిధులు రైతులు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు

## భూ భారతి దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలి...

- జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి.





**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి మే 07:**భూ భారతి రెవిన్యూ సదస్సు లో వచ్చిన దరఖాస్తులు , సాదా బైనామా , ధాన్యం కొనుగోలు , ప్రభుత్వ భూములు పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి మండల తహసీల్దార్ లను ఆదేశించారు. గురువారం రోజున తన ఛాంబర్ లో మండల తహసీల్దార్ లతో భూ భారతి , రెవిన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి , సంబంధించిన అన్ని దరఖాస్తులను క్లియర్ చేయాలని అన్నారు. భూ భారతి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగ వంతం చేసి , కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం బస్తాలను లారీల ద్వారా సకాలంలో మిల్లులకు తరలించాలన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలనీ తెలిపారు. సాదా బైనమా దరఖాస్తులను పరిశీలించి , పరిష్కరించాలని అన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. ఈ కార్య క్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ , రెవిన్యూ డివిజనల్ అధికారులు కృష్ణా రెడ్డి , శేఖర్ రెడ్డి , మండల తహసీల్దార్ లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించకుంటే... 18 నుంచి నిరవదిక సమ్మె చేపడతాం

- వీవోఏ ల సంఘం జిల్లా నాయకురాలు పార్వతీబాయి.



**నేలకొండపల్లి ప్రతినిధి, మన ప్రజావాణి మే 7 గురువారం:**తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించకుంటే ప్రత్యక్ష ఆందోళన చేపడతామని వీవోఏ ల సంఘం జేఏసీ జిల్లా నాయకురాలు రాజపుత్ర పార్వతీబాయి హెచ్చరించారు. నేలకొండపల్లి ఐకేపీ ఏపీయం కు గురువారం సమ్మె నోటీసు ను అందించారు. పెన్ డౌన్ కార్యక్రమం ప్రారంభించారు. కార్యాలయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వీవోఏ లకు కనీస వేతనం రూ.20 వేల ను చెల్లించాలని డిమాండ్ చేశారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. అర్హత కలిగిన వారికి సీసీ లుగా పదోన్నతి కల్పించాలన్నారు. సాధారణ ఆరోగ్య భీమా సౌకర్యం రూ.20 లక్షలు, ట్యాబ్ సౌకర్యం కల్పించాలని, 58 జీవో ను సవరించాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అన్నారు. లేని పక్షంలో ఈ నెల 18 నుంచి నిరవదిక సమ్మె ను చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు గుత్తికొండ రాణి, పి.శ్రీలక్ష్మి, సి.హెచ్.సుధారాణి, ఎస్.ఉమామహేశ్వరీ, బీ.రేణుక, సత్యవతి, ప్రమీలా, బాజా వనజ, కృష్ణకుమారి, శైలజ, సుజాత, కె.పుష్పావతి, మరియమ్మ, బందెల రూప, రాజ్యలక్ష్మి, కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారం పంపిణీ



**రాయికల్: మే 07 (ప్రజావాణి):**రాయికల్ మండలం ఇటిక్యాల సెక్టార్ లోని దావన్ పల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో గ్రామ సర్పంచ్ మాలవత్ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు వేసవి సెలవుల సందర్భంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలు ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల పిల్లలకు మూడు నుండి ఆరు సంవత్సరాల పిల్లల యొక్క బరువులు ఎత్తులు తీసి తల్లులకు అవగాహన కలిగించి వారికి ఈ నెలలో 25 రోజులకు గాను ఇంటికి సరుకులు బియ్యం పప్పు, నూనె, గుడ్లు పాలు బాలామృతం, బాలమృతం ప్లస్ మరియు మురుకులు పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ ప్రసాద్ మాట్లాడుతూ తల్లులకు ఎండల యొక్క తీవ్రత బాగా ఉన్నందున పిల్లలు, గర్భిణీ స్త్రీలు, తల్లులు పెద్దలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వీలైనంతవరకు పానీయాలు అనగా కొబ్బరి నీళు ,, నీళ్లు ఎక్కువగా తీసుకోవాలని వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బానవత్ రవి, పంచాయతీ కార్యదర్శి మహేష్, అంగన్వాడి టీచర్ రోజా, ఆయా అమృత,తల్లులు గర్భిణీలు,బాలింతలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## సమ్మర్ హాలిడేస్ క్యాంపును విజయవంతంగా నిర్వహించాలి...

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు.







**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మే 07:**స్నేహ సమ్మర్ హాలిడేస్ క్యాంపును విజయవంతంగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. గురు వారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "స్నేహ-సమ్మర్ హాలిడేస్ క్యాంప్" కార్యక్రమం అమలుపై జిల్లా స్థాయి కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యరమానికి అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ బాలికల భద్రత , పోషణ , సాధికారత , ఆరోగ్య పరిరక్షణ లక్ష్యాలతో చేపడుతున్న "స్నేహా" కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో సమర్థ వంతంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాలలోని కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తూ , వారి వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. తల్లి దండ్రులు పిల్లల పట్ల శ్రద్ధ పెట్టి మంచి నడవకను పిల్లలకు అలవర్చాలని , తల్లి దండ్రులు క్రమశిక్షణతో ఉంటే పిల్లలు కూడా అదే క్రమ శిక్షణతో ఉంటారన్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి మహిళా శిశు సంక్షేమ శాఖ , వైద్య ఆరోగ్య శాఖ , విద్యా శాఖ , పోలీస్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి మాట్లాడుతూ సమ్మర్ హాలిడేస్ క్యాంపుల ద్వారా కిశోర బాలికలకు ఆరోగ్య పరి రక్షణ , పరిశుభ్రత, పోషకాహారం , బాల్య వివాహాల నివారణ , వ్యక్తిత్వ వికాసం , జీవన నైపుణ్యాలు నాయకత్వ లక్షణాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు డిఆర్డిఓ తెలిపారు. అదే విధంగా క్రీడలు,సాంస్కృతిక కార్యక్రమాలు , యోగా , కళా నైపుణ్యాల అభివృద్ధికి సంబంధించిన శిక్షణలు కూడా అందించ నున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో శోభారాణి , వైద్య ఆరోగ్యశాఖ అధికారి మనోహర్ , జిల్లా సంక్షేమ అధికారి నర సింహారావు , జిల్లా విద్య శాఖ అధికారి సత్య నారాయణ , యువజన క్రీడలు అధికారి ధనాంజనేయులు , జిల్లా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పల్లవి , కోశాధికారి అలివేలు అన్ని మండలాల ఏపీఎంలు , అంగన్వాడీ టీచర్లు సంబంధిత శాఖల అధికారులు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో అధికారులు ఉండాలనే లక్ష్యంతో గ్రామసభ

- "ఒక గ్రామం -- నాలుగు సందర్శనలు" కార్యక్రమంలో భూ సమస్యలపై అవగాహన





**మన ప్రజావాణి చౌడేపల్లి, మే 7** అన్నమయ్య జిల్లా చౌడేపల్లి మండలంలోని ఎ.కొత్తకోట గ్రామపంచాయతీ పరిధిలో "నెల రోజులు -- ఒక గ్రామం -- నాలుగు సందర్శనలు" కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తహశీల్దార్ పార్వతి హాజరై రైతులు, గ్రామస్తులతో నేరుగా మాట్లాడి పలు భూ సంబంధిత అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రైతులకు అధికారులు సులభంగా అందుబాటులో ఉండి, వారి సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రామసభల ద్వారానే సమస్యలను గుర్తించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గ్రామసభలో ముఖ్యంగా "నేషనల్ ఖాతా", "మ్యూటేషన్" మరియు "ల్యాండ్ ఎన్‌క్రోచ్‌మెంట్" అంశాలపై రైతులకు విపులంగా వివరించారు. నేషనల్ ఖాతా అంటే ఏమిటి? రాష్ట్ర ప్రభుత్వం భూముల వివరాలను డిజిటల్ రూపంలో భద్రపరచేందుకు నేషనల్ ల్యాండ్ రికార్డ్స్ ఆధారంగా ఖాతా వివరాలను నమోదు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. భూమి యజమాని పేరు, సర్వే నంబర్, విస్తీర్ణం, సాగు వివరాలు వంటి సమాచారం ఆన్‌లైన్‌లో నమోదై ఉండటం వల్ల భూ వివాదాలు తగ్గే అవకాశం ఉంటుం దని చెప్పారు. రైతులు తమ భూమి రికార్డులను సమయానికి పరిశీలించుకుని తప్పులు ఉంటే వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. మ్యూటేషన్ ప్రక్రియపై అవగాహన భూమి కొనుగోలు, వారసత్వం, బహుమతి లేదా ఇతర మార్పుల తర్వాత రెవెన్యూ రికార్డుల్లో యజమాని పేరును మార్చే ప్రక్రియనే "మ్యూటేషన్" అని తహశీల్దార్ వివరించారు. సరైన పత్రాలు సమర్పిస్తే అధికారులు రికార్డులను తనిఖీ చేసి అర్హత మేరకు మ్యూటేషన్ నమోదు చేస్తారని తెలిపారు. రైతులు రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే మ్యూటేషన్ చేయించుకోవడం వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తవని సూచించారు. భూ ఆక్రమణలపై హెచ్చరిక గ్రామాలలో చెరువులు, ప్రభుత్వ భూములు, రహదారులు లేదా ఇతర ప్రజా అవసరాల భూములను ఎవరూ ఆక్రమించకూడదని తహశీల్దార్ హెచ్చరించారు. "మన ఊరు -- మన చెరువు" అనే బాధ్యత ప్రతి గ్రామస్తుడిలో ఉండాలని పేర్కొన్నారు. ల్యాండ్ ఎన్‌క్రోచ్‌మెంట్ కారణంగా ప్రభుత్వ అధికారులపై ఒత్తిడి పెరగడంతో పాటు గ్రామాభివృద్ధికి ఆటంకం కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ దొరస్వామి, ఎంపీడీవో లీలా మాధవి, మండల సర్వేయర్ మురళీమోహన్, ఎ.కొత్తకోట తెలుగు దేశం పార్టీ నాయకులు మేకల మునిరాజా, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

## చెంచు గిరిజన సమస్యలపై స్పందించిన మార్కాపురం డి ఎఫ్ ఓ అబ్దుల్ రహీం



**నంద్యాల జిల్లా శ్రీశైలం ప్రాజెక్టు మే 7( ప్రజావాణి ):**మార్కాపురం డిఎఫ్ఓ కార్యాలయంలో మార్కాపురం డి.ఎఫ్.ఓ గారికి. అబ్దుల్ రహీం ను కొమరం భీం ఆదివాసి చెంచు గిరిజన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు వై ఆశీర్వాదం గూడెం టీటీడీఏ ప్రెసిడెంట్ కుడుముల చిన్నోడు. వారు ఆయనను కలిసి వినతి పత్రం ఇచ్చి సమస్యలను వారితో మాట్లాడుతూ మార్కాపురం జిల్లా దోర్నాల మండలం నక్కంటి పరిధిలో ఇష్టకామేశ్వరి గిరిజన గూడెంలో దాదాపు 35 కుటుంబాలు ఎన్నో దిశాబ్ద కాలం నుండి అక్కడ నివాసముంటున్న ఇష్టకామేశ్వరి చెంచు గిరిజన గూడాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాట్లు భాగంగా గూడెంలో నివాసం ఉంటున్న వారికి అడవి హక్కుల చట్టం కింద ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి ఇల్ల నిర్మాణం చేసుకుండేందుకు అనుమతులు ఇవ్వాలి గూడెంలో తాగునీటి సమస్య కోసం మంచినీటి బోర్ ఏర్పాటు చేసి ఇంటింటికి మంచి అందించే ఏర్పాటు చేయాలి. గూడెంలో సమస్యను పరిష్కరించాలి గూడెంలో సోలార్ ఏర్పాటు చేయాలి. దేవాలయం దగ్గర షెడ్డు ఏర్పాటు చేసి దర్శనం చేసుకొనే భక్తులు మంచి సౌకర్యాలు కల్పించాలి భక్తులకు ఇబ్బంది లేకుండా వర్షం పడిన ఎండ వచ్చిన ఇబ్బంది లేకుండా భారీ షెడ్లు ఏర్పాటు చేయాలి. అమ్మవారి టెంపుల్ అభివృద్ధి చేసుకునేందుకు అనుమతులు ఇవ్వాలి. ఇష్టకామేశ్వరి దేవాలయం వరకు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలి భక్తులకు అన్ని రకాల సదుపాయాలు అందేలా చేయాలి గ్రామం అభివృద్ధి కోసం మీరిచ్చే నాలుగు వేలల్లో 300 రూపాయలు కటింగ్ చేస్తున్నారు అదనంగా మీరుగాను వెయ్యి రూపాయలు కలిపి గ్రామ అభివృద్ధి అకౌంట్లో జమ చేయాలని బేస్ క్యాంపు టైగర్స్ టేకర్స్ ఈ రంగాల్లో పనిచేస్తున్న వారికి ప్రమోషన్లు జీతాలు పెంచాలి వారికి పని భద్రత ఆరోగ్య భద్రత. కల్పించాలి. ఫారెస్ట్ పరిధిలో పనిచేస్తున్న అదనంగా సెలవులు ఇవ్వాలి. నక్కంటి పరిధిలో ఉన్నటువంటి ఫారెస్ట్ తాత్కాల ఉద్యోగాలు ఈడీసీ చైర్పర్సన్తో చర్చించి వారికి ఉద్యోగ అవకాశాలు చెంచు గిరిజనులకు మాత్రమే కల్పించాలి ఇష్టకామేశ్వరి దేవాలయానికి దర్శనానికి వచ్చి మా గ్రామ అభివృద్ధి కోసం మాకు సాయం చేస్తున్న దాతలకి టికెట్ లేకుండా అనుమతులు ఇవ్వాలి నక్కంటి చెంచు గిరిజన గూడెంలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది పాత బోరు మరమ్మత్తు చేయాలి కొత్త బోర్ నిర్మించాలి వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేసి ఇంటింటికి కొలాయి ఏర్పాటు చేయాలి ఈ రెండు చెంచు గిరిజన గుడాల్లో సదుపాయాలు కల్పించుట కోరగా సమస్యలపై స్పందించిన ఆయన తక్షణమే ఈ సమస్యలు పరిష్కరించలా చూస్తానని చెంచు గిరిజన కుటుంబాలకు న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు ఆయన కలిసిన వారిలో కుడుముల చిన్నన్న చెవిలో పోతయ్యఈడీసీ చైర్ పర్సన్ చెవుల ఈదయ్య చెవుల బసవయ్య చెవుల బయమ్మ చిగుర్ల.వెంకటమ్మ. చిన్న ఈదయ్య. నాగమయ్య స్వామి. మళ్ళీ నాగయ్య చెవుల బసవయ్య. చెంచు గిరిజనులు తదితరులు

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

- మండల విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు.






**రాయపోల్.మే 07. ( ప్రజావాణి):**విద్యుత్ సమస్యల పరిష్కారానికి తమ సిబ్బందితో కలిసి నిరంతరం కృషి చేయడం జరుగుతుందని రాయపోల్ మండల విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అన్నదాత విద్యుత్ ప్రదాత అనే అంశంపై విద్యుత్ కన్స్యూమర్లకు అవగా హన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ . సోలార్ విద్యుత్తును వినియోగించుకునేవారు ముందుకు రావాలని సూచించారు. సబ్సిడీ ద్వారా సోలార్ పరికరాలను అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ పరంగా ఎలాంటి సమస్యలు ఉన్న రైతులు నేరుగా తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించుతామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు లేకుండా ఆ గ్రామాల ప్రజాప్రతినిధులు. రైతులు. ప్రజల సహకారంతో సమస్యలు లేకుండా దశలవారీగా సమస్యలను పరిష్కరించడానికి ప్రతినిత్యం మండల కేంద్రంలో అందుబాటులో ఉంటున్నామని ఆయన స్పష్టం చేశారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు కావలసినవారు తమ దృష్టికి తీసుకురావాలని తాము పరిశీలించి విద్యుత్ స్తంభాలను సిబ్బంది ద్వారా అందించి ఎలాంటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. లో వోల్టేజ్ సమస్య లేకుండా రైతులు డీడీలు కడితే వెంటనే కొత్త ట్రాన్స్ఫార్మర్ బిగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రైతులకు నాణ్యమైన విద్యుత్తు ను అందిస్తూ వ్యవసాయ బోరుబావులకు. గృహ అవసరాలకు విద్యుత్ సమస్య లేకుండా కృషి చేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించి సహకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాసంపల్లి రాజు.లైన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ గ్రామ రైతులు యువకులు తదితరులు పాల్గొన్నారు

# ఒడిసా, ఆంధ్రా సరిహద్దులను అడ్డగా చేసుకొని అక్రమ పశువులు రవాణా నడుస్తుంది

- ఇచ్ఛాపురం , కంచిలి జాతీయ రహదారి మీద గా హైదరాబాద్ కు పశువులు అక్రం వ్యాపారము..?
- వారానికి నాలుగు రోజుల సాగే పశువులు బిజినెస్ కోట్లల్లో సాగుతుంది.
- చూసి చూడనట్లు గా ఉంటున్న అధికారులు





**పలాస ప్రజావాణి ప్రతినిధి :**హిందువులు ఆరాధ్య దైవం గా భావిస్తున్న గోవులను అక్రమంగా కళేబరాలకు తరలి పోతున్నాయి. ప్రభుత్వాలు మారిన పశువులు అక్రం వ్యాపారము ఇక్కడ ఆగడం లేదని జంతు ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒడిసా ఆంధ్రా సరిహద్దు ప్రాంతాల్లో లను అడ్డగా చేసుకొని అక్రమ పశువులు రవాణా సాగుతుంది.శ్రీకాకుళం జిల్లాలోనీ ఇచ్ఛాపురం, కంచిలి జాతీయ రహదారి మీదుగా పశువులు అక్రం వ్యాపారము జోరుగా సాగుతున్నాయి..బరంపురం, శ్రీకాకుళం పట్టణాలకు చెందిన ఇద్దరు మధ్యవర్తులు ఇక్కడ పశువులు అక్రం వ్యాపారానికి కీలకంగా ఉన్నారూ.. ఒడిసా ఆంధ్రా సరిహద్దు వద్ద ఈ పశువులు అక్రం వ్యాపారానికి అడ్డగా ఉంది. చుట్టూ పక్కల ఉన్న గిరిజన ప్రాంతాల్లో నుంచి ఇక్కడకు భారీగా పశువులు వస్తాయి.పశువులూ తెచ్చేవారితో మధ్యవర్తులు బేరం కుదుర్చుకోవడం వల్ల ఇక్కడ పశువులు అక్రం వ్యాపారము మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతుంది.పశువుల అక్రమ రవాణాకు రహదారులు రాజమార్గాలు గా మారుతున్నాయి. గోవధ, పశువుల అక్రమ రవాణా నిషేధ చట్టాలు ఉన్నా అధికారుల కళ్లుగప్పి అక్రమార్జనకు తెరలేపుతున్నారు. ఈ క్రమంలో ముఠాగా ఏర్పడిన కొందరు వ్యక్తులు పశువుల అక్రమ రవాణాను నిరాటంకంగా కొనసాగిస్తున్నారు. హైదరాబాదుకు చెందిన కొందరు పశువధ చేసే వ్యాపారులు ఇచ్ఛాపురము నుంచి పశువులను వాహనాల్లో విజయ నగరము హైదరాబాద్ అలాగే ఇతర రాష్ట్రాలకు భారీగా పశువులు అక్రం వ్యాపారము నడుస్తుంది . జంతు ప్రేమికులను కలత చెందిస్తుంది. ఈ రవాణా అంతా పోలీసుల నిఘా తక్కువ ఉండే అర్ధ రాత్రి సమయంలో జరుగుతుండడం వల్ల గుట్టుచప్పుడు కాకుండా పశు రవాణా కొనసాగిస్తున్నారు.

అగ్రహము వ్యక్తము చేస్తూ న్న రైతులు!

పశు రవాణా నిబంధనలేంటి..

పాడి పశువులు, ఆవులు, దూడలు, ఎద్దులను వధించడం మన దేశంలో నిషేధం విధించినప్పటికీ యథేచ్ఛగా వధశాలలకు పశువులను తరలించడం నిత్యకృత్యంగా మారింది. కాగా వీటి తరలింపునకు ప్రత్యేక నిబంధనలున్నాయి. మూగజీవాలను రవాణా చేసే వాహనాలకు ప్రత్యేక రిజిస్ట్రేషన్ పత్రాలుతో పాటు జీవాలను తరలించడానికి ప్రత్యేక ఏర్పాట్లు కలిగి ఉండాలి. పశువుల రవాణా సమయంలో మూగజీవాలకు సరిపడా గాలి,మేత, నీరు వాటికి అందుబాటులో ఉండేటట్టు ఏర్పాట్లు చేయాలి. పెద్ద వాహనాల్లో పశువులను తరలించేటప్పుడు ఒక పశువు కోసం రెండు స్క్వేర్ మీటర్ల వంతున విడివిడిగా అరలను తయారుచేసి అందులో పశువులను తరలించవలసి ఉంటుంది. గూడ్స్ వాహనాల్లో పశువులను తరలించినా, పరిమితికి మంచి మూగజీవాలను తరలించినా భారీ జరిమానాతో పాటు తరలించే వ్యక్తులపై కేసులు కూడా నమోదు చేసే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని అక్రమ పశువులు బిజినెస్ ను ఆపాలని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు...

# ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తులు ఆహ్వానం

- రాయపోల్ ఎంపీడీవో శ్రీనివాస్.

**రాయపోల్.మే 07. (ప్రజావాణి):**ఎస్సీ కార్పొరేషన్ 2025-26 ఆర్థిక సంవత్సరమునకు గాను, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందుట గురించి రాయపోల్ మండల పరిధిలో ఆయా గ్రామాల నుంచి దరఖాస్తును ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో చిలుముల శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ అర్హులైన వారు దరఖాస్తుతోపాటు అవసరమైన సర్టిఫికెట్స్ తీసుకొని శుక్రవారం రోజు అనగా 08.05.2026 నాడు ఉదయము 10.30 గంటలకు మండల ప్రజాపరిషత్ కార్యాలయము రాయపోల్ నందు హాజరు కావలని ఆయన సృష్టించారు.
అర్హతలు ఆదాయం :1. ఆదాయ ధ్రువపత్రం రూ.1,50,000 లోపు వయసు: 21- 50 (వ్యవసాయేతర పథకాలు) 21- 60 (వ్యవసాయపథకాలు) అవసరమైన పత్రాలు 1. ఆధార్ కార్డు 2. రేషన్ కార్డు 3. కుల ధృవపత్రం 4. ఆదాయ ధృపత్రం 5. డ్రైవింగ్ లైసెన్స్ (ట్రాన్స్ పోర్ట్ స్కీమ్) 6. పట్టా పాస్ బుక్ (అగ్రికల్చర్ స్కీమ్ ) 7. సదరం సర్టిఫికెట్ 8. పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు జత చేసి గడువులోకి దరఖాస్తులు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

# నూతన దంపతులను ఆశీర్వదించిన అమ్మ పేట అంబేద్కర్ వారసులు



**మన ప్రజావాణి మధుర ఆర్ సిమే 7:** ముదిగొండ మండలం అమ్మపేట గ్రామం లో వివాహ కార్యక్రమంలో అంబేద్కర్ వారసులు మాట్లాడుతూ ఈ వివాహ వేడుక చాలా అద్భుతంగా జరిగింది. మమ్మల్ని పిలిచి, ఇంతటి ఆనందంలో భాగస్వాములను చేసినందుకు ధన్యవాదాలు. కొత్త జంటకు మా హృదయపూర్వక ఆశీస్సులు."ఈ కార్యక్రమం లో అమ్మ పేట అంబేద్కర్ వారసులు బొడ్డు బాబు , పూటూకురి రామారావు, పూటూకురి రాజేష్ కుమార్ , ఇరుకు వెంకటేశ్వర్లు పూటూకురి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు

# దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలు



**నంద్యాల జిల్లా శ్రీశైలం మే 7 (ప్రజావాణి):** లోకకల్యాణంకోసం దేవస్థానం ఈ రోజు (07.05.2026) ఆలయప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద నెలకొని ఉన్న శ్రీ దత్తాత్రేయ స్వామి వారికి విశేషపూజలను నిర్వహించింది.ప్రతి గురువారం దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది.ఈ పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజను జరిపించబడింది.ఆ తరువాత దత్తాత్రేయస్వామివారికి పంచామృతాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి. లోకోద్ధరణ కోసమై బ్రహ్మ,విష్ణు,మహేశ్వరులు ఒకే స్వరూపము లో దత్తాత్రేయునిగా అవతరించారు. అందుకే త్రిమూర్తి స్వరూపునిగా దత్తాత్రేయుడు ప్రసిద్ధుడు.కాగా శ్రీశైలక్షేత్రానికి దత్తాత్రేయుల వారికి ఎంతో దగ్గర సంబంధం ఉంది.ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద దత్తాత్రేయులవారు తపస్సు చేశారని ప్రతీతి. అందుకే ఈ వృక్షానికి దత్తాత్రేయ వృక్షమని పేరు.కాగా దత్తాత్రేయ స్వామివారు కలియుగంలో గోదావరితీరాన పిఠాపురంలో శ్రీపాదవల్లభునిగా జన్మించారు. వీరు ఒకసారి శ్రీశైలక్షేత్రంలోనే చాతుర్మాస్య వ్రతాన్ని ఆచరించినట్లుగా గురుచరిత్రలో చెప్పబడింది కాగా శ్రీపాదవల్లభుడు తమ శిష్యులకు ఆయా తీర్థక్షేత్రాల మహిమావిశేషాలను పేర్కొనే సందర్భంలో కూడా శ్రీశైలాన్ని పలుసార్లు ప్రస్తావించారు. శ్రీపాదవల్లభుల జన్మ తరువాత మహారాష్ట్రలోని కరంజినగరములో నృసింహసరస్వతి స్వామిగా దత్తాత్రేయస్వామివారు జన్మించారు.వీరు ఒకసారి మహాశివరాత్రి రోజున శ్రీశైలమల్లికార్జునుని సేవించినట్లుగా కూడా గురుచరిత్ర చెబుతోంది.నృసింహసరస్వతి వారు తమ అవతార సమాప్తిని శ్రీశైలంలోని పాతాళగంగలోనే చేశారు.కలియుగ ప్రభావం రోజు రోజుకు ఎక్కువకావడముతో, నృసింహసరస్వతీస్వామి అదృశ్య రూపములో ఉండి తన భక్తులను రక్షించాలని నిర్ణయించారు. దాంతో భౌతికదేహాన్ని త్యజించేందుకు నలుగురు శిష్యులతో కలిసి శ్రీశైలానికి వచ్చారు. శ్రీశైలంలోని కదళీవనం దగ్గర తమ శిష్యులు చూస్తుండగానే నృసింహసరస్వతిస్వామివారు అరటి ఆకులతో చేసిన ఒక ఆసనంపై కూర్చొని, కృష్ణానదిలో ప్రవేశించి, కొంతదూరం ఆ అరటిఆకులపైనే పయనిస్తూ, అదృశ్యమైనట్లు గురుచరిత్ర చెబుతోంది.

# మన ప్రజావాణి వార్త కథనానికి స్పందన

- అమ్మపేట బాధిత మహిళకు 5000 ఆర్థిక సహాయం చేసిన మల్లారపు ఉపేందర్
- బాధిత మహిళకు సహాయం అందించిన అంబేద్కర్ యూత్





**ముదిగొండ ప్రతినిధి మే 7 ప్రజావాణి**మన ప్రజావాణి వార్త కథనానికి స్పందించి ఆదివారం రాత్రి సంభవించినటువంటి భారీ తుఫాను పెనుగాలులకు రాయి చెట్టు పడి చిరు వ్యాపారం కోల్పోయిన బాధితురాలు ముదిగొండ మండలం అమ్మపేట గ్రామ నివాసి చెంగపొంగు నాగేంద్ర ను ఆదుకునేందుకు 5000 రూపాయల సహాయాన్ని జాతీయ హ్యూమన్ రైట్స్ కమిషన్ ముదిగొండ మండల అధ్యక్షులు మల్లారపు ఉపేందర్ ఇచ్చిన సహాయాన్ని చెంగపొంగు నాగేంద్రకు అమ్మపేట అంబేద్కర్ యూత్ కమిటీ సభ్యులు ముదిగొండ ప్రజావాణి రిపోర్టర్.ఊటుకూరి లక్ష్మణ్ ముప్పిడి నరేంద్ర, మునగాల గురవయ్య, దేగల లక్ష్మణ్, ముప్పిడి నాగరాజు, ఊటుకూరి పాపయ్య, కోట గోపి, చంగపొంగు నాగరాజు విహెచ్పిఎస్ అమ్మపేట గ్రామ అధ్యక్షులు ఊటుకూరు శీను తదితరులు కమిటీ సభ్యులు పాల్గొని సహాయాన్ని అందించారు. హ్యూమన్ రైట్స్ కమిషన్ ముదిగొండ మండల అధ్యక్షులుమల్లారపు ఉపేందర్ కు కమిటీ తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ఆపదలో ఉన్న మూగజీవాలకు ప్రజలకు విద్యార్థుల సమస్యలపై సామాజిక స్పృహతో స్పందిస్తూ తన వంతు సహాయం అందిస్తూ ముదిగొండ మండల ప్రజల ప్రశంసలు పొందుతున్న మల్లారపు ఉపేందర్ భవిష్యత్తులో కూడా ఇదే రకమైన సహాయ సహకారాలు అందించాలని అమ్మపేట గ్రామస్తులు మండల ప్రజలు ప్రజాసంఘాల నేతలు అంబేద్కర్ యూత్ కమిటీ సభ్యులు కోరారు.

# మీ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించండి



**రాయికల్; మే07 (ప్రజావాణి):**మీ పిల్లలు మన ఊరు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి అంటూ రాయికల్ మండలంలోని అల్లీపూర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎంబారీ గౌతమి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విలువలతో కూడిన విద్య నేర్పుతున్నారని, అందరూ వారి పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సర్పంచ్ అన్నారు.మార్చి 2026 లో జరిగిన పదవ తరగతి పరీక్షల యందు 100 శాతం ఉత్తీర్ణత సాధించారని విద్యార్థిని విద్యార్థులను గ్రామ సర్పంచ్ ఎంబారీ గౌతమి,ఉప సర్పంచ్,వినయ్,ఏఏపిసి చైర్ పర్సన్ అంజలీ, ప్రధానోపాధ్యాయులు కిరణ్ కుమార్ లను సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుర్రం శ్రీనివాస్,వసంతరావు, రవికుమార్,రతిలాల్ రాజశేఖర్,రాజన్న,జీవన్ రెడ్డి,శంకరయ్య, క్రిష్ణ ప్రసాద్,బడిబాటలో భాగంగా డీజే తో గ్రామంలోని వీధివీధికి తిరుగుతూ పాఠశాలల్లో అడ్మిషన్ల కొరకై ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంచారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# చేనేత సహకార సంఘానికి తక్షణమే ఎన్నికలు నిర్వహించాలి: బాసాని బాలకృష్ణ






**ప్రజావాణి శాయంపేట,** మండలంలోని చేనేత సహకార సంఘానికి వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని, నామినేటెడ్ పదవులు కాకుండా ప్రజల మధ్య పారదర్శక ఎన్నికలు జరగాలని అఖిలభారత పద్మశాలి సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి బాసాని బాలకృష్ణ డిమాండ్ చేశారు.ఆయన మాట్లాడుతూ, గత 8 ఏళ్లుగా చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా పర్సన్ ఇన్‌చార్జ్‌లతో పాలన కొనసాగించడం దురదృష్టకరమన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి గడువు పొడిగిస్తూ ఇప్పటివరకు సుమారు 18 దఫాలుగా ఇదే విధానం కొనసాగుతోందని విమర్శించారు.
ఎన్నికలు లేకపోవడంతో చేనేత కార్మికుల సమస్యలు పెరిగిపోయాయని, ప్రభుత్వ నిధులు సకాలంలో అందక సంఘాల పరిస్థితి దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలు జరిగితేనే చేనేత కార్మికుల సంక్షేమం మెరుగుపడుతుందని ఆయన అన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు చేనేత సహకార సంఘాల ఎన్నికలు కూడా నిర్వహించాలని కోరారు. అలాగే చేనేత సంఘాలకు వచ్చిన నిధులపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని, ప్రస్తుత పాలకవర్గం రాజీనామాను ఆమోదించి స్పెషల్ ఆఫీసర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు.చేనేత కార్మికులు ఎన్నో సంవత్సరాలుగా ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారని, వారి ఆశలు నెరవేర్చాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# రూ.3.5 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన అటవీ శాఖ అధికారులు



**భద్రాద్రి జిల్లా బ్యూరో/మన ప్రజావాణి (మే 07):** భద్రాచలం నియోజకవర్గంలోని భద్రాచలం డివిజన్ అటవీ శాఖలో అవినీతి వ్యవహారం బట్టబయలైంది. లంచం తీసుకుంటుండగా భద్రాచలం ఎఫ్‌డీవో సుజాత, చర్ల ఇన్‌చార్జ్ డీఆర్‌వో కృష్ణయ్యలను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన జిల్లాలో సంచలనంగా మారింది. వివరాల్లోకి వెళితే: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలంలోని పూసుగుప్ప ప్రాంతంలో రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనుల సమయంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న కొన్ని చెట్లను తొలగించినట్లు అధికారులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేయకుండా ఉండేందుకు భద్రాచలం ఎఫ్‌డీవో సుజాత బాధితుల నుంచి రూ.10 లక్షలు డిమాండ్ చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో గురువారం రోజు ఉదయం బాధితుడి నుంచి మొదటి విడతగా రూ.3.5 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ ఆధ్వర్యంలో అధికారులు దాడులు నిర్వహించారు. లంచం స్వీకరిస్తున్న సమయంలోనే సుజాతతో పాటు, చర్ల అటవీ శాఖ ఇన్‌చార్జ్ అధికారి కృష్ణయ్యను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో భద్రాచలం డివిజన్ అటవీ శాఖలో జరుగుతున్న అవినీతి వ్యవహారాలు వెలుగులోకి వచ్చాయని స్థానికులు చర్చించుకుంటున్నారు. కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

# ప్రభుత్వం సానుకూల చర్యలు తీసుకుని వికారాబాద్ జిల్లా రెవెన్యూ ఉద్యోగులకు న్యాయం చేయాలి..

- రెవెన్యూ అసోసియేషన్(ట్రెసా)అధ్యక్షులు -జి.విజయేందర్



**ప్రజా వాణి,వికారాబాద్ జిల్లా,మే 07:**ప్రస్తుతం జరుగుతున్న సాధారణ బదిలీలలో వికారాబాద్ జిల్లా రెవెన్యూ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది.జోనల్ పోస్టులుగా ఉన్న నాయబ్ తహసీల్దారులు,సీనియర్ అసిస్టెంట్లు,గిర్ధావర్లకు ప్రస్తుతం పనిచేసే స్టేషన్ (కార్యాలయ పరిధి)యొక్క కాల పరిమితిని లెక్కింపులోకి తీసుకొని ఒకే స్టేషన్లో నాలుగు సంవత్సరాలు పూర్తి కాలేదు అనే కారణంతో బదిలీలకు నోచుకోవట్లేదు.సాధారణంగా రెవెన్యూ ఉద్యోగులకు రెండు/మూడు సంవత్సరాలు అయిన పిమ్మటే అంతర్గత బదిలీలలో భాగంగా జిల్లా కలెక్టర్లు ట్రాన్స్ఫర్లు చేస్తున్నారు.దీనిని సాకుగా చూపి,ఒకే స్టేషన్లో నాలుగు సంవత్సరాలు పూర్తి కాలేదని, చార్మినార్ జోన్ పరిధిలో ఉన్న రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి,హైదరాబాద్,సంగారెడ్డి జిల్లాలకు బదిలీ చేయడం లేదు.వికారాబాద్ జిల్లా ఉద్యోగులపై వివక్ష చూపుతూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని రంగారెడ్డి,మేడ్చల్ జిల్లాలకు వికారాబాద్ జిల్లా ఉద్యోగులను రానివ్వకుండా ఈ యొక్క చిన్న తిరకాసుతో అన్యాయం చేస్తున్నారు.కావున ప్రభుత్వం ఈ విషయంపై సానుకూలంగా స్పందించి జోనల్ పరిధిలో ఉన్న ఉద్యోగులకు జిల్లా స్టేషన్ గా పరిగణించి ఈ యొక్క బదిలీలు పారదర్శకంగా జరగాలి.ముఖ్యమంత్రి ,మరియు స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ జిల్లాకు తగిన న్యాయం చేయాలని రెవెన్యూ ఉద్యోగులు ముక్తకంఠంతో కోరుతున్నారు. గత రెండు సంవత్సరాల క్రితం జరిగిన బదిలీలలో వికారాబాద్ జిల్లా నుండి 40 మంది పైగా ఉద్యోగులను కేవలం హైదరాబాద్ జిల్లాకు బదిలీ చేసి, హైదరాబాద్ జిల్లా ఉద్యోగులు వికారాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు.కానీ రంగారెడ్డి మేడ్చల్ జిల్లాలో ఉద్యోగులను బదిలీ చేయలేదు.సీసీఎల్ఏ కార్యాలయ ఉన్నతాధికారులు వికారాబాద్ జిల్లాకు తగు న్యాయం చేయాలి.

# ఎల్లంపల్లి మోడల్ స్కూల్లో విద్యార్థులకు సమ్మర్ క్యాంప్




**బెజ్జంకి, మే 7 (ప్రజావాణి):**సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల పరిధిలోని ఎల్లంపల్లి గ్రామ మోడల్ స్కూల్లో ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదివే విద్యార్థుల కోసం సమ్మర్ క్యాంప్--2026 నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ మాలోత్ సంగీత తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 11 నుంచి 25వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుండి క్యాంప్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సమ్మర్ క్యాంప్‌లో కంప్యూటర్ శిక్షణ, డ్యాన్స్, సంగీతం, క్రీడలు, మ్యూజిక్, యోగ, తదితర అంశాలలో ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయనున్నట్లు తెలుపుతూ, విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి, ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు సృజనాత్మకత అభివృద్ధి చెందేలా వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రిన్సిపల్ మాలోత్ సంగీత తెలిపారు.

# నరేంద్ర మోడీ బహిరంగ సభను జయప్రదం చేయండి

- బిజెపి రాష్ట్ర నాయకులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి

**నేలకొండపల్లి ప్రతినిధి, మన ప్రజావాణి మే 7 గురువారం:**వికసిత భారతావని లక్ష్యంగా దేశాన్ని ప్రగతి పథంలో పయనింప చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ అభివృద్ధిని కాంక్షిస్తూ ఈ నెల 10వ తేదీన 8 వేల కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేందుకు హైదరాబాద్ రానున్న నేపథ్యంలో పరేడ్ గ్రౌండ్స్ లో సాయంత్రం నాలుగు గంటలకు జరిగే బహిరంగ సభలో నరేంద్ర మోడీ ప్రసంగించనున్న నేపథ్యంలో ఖమ్మం జిల్లా నుండి పెద్ద ఎత్తున కార్యకర్తలు వేలాదిగా తరలి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బిజెపి రాష్ట్ర నాయకులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు కార్యక్రమం జయప్రదం చేసేందుకు జిల్లాలో పర్యటిస్తున్న శ్రీధర్ రెడ్డి స్థానిక కార్యకర్తలతో కలిసి నేలకొండపల్లి మండల కేంద్రంలో గోడ రాతల కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లా నుండి వేల మంది కార్యకర్తలు తరలింపు



వీలుగా ప్రత్యేక రైలును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నరేంద్ర మోడీ మూడవసారి ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా హైదరాబాదు రానుండడంతో ఈ సభకు అత్యంత ప్రాముఖ్యత ఏర్పడిందని శ్రీధర్ రెడ్డి అన్నారు ఇప్పటికే తెలంగాణను 2014 నుండి ఇప్పటి వరకు లక్ష కోట్లకు పైగా నిధులు కేటాయించి అభివృద్ధి చేసిన ఘనత ప్రధాని నరేంద్ర మోడీ ది అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల



అధ్యక్షుడు అనంత ఉపేందర్ గౌడ్ జిల్లా నాయకులు మన్నే కృష్ణరావు, మండల ప్రధాన కార్యదర్శులు మల్లెబోయిన గోవిందరావు, బాజా రామకృష్ణ, మండల ఉపాధ్యక్షులు పురాణం దివాకర్, నాయకులు షేక్ షర్ఫుద్దీన్, సూరెపల్లి జ్ఞానరత్నం, గెల్లా చక్రపాణి, సయ్యద్ మోహినూద్దీన్, కందరబోయిన గోపి, ఎలిగేటి నర్సింహారావు, ఎలిగేటి వెంకటేష్, జెల్లా సురేష్, బ్రమవరపు ఉదయ్, బానోతు, బ్రమవరపు నాగరాజు, కొదమగుండ్ల స్వామిదాసు, శ్రీనివాసరావు, దేశబోయిన వేణుబాబు, జోగుపర్తి నారాయణరావు, దమ్మలపాటి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ బోర్డు విలీనంపై ప్రభుత్వం పునర్ ఆలోచించాలి.

- ఎకనామిక్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు రావుల తిరుమల్.



**మంథని. మన ప్రజావాణి.** తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డును విద్యాశాఖలో విలీనం చేసే అంశంపై ప్రభుత్వం ఒకసారి పునరాలోచన చేయాలని తెలంగాణ ఎకనామిక్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావుల తిరుమల కోరారు ప్రత్యేకంగా కొనసాగుతున్న ఇంటర్మీడియట్ బోర్డును విలీనం చేయడం వల్ల విద్యార్థులపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు ప్రత్యేక బోర్డ్ ఉండడం వల్లనే జాతీయస్థాయి పరీక్షల్లో తెలుగు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు అన్నారు ఈ మార్పుల వల్ల విద్యార్థులు అధ్యాపకులు ప్రిన్సిపాల్ సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు ఇంటర్మీడియట్ అడ్మిషన్ల ప్రక్రియకు షెడ్యూల్ ప్రకటించిన బోర్డు వెంటనే దాన్ని రద్దు చేయడం తగదన్నారు పాఠశాలలో కళాశాలలు విలీనం చేయడం వల్ల అనేక సమస్యలు తలెత్త అవకాశం ఉందన్నారు ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని విలీనంపై మేధావులతో చర్చలు జరిపి నిర్ణయం తీసుకోవాలని కోరారు

# వ్యవసాయ శాఖ, విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రైతు వారోత్సవాలు

**షాబాద్,// మే 07 ( ప్రజావాణి ):**షాబాద్ మండల కేంద్రంలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ, విద్యుత్ శాఖల ఆధ్వర్యంలో గురువారం ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి, గుడి మల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో అన్ని శాఖల వారు సంయుక్తంగా కలిసి రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని కోరారు. వ్యవసాయ క్షేత్రాలు ప్రదర్శన, సౌర విద్యుత్ కేంద్రాలు, పిఎం - కుసుమ్, వ్యవసాయ యాత్రీకరణ-డ్రోన్స్ స్టాల్స్, వ్యవసాయ ట్రాక్టర్ పనిముట్లు, పవర్ ప్రేయర్స్, స్ట్రా బేలర్, ఇతర వ్యవసాయ పరికరాల ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిని ఉషా, జిల్లా ఉద్యానవన మరియు సెరికల్చర్ అధికారి సురేష్, కృషి విజ్ఞాన కేంద్రం మెట్ట వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డా. శ్రీ



కృష్ణ, షాబాద్ సర్పంచ్ అశోక్, నాగర్ గూడ సర్పంచ్ స్వాతి మహేందర్ గౌడ్, సంకెపల్లి గూడెం సర్పంచ్ లావణ్య చెన్నయ్య, మల్లారెడ్డి గూడెం సర్పంచ్ సభిత గోవర్ధన్ రెడ్డి, కొమరబండ సర్పంచ్ పద్మమ్మ గోపాల్, వివిధ గ్రామ పంచాయతీల సర్పంచులు, ఎలక్ట్రిసిటీ ఏఈ జీవి కోటేశ్వరరావు, ఐ ఎఫ్ ఎఫ్ సి ఓ



కంపెనీ జిల్లా సేల్స్ ఆఫీసర్ సాయి కృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారులు శివతేజ, రాజేశ్వరి, గీత, గాయత్రి, మౌనిక, లిఖిత, మండలంలోని వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, వివిధ గ్రామల రైతు సోదరులు, మండలంలోని ఎరువులు, పురుగుమందుల, విత్తన డీలర్లు, మాధవ రెడ్డి, నరేందర్ రెడ్డి, హాజీజ్, మల్లారెడ్డి, నరసింహారెడ్డి, ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ సి ఇ ఓ చంద్రశేఖర్ రెడ్డి, సభ్యులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు.

# ఇంటర్ బోర్డును పాఠశాల విద్యలో విలీనం చేయడం కరెక్టే

- మంతిని విద్యార్థి నాయకుడు దిగంబర్.



**మంతిని. మన ప్రజావాణి.** ఇంటర్ బోర్డును కళాశాల విద్యలో విలీనం చేయడం కరెక్టే అని విద్యార్థి నాయకుడు దిగంబర్ అన్నారు రాష్ట్రవ్యాప్తంగా 26 వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలు ఉంటే కేవలం 436 మాత్రమే ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి పాఠశాలలు కళాశాల సంఖ్యకు మధ్య భారీ అంతరం ఉంది గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్ విద్య అందుబాటులో లేకపోవడంతో డ్రాప్ అవుట్లు సంఖ్య పెరుగుతుంది 12వ తరగతి వరకు పాఠశాల విద్య గాని పరిగణిస్తారు 12వ తరగతి వరకు ఒకే చోట చదివితే విద్యార్థుల గురించి ఉపాధ్యాయులకు అవగాహన మరియు బంధం పెరుగుతుంది ఇవన్నీ కూడా విద్యార్థుల జీవితాలకు చాలా ఉపయోగపడతాయి కాబట్టి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే చాలా మంచిదని విద్యార్థి నాయకుడిగా తెలియజేస్తున్నాను

# మాజీ సైనికుల సంఘ సంక్షేమానికి కట్టుబడి ఉంటాం

- జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి ఏ శైలజ.

**పలాస ప్రజావాణి ప్రతినిధి :**మాజీ సైనికుల సంఘ సంక్షేమ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి ఏ శైలజ అన్నారు. గురువారం పలాస కాశీబుగ్గలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం భవనమందు సంఘా అధ్యక్షులు ఇళ్లా మన్మధరావు అధ్యక్షతన మాజీ సైనికులు వారి కుటుంబ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలాస పరిసర మండలాల్లో ఉండేటువంటి సైనికులు మరియు మాజీ సైనికుల యొక్క సమస్యలను అడిగి తెలుసుకుని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. మాజీ



సైనికుల కుటుంబ సభ్యులకు డిపెండెంట్ కార్డులు50 మందికి. మరియు మాజీ సైనికుల ఇంటి పన్ను రాయితీలు 10 మందికి . మాజీ సైనికుల పాత ఐడెంటి కార్డులు బదులుగా కొత్త కార్డులు 5 మందికి అందజేశారు. అలాగే మాజీ సైనికుల కుటుంబ సభ్యులకు 4 మంది వికలాంగుల సమస్యలను పరిష్కారం చేశారు ఈ కార్యక్రమంలో పలాస కాశీబుగ్గ మాజీ సైనికుల ఉపాధ్యక్షులు బంగారు బారి కి. కోశాధికారి ఉప్పాడ వెంకట్రావు. కార్యదర్శి కే నారాయణ రావు. సహాయ కార్యదర్శి బమ్మిడి బాబురావు. డి వెంకట్రావు . కే సూర్యనారాయణ . కె తారకేశ్వరరావు. ఎస్ విశ్వనాథం . కే సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో ఈదురుగాలుల కల్లోలం

- చేతికందిన పంట నేలపాలు
- పరదల కోసం పరుగులు తీసిన రైతాంగం





**జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్, ఎండపల్లి మే 07(ప్రజావాణి):**జగిత్యాల జిల్లాలోని ఎండపల్లి మండల వ్యాప్తంగా ప్రకృతి కన్నెర్ర చేసింది. సాధారణంగా వేసవి కాలంలో అకాల వర్షాల భయం ఉన్నప్పటికీ, ఈసారి ఆకస్మికంగా వీచిన ఈదురుగాలుల తీవ్రత రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చింది. గురువారం రోజున అప్పటివరకు ఎర్రటి ఎండ కాచి ఆకస్మికంగా ఈదురుగాలుల వీయడంతో రైతులు పరదల కోసం పరుగుల తీశారు. వరి కోతలు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో వీచిన ఈ గాలులు జనజీవనాన్ని అస్తవ్యస్తం చేయడమే కాకుండా, రైతన్నను కన్నీరు పెట్టిస్తున్నాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట ఈదురుగాలుల ధాటికి కుప్పకూలిపోయింది. గాలి వేగానికి వరి గోలకలు నేలవాలడంతో గింజలు రాలిపోయాయి. దీనివల్ల దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. నేలవాలిన పంటను హార్వెస్టర్ల యంత్రం ద్వారా కోయడం కష్టతరంగా మారింది. మిషన్లతో కోస్తే సగం ధాన్యం నేలపాలవుతుందని, కూలీలతో కోయిస్తే పెట్టుబడి వ్యయం రెట్టింపు అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పంట కోసి, ధాన్యాన్ని విక్రయ కేంద్రాలకు (ఐకెపి సెంటర్లు) చేరవేసిన రైతుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది. బహిరంగ ప్రదేశాల్లో ఆరబోసిన ధాన్యం కుప్పలు ఈదురుగాలుల వల్ల గాలిలో కొట్టుకుపోయాయి. కుప్పలపై కప్పిన టార్పాలిన్ కవర్లు సైతం గాలి ధాటికి ఎగిరిపోవడంతో, గింజలు చెల్లాచెదురై మట్టిలో కలిసిపోయాయి. రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన పంట, చేతికి వచ్చే తరుణంలో ఇలా గాలి పాలు కావడం చూస్తుంటే ప్రాణం విలవిలలాడుతోందని, రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# కొండాపూర్ పోలీసుల అవినీతిపై విచారణ జరపాలి..

- కేసుల బెదిరింపులతో వసూళ్లకు పాల్పడుతున్న పోలీసులు.
- లా అండ్ ఆర్డర్‌ను కాపాడాల్సిన పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా మారారు.
- తొగరుపల్లి మాజీ సర్పంచ్ గౌరీ రెడ్డి శ్రీధర్ రెడ్డి.

**కొండాపూర్ మే 07(ప్రజావాణి):**సమాజాన్ని రక్షించాల్సిన పోలీసులే భక్షకులుగా మారి పేద ప్రజలను బెదిరిస్తూ వారి రక్తాన్ని లంచాల రూపంలో వసూలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకుడు, వైఎస్ఆర్ మాజీ జిల్లా అధ్యక్షుడు గౌరీ రెడ్డి శ్రీధర్ రెడ్డి ఆరోపించారు. గురువారం కొండాపూర్ మండలంలోని తొగరుపల్లిలో తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డి డీఎస్పీతో పాటు కొండాపూర్ సీఐ, ఎస్ఐల అవినీతి అక్రమాలపై రాష్ట్ర డీజీపీ, ఏసీబీ అధికారులు విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేత నరసింహారెడ్డికి కొండాపూర్ పోలీసులు ప్రైవేట్ సైన్యంలా పనిచేస్తున్నారని ఆరోపించారు. తొగరుపల్లి గ్రామ శివారులో నిర్మిస్తున్న కంపెనీ విషయంలో ప్రశ్నించగా తనపై పీడీ యాక్ట్ పెట్టి జైలుకు పంపిస్తామని బెదిరించారని తెలిపారు. తప్పుడు కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తూ పోలీస్ స్టేషన్‌కు పిలిపించారని, అక్కడ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నేలపై



కూర్చోబెట్టి అవమానించారని ఆరోపించారు. సీఐ సుమన్‌కుమార్ అసభ్య పదజాలంతో దూషించారని పేర్కొన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పేరుతో వాహనదారులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారని, పోలీస్ స్టేషన్లు సెటిల్మెంట్ల కేంద్రాలుగా మారాయని విమర్శించారు. గ్రామాల్లో జరిగిన వివాదాల్లో కేసులు నమోదు చేయకుండా డబ్బులు తీసుకుని రాజీలు కుదురుస్తున్నారని ఆరోపించారు. గంజాయి, డ్రగ్స్ వ్యాపారులతో కొందరు పోలీసులకు సంబంధాలున్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ వాహనాలను వందల కిలోమీటర్ల మేరకు సొంత పనులకు ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. తన ఆరోపణలు తప్పైతే తనపై కూడా చర్యలు తీసుకోవచ్చని స్పష్టం చేసిన శ్రీధర్ రెడ్డి,





కొండాపూర్ మండలంలో శాంతిభద్రతలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికులకు ఉద్యోగాలు కల్పించకుండా ఇతరులకు అవకాశాలు ఇస్తే సహించబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో గ్రామస్తులు మల్లేశం, పాపిరాజ్, పోచయ్య, వరుణ్‌కుమార్, సంతోష్, కిరణ్, బాలు, రాములు, ఫరీద్, జంగీర్, ఫకీర్, భవానీశంకర్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

# 60 ఏళ్లుగా అడ్డగుంటపల్లికి ముప్పుగా 33 కేవీ లైన్

**ప్రజావాణి// గోదావరిఖని :**రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అడ్డగుంటపల్లి ప్రాంతంలో దాదాపు 60 సంవత్సరాలుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న 33 కేవీ విద్యుత్ లైన్‌ను వెంటనే తరలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నివాసాల మధ్యగా వెళ్లే ఈ హైటెన్షన్ లైన్ కారణంగా ప్రజలు నిరంతరం భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. ఈ సమస్యపై 51వ డివిజన్ కార్పొరేటర్ మేకల సమ్మయ్య, 58వ డివిజన్ కార్పొరేటర్ ఆకారపు రేఖ స్పందిస్తూ, అడ్డగుంటపల్లి ప్రజల భద్రత దృష్ట్యా 33 కేవీ లైన్‌ను ప్రత్యామ్నాయ మార్గంలోకి మార్చేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు విజ్ఞప్తి చేశారు.





Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com

# ఏకలవ్య మోడల్ విద్యాలయాలలో ఇంటర్మీడియట్ (సిబిఎస్ఈ- సిలబస్) ప్రవేశమునకు దరఖాస్తులు ఆహ్వానం

● ఐటీడీఏ పిఓ బి. రాహుల్



**భద్రాచలం/మన ప్రజావాణి (మే 07):** 2026-27 విద్యా సంవత్సరానికి గాను భద్రాద్రి కొత్తగూడెం మరియు ఖమ్మం జిల్లాలలో మొత్తం 08(భద్రాద్రి కొత్తగూడెం-07, ఖమ్మం-01) తెలంగాణ రాష్ట్ర ఏకలవ్య మోడల్ సంక్షేమ విద్యాలయాలలో నడుపబడుచున్న ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరమునకు సిబిఎస్ఈ సిలబస్ లో ఎంపిసి, బైపిసి, సిఈసి, హ్యుమానిటీస్ గ్రూపులలో ప్రవేశం పొందుటకు 2026-27వ విద్యాసంవత్సరములో ఎస్.ఎస్.సిలో ఉత్తీర్ణులైన గిరిజన బాల బాలికల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ గురువారం రోజు ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఆసక్తిగల ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన విద్యార్థినీ విద్యార్థులు ఈనెల 06 తేదీ నుండి 15వ తేదీ వరకు తమ ధరఖాస్తులను ఈఏంఆర్ఎస్, పాల్వంచ విద్యాలయాలలో దరఖాస్తు చేసుకొవాలని ఆయన అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఈఎంఆర్ఎస్ పాఠశాలల వివరములు:

1) ఈఏంఆర్ఎస్, గండుగులపల్లి బాలురు, బాలికలు ఏంపిసి, బైపిసి, సిఈసి సెల్:9614390733,

2) ఈఏంఆర్ఎస్, పాల్వంచ ఏంపిసి, బైపిసి, సిఈసి సెల్:8277020057,

3) ఈఏంఆర్ఎస్, గుండాల ఏంపిసి, బైపిసి, సిఈసి సెల్:8896574291,

4 ) ఈఏంఆర్ఎస్, టేకులపల్లి బైపిసి, సిఈసి సెల్:8447080760,

5) ఈఏంఆర్ఎస్, దుమ్ముగూడెం ఏంపిసి, బైపిసి, హ్యుమానిటీస్ సెల్: 9411083600,

6) ఈఏంఆర్ఎస్, చర్ల ఏంపిసి, బైపిసి, సిఈసి సెల్: 7895253577,

7) ఈఏంఆర్ఎస్ ములకలపల్లి ఏంపిసి, బైపిసి, సిఈసి సెల్: 9467215038,

8) ఈఏంఆర్ఎస్, సింగరేణి ఏంపిసి, బైపిసి, సిఈసి సెల్:8896507158, ధరఖాస్తు చేసుకొన్న అభ్యర్థిని అభ్యర్థులకు ఎంపిక ఎస్ఎస్సిలో సిజిపిఏ/సిబిఎస్ఈ మెరిట్ మార్కుల ఆధారంగా కౌన్సిలింగ్ లో తమకు అడ్మిషన్ ఇవ్వబడుననీ, ఈనెల 20వ తేదీ ఉదయం 9.00 గంటలకు ఈఏంఆర్ఎస్, పాల్వంచ, పంజాబ్ గడ్డ (3 ఇంక్లైన్), రామవరం నందు కౌన్సిలింగ్ నిర్వహించబడునని ఆయన అన్నారు. కావున, గిరిజన విద్యార్థిని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ సదావకాశాన్ని సద్వినియోగించుకోగలరని ఆయన కోరారు.

# శ్రీశైలం దేవస్థానంలోని సాంస్కృతిక కార్యక్రమాలు




**నంద్యాల జిల్లా శ్రీశైలం మే 7 (ప్రజావాణి )**దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్య కళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈరోజు (07.05.2026) శ్రీ పి . వశిష్ట కార్తికేయ శర్మ, శ్రీకాకుళం వారిచే "శ్రీదేవి మాహాత్మ్యం" పై ప్రవచన కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం 6 గంటల నుండి ఈ ప్రవచన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. రెండవ కార్యక్రమములో భాగంగా శ్రీ తరుణి కూచిపూడడి కళానికేతన్, హైదరాబాద్ వారిచే సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది.కాగా ఈ నిత్య కళారాధనలో ఆయా రోజులలో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి.శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

# ప్రేమ పేరుతో యువతికి మోసం: యువకుడి అరెస్ట్



**చెన్నారావుపేట మే 7 ప్రజావాణి :**మండల కేంద్రంలోని సూరిపెల్లి గ్రామానికీ చెందినా సల్వాల రాహుల్ అనే యువకుడు ఇంస్టాగ్రామ్ లో ఒక యువతితో పరిచయం పెంచుకున్నాడు. ప్రేమ పేరుతో పెళ్ళి చేసుకుంటానని చెప్పి మోసం చేశాడని బాధితురాలు ఇచ్చిన పిర్యాదు మేరకు నెక్కొండ సిఐ శ్రీనివాస్ పర్యవేక్షణలో నిందితున్ని అరెస్టు చేసి గురువారం రిమాండ్ కీ తరలించినట్లు ఎస్ఐ రాజేష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వెంకటేశ్వర్లు, నరేష్ పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి





**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి :**జిల్లాలో నిర్వహించనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో పరీక్షల నిర్వహణపై అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మే 13 నుండి ప్రారంభమయ్యే పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా త్రాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు కల్పించాలని సూచించారు.పరీక్షా కేంద్రాల దగ్గర జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని పోలీసు శాఖ అధికారులకు సూచించారు. పరీక్ష ప్రశ్నపత్రాల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు మొదటి సంవత్సరం 10,344 మంది, ద్వితీయ సంవత్సరం 3562 మంది మొత్తం 13906 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. మొత్తం 37 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఈ సమావేశంలో డీఐఈఓ కె. రవిబాబు, డిఈసి సభ్యులు ఎం సింహాచలం, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, టిజిఎస్పీడిసీఎల్, ఆర్టీసీ, గురుకుల డిసిఓ, ఆర్సిఓలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా మెడలో మంగళ సూత్రం చోరీ



**షాబాద్,// మే 07( ప్రజావాణి ):**షాబాద్ మండలంలోని మద్దూరు గేటు వద్ద మహిళ మెడలోని మంగళ సూత్రంను గుర్తు తెలియని దుండగులు అపహరించిన ఘటన గురువారం కలకలం రేపింది. షాబాద్ సి ఐ కాంతా రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...బుగ్గోని గూడ గ్రామానికి చెందిన భారతమ్మ (వయస్సు 55 సంవత్సరాలు )సుమారుగా 12:30 గంటల సమయంలో రోడ్డుపై వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు ఆమె మెడలోని మంగళ సూత్రంను లాక్కొని పరారయ్యారు.ఈ ఘటనతో మహిళ భయాందోళనకు గురైంది.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తూ నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# అర్హులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలి

● జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
● 2బిహెచ్‌కే, ప్రజా దర్బార్, ఇందిరమ్మ ఇళ్లపై సమీక్షించిన జిల్లా కలెక్టర్







**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి:**2 బిహెచ్‌కే గృహాలు, ప్రజా దర్బార్ వినతులు, ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి అర్హులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో కలిసి 2బిహెచ్‌కే గృహాలు, ప్రజా దర్బార్ దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల అంశాలపై సమీక్షించారు.జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రజా దర్బార్ కార్యక్రమంలో మొదటి 7 క్లస్టర్లలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులలో 78 దరఖాస్తులకు సంబంధించిన పూర్తి వివరాలు అందలేదని, తదుపరి సమావేశం నాటికి వాటి పూర్తి వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.7 క్లస్టర్లలోని ఎల్-3 దరఖాస్తులను పూర్తిగా పరిశీలించి, అర్హులుగా గుర్తించిన వారిని ఎల్-1 కేటగిరీకి మార్చాలని సూచించారు. ఎల్-3 వెరిఫికేషన్‌ను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని,ఒకే ఇంట్లో బహుళ కుటుంబాలు నివసిస్తూ బీపీఎల్ అర్హత కలిగి ఉంటే కొత్త ఇళ్ల మంజూరుకు అర్హులుగా పరిగణించాలని పేర్కొన్నారు.ఖమ్మం జిల్లాలో మొత్తం 6,107డబుల్ బెడ్ రూం ఇళ్లు పూర్తయ్యాయని, 655 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని, 467 ఇళ్లు ప్రారంభం కాలేదని తెలిపారు. ప్రారంభం కాని ఇళ్లను రద్దు చేయాలని ఆదేశించారు. లబ్ధిదారులను ఎంపిక చేసి 6,094 మందికి ఇళ్లను అప్పగించినట్లు వెల్లడించారు.భూమిలేని పేద లబ్ధిదారులకు నిర్మాణంలో ఉన్న 655 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనులపై ఎంత మొత్తం మంజూరైందో, ఇప్పటి వరకు ఎంత వ్యయం జరిగిందో, జీ ప్లస్ వన్ తరహా ఇళ్లు ఎన్ని ఉన్నాయో, వ్యక్తిగత ఇళ్లు ఎన్ని నిర్మాణంలో ఉన్నాయో సమగ్ర నివేదిక తయారు చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు .నిర్మాణంలో ఉన్న వ్యక్తిగత ఇళ్లను నేరుగా లబ్ధిదారులకు అప్పగిస్తే, వారు ఇందిరమ్మ ఇళ్ల పథకం క్రింద మిగిలిన నిధులు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.జీ ప్లస్ వన్ నిర్మాణాలను పూర్తి చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని,లబ్ధిదారుల ఎంపిక పూర్తయ్యిందా లేదా అన్న వివరాలు కూడా నివేదికలో పొందుపరచాలని ఆదేశించారు.ఈ సమావేశంలో పీడీ హౌసింగ్ శ్రీనివాస్,ఈడీఎం దుర్గాప్రసాద్, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ జాహేదా, సీఎల్‌టీసీ బి. లావణ్య, కె. రాహుల్, డీఈ జాగారం,ఏఈలు స్నేహ, యాకేష్,వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులు సమయపాలన పాటించాలి...

● "డాక్టర్ అందుబాటులో లేరు" అనే పరిస్థితి రాకూడదు
● జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
● ఆరోగ్య శాఖ పనితీరుపై సమీక్షించిన జిల్లా కలెక్టర్






**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి :**ఆసుపత్రుల్లో వైద్య సేవలతో పాటు పరిపాలనపైనా వైద్యులు దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు.జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పనితీరుపై సమీక్షించారు.జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నమోదవుతున్న రోజువారీ ఓపీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరుగుతున్న ప్రసవాల వివరాలను అధికారులను అడిగి తెలుసు కున్నారు. ఆసుపత్రుల్లో పనిచేయని యంత్రాలు ఏవైనా ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. అన్ని ఆసుపత్రుల్లో ఉన్న పరికరాల పనితీరుపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా ప్రతి పీహెచ్‌సీ స్థాయిలో అవసరమైన ల్యాబ్ పరీక్షా సామగ్రి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లాలో మెరుగైన అత్యవసర వైద్య సేవల కోసం అదనంగా ఒక 108 వాహనం, రెండు 102 వాహనాలు అవసరమని అధికారులు సమావేశంలో తెలిపారు.పాముకాటు నివారణ మందులు అన్ని పీహెచ్‌సీల్లో తగిన నిల్వలో ఉన్నాయని అధికారులు వివరించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న వైద్య వనరులు, వైద్యుల సంఖ్య, మెరుగుపర్చాల్సిన వైద్య సేవలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి గర్భిణీ మహిళకు వంద శాతం ఏఎన్‌సీ నమోదు జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ లక్ష్యాలను పూర్తిగా చేరుకోవాలని సూచించారు. ఆశా, ఏఎన్ఎం లకు స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించాలని, 14 నుండి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికల తల్లిదండ్రులను ప్రతి ఆశా కార్యకర్త స్వయంగా సంప్రదించి వ్యాక్సిన్ వేయించేలా చూడాలని ఆదేశించారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ పనిచేయాలని, ఎన్‌సీడీతో పాటు ఇతర ఆరోగ్య సూచికలపై నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. వైద్యులు వైద్య సేవలతో పాటు పరిపాలనా బాధ్యతలను కూడా సమర్థంగా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఖమ్మం జిల్లాపై ప్రజల అంచనాలు ఎక్కువగా ఉన్నాయని,వాటిని అందరూ సమిష్టిగా నెరవేర్చాలని తెలిపారు. వైద్యులు తప్పనిసరిగా సమయ పాలన పాటించాలని, ఆసుపత్రుల్లో అనవసర గందరగోళానికి తావులేకుండా చూడాలని సూచిం చారు. ఒక వైద్యుడు డ్యూటీ ముగించేముందు మరో వైద్యుడు ఆసుపత్రికి చేరుకున్న తర్వాతే వెళ్లాలని,డాక్టర్ అందుబాటులో లేరు అనే పరిస్థితి ఎక్కడా రాకూడదని స్పష్టం చేశారు. ఆసుపత్రులకు అవసరమైన ప్రాథమిక ఫర్నిచర్ పూర్తిగా అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది రోగులతో ఓర్పుతో, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, కఠిన పదజాలం ఉపయోగించకుండా మృదువుగా మాట్లాడాలని సూచించారు.అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ ఆసుపత్రుల్లో అవసరమైన మరమ్మతులు,ఫర్నిచర్‌కు సంబంధించిన అంచ నాలను గురువారం నాటికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు.కొనుగోలు వ్యయం లక్ష లోపు ఉండే విధంగా ప్రతిపాదనలు రూపొందిస్తే కోటేషన్ ద్వారా నేరుగా కొనుగోలు ప్రక్రియ చేపట్టవచ్చని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామా రావు, అదనపు డీఎంహెచ్ఓ చందు నాయక్, ఎన్‌సీడీ పీవో డాక్టర్ అరుణాదేవి, డీఐఓ డాక్టర్ పి.సంపత్,ఐడీఎస్పీ పీవో డాక్టర్ ఐ.మోత్యా,వైద్యులు,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# మందమర్రి పట్టణ అధ్యక్షునికి అభినందనల వెల్లువ

● కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా.. మంద తిరుమల్



**మందమర్రి,( మన ప్రజావాణి) మే 7:** మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా నియమితులైన మంద తిరుమల్ కి అభినందనల వర్షం కురుస్తుంది. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాలు, శ్రేయోభిలాషులు, మిత్రులు అన్ని వర్గాల ప్రజలు వారికి అభినందనలు తెలియజేస్తూ, శాలువాతో ఘనంగా సన్మానిస్తున్నారు. పట్టణ అధ్యక్షులు మంద తిరుమల్ మాట్లాడుతూ నాకు ఈ అవకాశం కల్పించిన చెన్నూరు ఎమ్మెల్యే, మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, డిసిసి ప్రెసిడెంట్ రఘునాథరెడ్డి కి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, అందరితో కలిసి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి పనులను కొనసాగిస్తామని, కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకాలను ప్రతి పేదవాడికి దక్కేలాగా చేస్తామని తెలిపారు. మంద తిరుమల్ ని ఘనంగా సన్మానించిన కార్యక్రమంలో పారుపల్లి శివరామకృష్ణ, బత్తుల సతీష్ బాబు, జావిద్ ఖాన్, రంజిత్ గౌడ్, శనిగరపు సాగర్, గట్ల సారంగపాణి తదితరులు ఉన్నారు.

# గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయం పై బిజెపి గుండాల దాడిని ఖండిస్తున్నాం

● దాడిని కండిస్తున్న జోగిపేట పట్టణ బీ ఆర్ ఎస్ సీనియర్ నాయకులు



**మన సమగ్ర ప్రజావాణి మే 07సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** కరీంనగర్ లో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం పై దాడి మరియు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కారును బండి సంజయ్ అనుచరులు బిజెపి నాయకులు ద్వంసం చేయడం అత్యంత హేయమైన చర్య గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంలో పాడి కౌశిక్ రెడ్డి ప్రెస్ మీట్ లో పాల్గొన్నరు ఆయన పై దాడి చేయాలని ప్రణాళిక బద్దంగా క్యాంప్ కార్యాలయం పై బిజెపి రౌడీలు దాడి చేశారు దాడిని అడ్డుకుంటున్న పోలీసులపై కూడ దాడి చేస్తూ కౌశిక్ రెడ్డి కారును బిజెపి రౌడీ ముకలు ద్వంసం చేసారు రేవంత్ రెడ్డి పాలనలో శాంతి భద్రతలు అదుపుతప్పాయి అనడానికి ఈ దాడి నిదర్శనం ఇలాంటి దౌర్జన్యం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు లాంటిది పోలీసు అధికారులు స్పందించి దాడికి పాల్పడ్డ బిజెపి పార్టీకి చెందిన వారిని వెంటనే అరెస్టు చేసి వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాము.బీ ఆర్ ఎస్ నాయకులు చాపల వెంకటేశం, సార శ్రీధర్, ఖాజపాష, బిర్ల శంకర్, కుమ్మరి క్రిష్ణ

# ఖమ్మం నగర అభివృద్ధికి రాజకీయాలకతీతంగా కృషి

**● రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**

**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి :** ఖమ్మం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం రాజకీయాలకతీతంగా కృషి చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు.ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో పర్యటించి పలు సీసీ డ్రైన్, రోడ్డు నిర్మాణ పనులకు, యుపిఎస్ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసి, నేతాజీ పార్క్, డి.ఎఫ్.టి. స్కీమ్ క్రింద త్రాగునీరు సరఫరా సౌకర్యాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు.ముందుగా 46 వ డివిజన్ సారథి నగర్ ఆర్.యు.బి వద్ద మున్సిపల్ సాధారణ నిధులు ఒక కోటి 8 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, పంపింగ్ వెల్ 33వ డివిజన్ లో సుడా నిధులు 30 లక్షలతో, 34 వ డివిజన్ లో 53 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణపనులకు, 32వ డివిజన్ గుట్టల బజార్ లో 30 లక్షలతో, 50 లక్షలు సాధారణ నిధులతో సీసీ కాలువల నిర్మాణ పనులకు, 40వ డివిజన్ నిజాంపేటలో 66.50 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్ పనులకు, 55వ డివిజన్ వేణుగోపాల్ నగర్ లో 101.60 లక్షలతో సీసీ డ్రైన్స్ నిర్మాణ పనులకు, 50వ డివిజన్ రాపర్తి నగర్ బైపాస్ రోడ్డు వద్ద చౌదరి హోటల్ నుండి రైల్వే కల్వర్టు వరకు ఒక కోటి 50 లక్షలతో చేపట్టిన సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు, 15వ డివిజన్ లో 30 లక్షలతో అదనపు గదుల నిర్మాణ, మరమ్మత్తు పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. అలాగే 55వ డివిజన్ బ్యాంక్ కాలనీలో 39.40 లక్షలతో నిర్మించిన సీసీ డ్రైన్, కల్వర్టు లను, 12వ డివిజన్ లకారం ట్యాంక్ బండ్ వద్ద 49.80 లక్షలతో ఏర్పాటు చేసిన నేతాజీ పార్క్ ను, 15వ డివిజన్ అల్లిపురం లో అమృత్ నిధులు కోటి 60 లక్షలతో నిర్మించిన 9 లక్షల లీటర్ల సామర్థ్యం గల మంచినీటి వాటర్ ట్యాంక్, మున్సిపల్ నిధులు కోటి 50 లక్షలతో ఏర్పాటు చేసిన



డ్రింక్ ఫ్రమ్ ట్యాప్ సరఫరాను మంత్రివర్యులు ప్రారంభించారు. అనంతరం అల్లీపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ చుట్టుపక్కల ఉన్న ప్రతి ఒక్కరికి మనకు ఉన్న అవకాశం మేరకు సేవ చేసే అవకాశం మనకు లభించిందని, దానిని గత 5 సంవత్సరాలుగా చక్కగా నిర్వహించిన కార్పోరేటర్లకు మంత్రి అభినందనలు తెలిపారు. ఖమ్మం ప్రజలు, శ్రీ రామ చంద్ర మూర్తి ఇచ్చిన అవకాశం మేరకు గత 40 సంవత్సరాలుగా ప్రజలకు సేవలు అందిస్తున్నానని, మొదట ఎన్టీఆర్ ప్రభుత్వంలో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశానని, అన్ని పార్టీలలో సముచితమైన స్థానం, గౌరవం తనకు లభించిందని అన్నారు.పల్లె పల్లెకు రహదారి, మంచి నీరు విద్యా, వైద్యం సౌకర్యంతో పాటు భారీ ప్రాజెక్టులు కూడా తీసుకుని వచ్చి ఖమ్మం జిల్లా చరిత్రలో తనకు ఒక పేరు ఉండేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. దేశవ్యాప్తంగా ఖమ్మం జిల్లాకు మంచి పేరు వచ్చే విధంగా పని చేసామని అన్నారు.నేను తప్పు చేస్తే ప్రజలకు చెడు పేరు వస్తుందని ఒక యజ్ఞం చేసినట్లుగా నిష్టగా రాజకీయం చేస్తున్నానని అన్నారు. జీవితంలో తనకు ఇంతటి గౌరవం తీసుకుని వచ్చిన ప్రజలకు మనస్ఫూర్తిగా పని చేస్తున్నానని అన్నారు. భవిష్యత్తులో ప్రతి ఒక్కరూ ఖమ్మం ప్రజల



మన్నలను పొందాలని భగవంతుని కోరుకుంటూ ఐదు సంవత్సరాలు విజయ వంతంగా పదవికాలం పూర్తి చేసుకున్న కార్పొరేటర్లకు మంత్రి అభినందనలు తెలిపారు.ఖమ్మం మేయర్ పూనుకొల్లు నీరజ మాట్లాడుతూ 24 గంటల పాటు నీరు వచ్చే విధంగా అల్లిపురంలో వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కారణంగా ఇక్కడ తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మించడం జరుగుతుందని అన్నారు. ఖమ్మం నగరంలో ప్రభుత్వ వైద్య కళాశాల, స్వామి నారాయణ కళాశాల, ఇస్కాన్ టెంపుల్, వెలుగు మట్ల అర్బన్ పార్క్, ఖమ్మం ఖిల్లాకు రోప్ వే నిర్మాణ పనులు జరుగుతున్నాయని అన్నారు. రాజకీయాలకు అతీతంగా నగర అభివృద్ధి కోసం గత 5 సంవత్సరాలుగా ఖమ్మం నగర పాలకవర్గం కృషి చేసిందని అన్నారు.అనంతరం మంత్రి మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహ్రా, ఆర్ అండ్ బి ఎస్ఈ యాకోబు, డిసిహెచ్ఎస్ గంగాధర్, ఆర్డీఓ శ్రీనివాస్, మున్సిపల్ డిఈ శ్రీనివాస్, ఏఈ నవజ్యోతి, కార్పొరేటర్లు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పీసీసీ అధ్యక్షుడికి మాజీ మంత్రి సవాల్.. రాజకీయ సన్యాసానికి రెడీ



**హైదరాబాద్ :** టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్( కు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సవాల్ () విసిరారు. రాహుల్ గాంధీ చెప్పినట్టు ప్రతి రైతుకు రూ. 2 లక్షల రుణమాఫీ జరిగి ఉంటే.. తాను రాజకీయ సన్యాసం తీసుకుంటా.. నువ్వు సిద్ధమా. అంటూ ఛాలెంజ్ చేశారు.గురువారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సవాల్ విసిరారు. రూ.50వేల కోట్ల రుణమాఫీ చేస్తామని కేవలం రూ.12 వేల కోట్లు మాత్రమే ఇప్పటివరకు మాఫీ చేశారని వెల్లడించారు. రుణమాఫీపై ఇచ్చిన హామీ గురించి, రేవంత్‌రెడ్డి రుణమాఫీ ఎందు చేయడం లేదని రాహుల్‌గాంధీని ప్రశ్నిస్తున్నామని అందులో తప్పేమిలేదని అన్నారు.కేసీఆర్, కేటీఆర్‌తోనే పదేళ్ల పాటు రైతన్నలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. 2009 నుంచి కేటీఆర్ అప్రతిహతంగా ఎమ్మెల్యేగా ఎన్నుకోబడుతున్నారని, పది సంవత్సరాలు ప్రపంచంలోనే అత్యుత్తమ మంత్రిగా పేరొందిన వ్యక్తని ప్రశంసించారు. జాతీయ మీడియా కూడా కేటీఆర్‌ను జాతీయ స్థాయి నాయకుడిగా గుర్తించిందని వివరించారు.కేటీఆర్ ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారని, ఒక్కసారైనా ఎమ్మెల్యేగా మహేష్‌కుమార్ గెలవలేదని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి మెప్పుకోసం అడ్డగోలుగా, పీసీసీ స్థాయిని మరిచిపోయి , ధనం, అధికార అహంకారంతో మాట్లాడుతున్నారని విమర్శించారు.

# మంత్రిగా ఉండి ఇలా మాట్లాడతారా.. కొండా సురేఖపై రాజాసింగ్ ఫైర్



**హైదరాబాద్, మే 7 :** జై శ్రీ రామ్ అంటే పై నుంచి పైసలు పడతాయా అని మంత్రి కొండా సురేఖ ఎలా అంటారని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎండోమెంట్ మంత్రి అంటే దేవుడికి మినిస్టర్‌లాగా ఉండాలని.. కానీ కొండా సురేఖ ఏ శాఖకు మంత్రి..? అని ప్రశ్నల వర్షం కురిపించారు.(గురువారం) హైదరాబాద్ వేదికగా రాజాసింగ్ మాట్లాడారు. రేవంత్‌రెడ్డి గతంలో ఏబీవీపీలో ఉన్నప్పుడు జై శ్రీరాం అన్నారని ప్రస్తావించారు. మరి ఇప్పుడు తన మంత్రికి జై శ్రీరాం గురించి నేర్పించలేదా..? అని నిలదీశారు. జై శ్రీరాం అంటే కొండంతా బలం వస్తోందని...కానీ అనుచితంగా మాట్లాడితే మంత్రి పదవి పోతుందని ఆమెకు చెప్పాలని అన్నారు. తెలంగాణలో దేవుడి భూముల అమ్మకాలు, కబ్జాలు ఎలా జరుగుతున్నాయో చూస్తున్నామని అన్నారు.ఈ విషయంలో కొండా సురేఖ ఎలాంటి చర్యలు చేపట్టారు...? అని రాజాసింగ్ ప్రశ్నించారు. హైదరాబాద్ ఓల్డ్ సిటీలో దేవుడి భూములను ఎంఐఎం నేతలు కబ్జా చేశారని ఆరోపించారు. దేవాదాయ శాఖ అధికారులు వారితో కుమ్మక్కై కమీషన్లు తీసుకుంటున్నారని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి సర్కార్‌కి దేవాలయాల అభివృద్ధి మీద ధ్యాస లేదని ఆగ్రహించారు. ఎంఐఎం నేతలిచ్చే కమీషన్ల మీదనే ఈ మంత్రికి ధ్యాస ఉందని ఎద్దేవా చేశారు. రాముడి నామాన్ని ఎదిరించడానికి సాహసించేవారు.. ఎవరైనా గాల్లో కొట్టుకుపోతారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి, దయచేసి మీ దేవాదాయ శాఖ మంత్రిని పిలిపించి రాజీనామా చేయించాలని హితవు పలికారు. లేకపోతే మీరు కూడా కేసీఆర్‌మునిగిపోతారని రాజాసింగ్ విమర్శించారు.

# జూబ్లీహిల్స్ 'రిచ్ కిడ్స్' ట్రాప్ కేసు.. రిమాండ్ రిపోర్ట్‌లో సంచలన నిజాలు

**హైదరాబాద్, మే 7 :** హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన జూబ్లీహిల్స్ ఇన్‌స్టాగ్రామ్ ట్రాప్ కేసులో పోలీసులు సంచలన విషయాలను వెలుగులోకి తీసుకువచ్చారు. రిచ్ కిడ్స్‌ను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా ద్వారా మైనర్ బాలికలను ట్రాప్ చేసిన ఈ కేసులో మొత్తం 11 మందిని నిందితులుగా చేర్చినట్లు సమాచారం. కేసుకు సంబంధించిన రిమాండ్ కాపీలో అనేక సంచలన అంశాలు బయట పడగా, మైనర్లను బ్లాక్‌మెయిల్ చేసి లక్షల రూపాయలు వసూలు చేసిన భారీ నెట్‌వర్క్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ రిమాండ్ రిపోర్టు ఏబీఎన్ ఆంధ్రజ్యోతికి చిక్కింది. అందులో ఏముందంటే.ఇన్‌స్టాగ్రామ్ ద్వారా మైనర్‌కు వల..పోలీసుల దర్యాప్తు ప్రకారం.. ప్రధాన నిందితుడు అర్జున్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా బాలికతో పరిచయం పెంచుకున్నాడు. మొదట స్నేహంగా ప్రారంభమైన పరిచయం తర్వాత బలవంతపు సంబంధాలకు దారితీసినట్లు పోలీసులు గుర్తించారు. అర్జున్‌తో పాటు రాజీవ్, వారి స్నేహితుల పాత్ర కూడా ఈ కేసులో ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. బాధితురాలి కుటుంబ సభ్యులు పలుమార్లు అర్జున్‌ను హెచ్చరించినప్పటికీ అతను తన ప్రవర్తన




మార్చుకోలేదని సమాచారం. గత ఏడాదిలోనే అర్జున్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రిమాండ్ రిపోర్టులో ప్రస్తావించారు.అరెస్ట్ అయినా మారని అర్జున్..అర్జున్ గతంలోనే పోక్సో కేసులో అరెస్ట్ అయ్యి బెయిల్‌పై బయటకు వచ్చాడు. అయితే జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా అతను బాలికతో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తిరిగి కనెక్ట్ అయ్యాడు. దీంతో కేసు మరింత తీవ్రమైంది. బాలిక కుటుంబం అర్జున్‌తో మాట్లాడొద్దని హెచ్చరించినా, ఇంట్లో పని చేసే సరస్వతి అనే మహిళ ఫోన్‌ను వినియోగించి బాలిక అతనితో మాట్లాడినట్లు పోలీసులు గుర్తించారు.పనిమనిషి బ్లాక్‌మెయిల్..ఈ కేసులో మరో కీలక పాత్రగా పనిమనిషి సరస్వతి పేరు బయటపడింది. మైనర్ బాలిక పరిస్థితిని ఆసరాగా తీసుకుని ఆమెను బ్లాక్‌మెయిల్ చేస్తూ రూ.9 లక్షలు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. అర్జున్‌తో సంబంధాల విషయం బయటపెడతానంటూ బాలికను.. పనిమనిషి బెదిరించినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ఆమె పాత్రపై పోలీసులు ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తున్నారు.మూడు నెలల్లో రూ.13 లక్షలు..ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు పలు సందర్భాల్లో అర్జున్ బాలికపై లైంగిక దాడులకు పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు. అదే సమయంలో వివిధ అవసరాలు, సమస్యలు అంటూ బాధితురాలి నుంచి సుమారు రూ.13 లక్షలు తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. అర్జున్ అడిగిన డబ్బులు ఇవ్వడానికి బాలిక ఇంట్లోనే దొంగతనానికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. తన తండ్రికి తెలియకుండా ఇంట్లోని కప్‌బోర్డ్ నుంచి లక్షల రూపాయలు తీసుకుని అర్జున్‌కు ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు .డబ్బులు కనిపించకపోవడంతో..ఇంట్లో పెద్ద మొత్తంలో డబ్బులు కనిపించకపోవడంతో బాలిక తండ్రికి అనుమానం వచ్చింది. డబ్బుల గురించి నిలదీయగా మొదట బాలిక సమాధానం చెప్పలేకపోయింది. తర్వాత అసలు విషయం బయటపడటంతో కుటుంబ సభ్యులు షాక్‌కు గురయ్యారు. ఆ తర్వాత వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ కేసు వెలుగులోకి వచ్చింది. పోలీసులు వెంటనే విచారణ ప్రారంభించి పలు కీలక ఆధారాలు సేకరించారు.అర్జున్ తల్లి అకౌంట్లలో డబ్బుల లావాదేవీలు..ఈ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు అర్జున్ తల్లి మీనాకుమారి బ్యాంక్ ఖాతాలను పరిశీలించారు. బాధితురాలి నుంచి ఆమె ఖాతాలకు డబ్బులు జమ అయినట్లు గుర్తించారు. దీంతో ఈ వ్యవహారంలో కుటుంబ సభ్యుల పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డబ్బుల ట్రాన్సాక్షన్లపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఎవరెవరు వ్యవహారంలో భాగస్వాములయ్యారనే విషయంపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు.మరో బాధితురాలి ఫిర్యాదు..ఈ కేసులో బాలికతో పాటు మరో యువతి కూడా అర్జున్‌పై ఫిర్యాదు చేసింది.

# యూట్యూబ్‌లో చూసి వ్యక్తిని మర్డర్ చేసిన తల్లీకుమారుడు

**హైదరాబాద్:** ఆ తల్లీ,కుమారుడు ఈ మధ్య బాగా సామాజిక మాధ్యమాలు చూడటం మొదలుపెట్టారు. కావాల్సిన దాని గురించి గూగుల్, యూట్యూబ్‌లో శోధించారు. ఎట్టకేలకు అనుకున్నది వారి కంట పడింది. ఇంకేముంది దాంట్లో చెప్పినట్లే చేశారు. వారి ప్రణాళికను పక్కాగా అమలు చేశారు. కానీ చివర్లో జరిగిన ఓ పొరపాటు వారిని కటకటాల వెనక్కి నెట్టింది. ఇంతకీ ఆ తల్లీకుమారుడు యూట్యూబ్‌లో ఏం చూశారు? దేని గురించి గూగుల్‌లో వెతికారు అసలు వాళ్లిద్దర్నీ పోలీసులు ఎందుకు అరెస్ట్ చేశారు.హైదరాబాద్ జీడిమెట్ల ఠాణా పరిధిలోని చింతల్ చెరుకుపల్లి కాలనీ. ఈనెల 3న ఆదివారం అర్ధరాత్రి పోలీసులు ఓ ఇంటికి వెళ్లారు. అక్కడి పరిసరాలను గమనించగా ఓ శవం బయటపడింది. చనిపోయింది శివారెడ్డి అనే వ్యక్తిగా గుర్తించారు. అక్కడే ఉన్న అరుణ, ఆమె కుమారుడు సాయిరత్నంను అదుపులోకి తీసుకున్నారు. సాయిరత్నం ఫోన్‌ను పరిశీలించగా కత్తితో శివారెడ్డిని హత్య చేసినట్లు వీడియోలు, చిత్రాలు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు.సోషల్ మీడియా చూసి దారుణ హత్య : సంగారెడ్డి జిల్లాకు చెందిన అరుణ భర్త



మృతి చెందడంతో ఆంధ్రప్రదేశ్ అన్నమయ్య జిల్లాకు చెందిన శివారెడ్డితో కొన్నేళ్లుగా సహజీవనం చేస్తోంది. ఆమెకు గతంలోనే 19 ఏళ్ల సాయిరత్నం అనే కుమారుడు ఉన్నాడు. వీరిద్దరూ శివారెడ్డి వద్దే ఉంటూ చింతల్‌లో నివాసముంటున్నారు. అయితే శివారెడ్డి తరచూ మద్యం సేవించి తల్లి, కుమారుడిని వేధిస్తుండేవాడు. ఆదివారం మధ్యాహ్నం సాయిరత్నంపై శివారెడ్డి దాడిచేశాడు. ఇంటికి వెళ్లిన తర్వాత కూడా గొడవ జరిగింది. ఇక ఈ వేధింపులు భరించటం వల్ల కాదనుకున్న తల్లీకుమారుడు శివారెడ్డిని హత్య చేయాలని పథకం రచించారు. ఇందు కోసం ఒక వ్యక్తిని ఎలా చంపాలో సామాజిక వెతికి చూశారు. ఆ తర్వాత పక్కా ప్రణాళిక ప్రకారం ఒడ్డిని అంతమొం దించేంద ుకు సాయిరత్నం పథకం వేశాడు."అరుణ వాళ్ల కుమారుడు సాయిరత్నం కలిసి ఈ మర్డర్‌ని చేశారు. మృత్యుడు శివారెడ్డి ఇక్కడే హైదరాబాద్?లో పని చేసుకుంటున్నాడు. గత పదేళ్ల నుంచి అరుణకు, శివారెడ్డి పరిచయం ఉన్నట్లు తెలుస్తోంది. అతనికి పెళ్లి కాకపోవడం వల్ల ఆమెతో రిలేషన్? పెట్టుకుని సాధ్యమైనంత వరకు వీళ్లతోనే ఉండేవాడు. అతడు వారితో మంచిగా ఉండకుండా తాగిన మత్తులో తిట్టడం, మానసికంగా, శారీరకంగా వారిని వేధించేవాడు. దీంతో తల్లికుమారుడు కలిసి అతని నుంచి తప్పించడానికి ప్రథకం ప్రకారం ఏ శివారెడ్డిని చంపేశారు. ఈ హత్యను ఏ విధంగా చేయాలని ఇద్దరు కలిసి సోషల్? మీడియాలో సర్చ్? చేయడం, కత్తిని కూడా అప్పుడికప్పుడు కొనుగోలు చేయడం జరిగింది" – కోటిరెడ్డి, కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీనిందితులకు 14 రోజుల రిమాండ్ విధింపు : ముందుగా సాయిరత్నం కత్తి కొనుక్కుని వచ్చాడు. ఈ నెల 3న శివారెడ్డి నిద్రలోకి జారుకున్నాక కత్తితో సాయిరత్నం అతని మెడపై నరికాడు. చనిపోయాడని నిర్ధారించుకున్నాక ఆధారాలు లేకుండా చేయాలని రక్తపు మరకలతో తడిసిన దుస్తులను నాలాలో పడేశాడు. తర్వాత ప్లాస్టిక్ డ్రమ్ములో శివారెడ్డి మృతదేహాన్ని కుక్కి ఎవరికీ అనుమానం రాకుండా మాయం చేయాలని తరలించేందుకు స్నేహితుడికి ఫోన్ చేశాడు. సాయిరత్నం స్నేహితుడికి ఫోన్ చేయగా అతను వచ్చి మృతదేహాన్ని చూసి ఆందోళనకు గురయ్యాడు. నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అసలు విషయం వెల్లడించాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు సాయిరత్నంను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. పథకం ప్రకారం శివారెడ్డిని హత్య చేసిన కేసులో నిందితులను అరెస్టు చేసిన పోలీసులు కోర్టులో హాజరుపరుచగా 14 రోజుల రిమాండ్ విధించింది.

# ఇంటి అనుమతి కోసం లంచం తీసుకుంటూ పట్టుబడ్డ పంచాయతీ కార్యదర్శి



**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి మే 07:**పొత్కపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏసీబీ సోదాలుపెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పొత్కపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం ఏసీబీ అధికారులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి కుమారస్వామి ఓ వ్యక్తి నుండి ఇంటి నిర్మాణ అనుమతి మంజూరు కోసం ఫోన్‌పే ద్వారా రూ.5 వేల లంచం తీసుకున్నట్లు ఆరోపణలు వెలువడ్డాయి. బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పొత్కపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో తనిఖీలు చేపట్టి, పంచాయతీ కార్యదర్శిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కార్యాలయ రికార్డులను పరిశీలిస్తూ విచారణ కొనసాగిస్తున్నారు.ఈ ఘటన స్థానికంగా కలకలం రేపగా, పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కరీంనగర్ పీఎంజే జ్యూవెలరీ షాప్ దోపిడీ కేసులో ట్విస్ట్

**కరీంనగర్, మే 7:** కరీంనగర్ పీఎంజే జ్యూవెలరీ షాపు దోపిడీ కేసులో ట్విస్ట్ బయటపడింది. దోపిడీ కోసం దుండగులు ఉపయోగించిన బైక్‌కు.. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి వాహనం నంబర్ వాడినట్లు విచారణలో బయటపడింది. హైదరాబాద్‌కు చెందిన మొబైల్ షాపు వ్యాపారి ద్విచక్ర వాహనం నంబర్‌ను దుండగులు వాడినట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే సదరు వ్యాపారిని హైదరాబాద్, కరీంనగర్ పోలీసులు విచారించారు.విచారణలో మొబైల్ వ్యాపారి అపాచీ బైక్ నంబర్‌ను దుండుగులు ఉపయోగించిన బైక్‌కు పెట్టుకుని పోలీసుల దృష్టి మళ్లించే ప్రయత్నం చేసినట్లు బయటపడింది. దీంతో ఆ నంబర్ దోపిడీ దొంగలకు ఎలా తెలిసిందనే దానిపై పోలీసులు ఆరా తీశారు. హైదరాబాద్‌కు చెందిన మొబైల్ వ్యాపారి ఇటీవల తన అపాచీ బైక్ అమ్మడానికి షోరూంలో పెట్టినట్లు పోలీసులు గుర్తించారు. దుండగులు షోరూంలో బైక్ నంబర్‌ను గుర్తు పెట్టుకుని ఆ నంబర్‌ను ఉపయోగించినట్లు పోలీసుల విచారణలో తేలింది.

# నేను ఆ రోజు బ్రోతల్ కీపర్‌గా వెళ్లా రెండు గంటలు చాలా టెన్షన్ పడ్డా

**హైదరాబాద్:** సీనియర్ ఐపీఎస్, మల్కాజిగిరి పోలీస్ కమి షనర్ సుమతి ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాఫిక్‌గా మారారు. దిల్‌సుఖ్‌నగర్ బస్టా ండ్ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు ఓ సాధారణ మహిళగా ఆమె స్రీకెట్ ఆపేరషన్ చేపట్టారు. ఆపరేషన్‌లో భాగంగా అర్ధరాత్రి రోడ్డుపై నిలబడిన ఆమెను దాదాపు 40 మంది పోకిరీలు వేధింపులకు పాల్పడ్డారు. జుగుప్సకరమైన మాటలతో ఇబ్బందులకు గురి చేశారు. వారందరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. అయితే సుమతి ఇలా ఫీల్డ్ ఆపరేషన్లు చేపట్టడం ఇదే తొలిసారు కాదు.



ఆమె గంతంలోనూ ఇలాగే సీక్రెట్ ఆపేరషన్లు చేపట్టి అమ్మాయిల అక్రమ రవాణా, వేధింపులకు గురి చేస్తున్న వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 2004 సమయంలో హైదరాబాద్ కూకట్‌ప ల్లిలో అమ్మాయిలను వ్యభిచార రొంపిలోకి దింపుతున్న ఓ ముఠా ఆట కట్టించారు. ఆ రోజు ఏం జరిగింది..? ఎలా ఆ ముఠాను పట్టుకున్నారనే విషయాలను ఓ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమ్మాయిలతో ట్రాఫికింగ్ చేస్తున్నారన్న సమాచారంతో అప్పట్లో ఓ స్టింగ్ ఆపరేషన్ చేపట్టాం. హైదరాబాద్ నగరంలో చాలా చోట్ల రైడ్ చేశాం. చివరగా.. కూకట్‌పల్లి, చందానగర్ ఏరియాలో మాకు ఓ ఇన్ఫర్మేషన్ దొరికింది. అమ్మాయిలను రొంపిలోకి దింపుతున్న వాళ్లను పట్టుకునేందుకు నేను కూడా ఓ బ్రోతల్ కీపర్ లాగా వెళ్లాలనుకున్నా. మేం చేసిన ఆపరేషన్‌లో అదొక భాగం. దీంతో నేను బిజినెస్ చేసేవాళ్ల దగ్గరకు వెళ్లా. వెళ్తూ వెళ్తూ వెపన్ పెట్టుకున్నా. అమ్మాయిలను సప్లయ్ చేసేవాళ్ల ఆటో ఎక్కి కూకట్‌పల్లి నుంచి బయల్దేరాం. అలా వెళ్తున్న క్రమంలో నన్ను ఫాలో అవుతున్న ఇద్దరు ఎస్సైల వెహికల్ మిస్ అయిపోయింది. చివరకు నన్ను ఓ బ్రోకర్ అమ్మాయిలను ట్రాఫికింగ్ చేసే చోటుకు తీసుకెళ్లారు.అక్కడ లావుగా ఉన్న ఉ ముగ్గురు లేడీస్ ఉన్నారు. వారితో మాట్లాడటానికి వచ్చిన మరికొందరు అమ్మాయిల సప్లయర్స్ కూడా ఉన్నారు. ఇది చాలా సినిమాటిక్‌గా ఉంది. నన్ను చూసి వాళ్లకు డౌట్ వచ్చింది. ఇంత యంగ్ ఉంది నిజంగానే బ్రోకరా..?

# ‘టాప్’ లేపిన సన్ రైజర్స్..



ఐపీఎల్ 2026 సీజన్లో మాజీ చాంపియన్ సన్ రైజర్స్ హైదరాబాద్ దుమ్ము రేపింది. బుధవారం టేబుల్ టాపర్ పంజాబ్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్ లో 33 పరుగులతో ఘనవిజయం సాధించింది. దీంతో తొలిసారిగా టోర్నీలో టాప్ ప్లేస్ ను దక్కించుకుంది. అంతకుముందు స్థానిక హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో జరిగిన లీగ్ మ్యాచ్ లో టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 235 పరుగులు చేసింది. మిడిలార్డర్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ స్టన్నింగ్ ఫిఫ్టీ (43 బంతుల్లో 69, 3 ఫోర్లు, 4 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచి, ఆరెంజ్ క్యాప్ ను సొంతం చేసుకున్నాడు. అనంతరం ఛేజింగ్ లో పంజాబ్ అనుకున్న స్థాయిలో రాణించలేకపోయింది. ఓవర్లన్నీ ఆడిన పంజాబ్ .. 7 వికెట్లకు 202 పరుగులు చేసి, ఓడిపోయింది. వన్ డౌన్ బ్యాటర్ కూపర్ కాన్లీ సూపర్బ్ సెంచరీ (59 బంతుల్లో 107 నాటౌట్, 7 ఫోర్లు, 8 సిక్సర్లు)తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. బౌలర్లలో పాట్ కమిన్స్, శివాంగ్ కుమార్ కు రెండేసి వికెట్లు దక్కాయి. ఈ విజయంతో ఏడు విజయాలతో టేబుల్ టాప్ ప్లేస్ ను సన్ రైజర్స్ దక్కించుకుంది. మరోవైపు పంజాబ్ కు ఇది వరుసగా మూడో ఓటమి కావడం విశేషం. గురువారం జరిగే మ్యాచ్ లో రాయల్ చాలేంజర్స్ బెంగళూరుతో లక్నో సూపర్ జెయింట్స్ తలపడనుంది. భారీ స్కోరుతో బరిలోకి దిగిన పంజాబ్ కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. సూపర్ ఫామ్ లో ఉన్న ప్రియాంశ్ ఆర్య (1) తొలి ఓవర్లోనే ఔట్ కావడం షాకింగ్ గా మారింది. తర్వాతి ఓవర్ లోనే మరో విధ్వంసక ఓపెనర్ ప్రభ్ సిమ్రాన్ సింగ్ (3) కూడా వెనుదిరగడంతో పంజాబ్ కోలుకోలేకపోయింది. ఈ సీజన్ లో వీరిద్దరూ మెరుపు ఆరంభాలను ఇస్తూ, రాణిస్తున్నారు. అయితే వరుస బంతుల్లో వీరిద్దరూ వెనుదిరగడంతో పంజాబ్ కష్టాల్లో పడింది. ఆ తర్వాత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (5)ను ఇషాన్ మలింగా బోల్తా కొట్టించాడు. ఆ తర్వాత మార్కస్ స్టొయినిస్ (28) వేగంగా ఆడే ప్రయత్నం చేశాడు. అయితే శివాంగ్ బౌలింగ్ లో భారీ షాట్ కు ప్రయత్నించి, కీపర్ క్యాచ్ ఇచ్చి పెవిలియన్ కు చేరాడు. దీంతో పంజాబ్ పీకల్లోతు కష్టాల్లో పడింది. మరోవైపు నాలుగు వికెట్లు పడినా, కాన్నోలీ ఏమాత్రం వెనుకంజ వేయలేదు. చకచకా పరుగులు సాధిస్తూ, వేగంగా ఆడాడు. దీంతో పవర్ ప్లేలో 57 పరుగులు వచ్చాయి. సూర్యాంశ్ షెడ్గే (25) తనకు మంచి సహకారం అందించాడు. వీరిద్దరూ ఐదో వికెట్ కు 47 పరుగులు జోడించడంతో పంజాబ్ కాస్త కోలుకున్నట్లు అయింది. ఈ దశలో 34 బంతుల్లో అర్థ సెంచరీ చేసిన కాన్నోలీ, అన్ స్టాపబుల్ గా అనిపించాడు. మరోవైపు షెడ్గే ఔటైన తర్వాత శశాంక్ సింగ్ (4), మార్కో యన్సెన్ (19) విఫలమైనా తను మాత్రం చివరికంటా నిలిచాడు. ఈక్రమంలో 57 బంతుల్లో సెంచరీని కంప్లీట్ చేసుకున్నాడు. అతని పోరాటంతో పంజాబ్ రన్ రేట్ పడిపోకుండా ఓటమి పాలైంది. ఇక చక్కగా బౌలింగ్ చేసిన సన్ కెప్టెన్ పాట్ కమిన్స్ కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

# అమన్‌ప్రీత్ గిల్ మృతి..



భారత క్రికెట్ రంగంలో తీవ్ర విషాదం నెలకొంది. భారత అండర్ 19 జట్టు మాజీ ఆటగాడు, మీడియం పేసర్ అమన్‌ప్రీత్ సింగ్ గిల్ (36) బుధవారం చండీగఢ్‌లో కన్నుమూశారు. ఇంత చిన్న వయసులో ఆయన మరణించడం క్రీడలోకాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన మరణానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. అమన్ ప్రీత్ సింగ్ గిల్ తన కెరీర్ ఆరంభంలో భారత స్టార్ క్రికెటర్లతో డ్రెస్సింగ్ రూమ్‌ను షేర్ చేసుకున్నారు. 2007లో విరాట్ కోహ్లీ నేతృత్వంలోని టీమిండియా అండర్-19లో సభ్యుడిగా ఉండేవాడు. రవీంద్ర జడేజా, మనీష్ పాండే వంటి వారితో కలిసి ఆయన ఆడారు. దేశవాళి క్రికెట్లో పంజాబ్ జట్టు తరుపున ఆడుతున్న సమయంలో దిగ్గజా ఆల్ రౌండర్ యువరాజ్ సింగ్ తో కలిసి డ్రెస్సింగ్ రూమ్ ను అమన్ ప్రీత్ సింగ్ పంచుకున్నారు. అమన్ ప్రీత్ సింగ్ అంతర్జాతీయ స్థాయికి చేరుకోకపోయినా, దేశవాళీ క్రికెట్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అమన్ ప్రీత్ సింగ్ చేసేవాళ్ల క్రికెట్లో పంజాబ్ జట్టు తరపున 2006 నుంచి 2008 మధ్యలో ఆరు ఫస్ట్ క్లాస్ మ్యాచ్లు ఆడి 11 వికెట్లను పడగొట్టారు. ఆ తర్వాత ఇండియన్ ప్రీమియర్ లీగ్ తొలి సీజన్లో అప్పటి కింగ్స్ 11 పంజాబ్.. ప్రస్తుత పంజాబ్ కింగ్స్ జట్టులో సభ్యుడిగా ఉన్నారు. ఆటగాడిగా రిటైర్ అయిన తర్వాత పంజాబ్ క్రికెట్ అసోసియేషన్ లో సీనియర్ సెలక్షన్ కమిటీ సభ్యుడిగా కూడా సేవలందించారు. అమన్ ప్రీత్ సింగ్ గిల్ మరణం వార్త తెలియగానే విరాట్ కోహ్లీ, యువరాజ్ సింగ్ సోషల్ మీడియా వేదికగా తమ సంతాపాన్ని ప్రకటించారు. “పంజాబ్ క్రికెట్ అసోసియేషన్ అమన్ ప్రీత్ మరణాన్ని ధ్రువీకరిస్తూ తాజాగా ఒక లేక విడుదల చేసింది. పంజాబ్ క్రికెట్ ఆటగాడిగా, సెలక్టర్‌గా అమన్ ప్రీత్ సింగ్ చేసిన సేవలు మరువలేనివి. ఆయన అంకితభావం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం” అని పేర్కొంది.

# తండ్రైన సూర్యకుమార్ యాదవ్

భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ దంపతులు శుభవార్త చెప్పారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్‌కు ముంబై ఇండియన్స్‌కు చెందిన ఈ స్టార్ బ్యాటర్ తుదిజట్టు నుంచి పక్కకి తప్పుకోవడం పట్ల పెద్ద చర్చ జరిగింది. ఈ క్రమంలో ఆయన భార్య దేవిషా శెట్టిలకు పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిందని తెలిసి ముంబై ఫ్యాన్స్ ఊపిరి పీల్చుకున్నారు. తన కుటుంబ అవసరాల కోసం సూర్యకుమార్ రాబోయే మ్యాచ్ నుంచి వైదొలగినట్లు తెలియడంతో ఫ్యాన్స్‌కు క్లారిటీ వచ్చింది. సూర్యకుమార్ కెరీర్ పరంగా చెప్పాలంటే 2026 ఎంతో గొప్పగా సాగింది. ఆయన కెప్టెన్సీలో టీమ్‌ఇండియా జట్టు టీ20 ప్రపంచకప్ లో విజేతగా నిలవగా.. ఇప్పుడు ఆయన భార్య ఆడబిడ్డకు జన్మనిచ్చింది. దీంతో సూర్యకుమార్ యాదవ్ ఆనందం రెట్టింపు అయ్యింది. మరోవైపు ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో సూర్యకుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న ముంబై ఇండియన్స్ ప్లేఆఫ్స్ రేసులో అతికష్టం మీద సాగుతోంది. 10 మ్యాచ్‌ల తర్వాత కేవలం ఆరు పాయింట్లతో పట్టికలో తొమ్మిదో స్థానంలో ముంబై ఇండియన్స్ నిలిచింది. ఈ టీమ్ ప్లేఆఫ్స్‌కు చేరాలంటే ఆడే ఇకపై లీగ్‌లో ఆడాల్సిన ప్రతి మ్యాచ్ తప్పక గెలవడంతో పాటు నెట్ రన్‌రేట్ కూడా మెరుగ్గా ఉండాల్సిన అవసరం ఉంది.అతని వ్యక్తిగత ఫామ్ ఏమాత్రం సంతృప్తికరంగా లేనప్పటికీ.. ఈ ఆటగాడికి 2026 ఏడాది అదృష్టాన్ని తెచ్చిపెట్టింది. ఎందుకంటే, దాదాపు రెండు నెలల క్రితం మార్చి 8న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఫైనల్‌లో న్యూజిలాండ్‌ను 96 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించి, అతను కెప్టెన్‌గా వ్యవహరించి భారత్‌కు 2026 టీ20 ప్రపంచ కప్ టైటిల్‌ను అందించాడు. ఐపీఎల్ 2026లో తిరిగి ఫామ్‌లోకి రావాలని సూర్యకుమార్ ఆశిస్తున్నాడు. ఇప్పటివరకు జరిగిన 10 మ్యాచ్‌లలో అతను 19.50 సగటుతో, 145.52 స్ట్రైక్ రేట్‌తో కేవలం 195 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో ఆరోగ్య సమస్యల కారణంగా రెండు మ్యాచ్‌లకు ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా దూరమవ్వగా.. ఇప్పుడు సూర్య కుమార్ యాదవ్ కూడా ఆర్సీబీతో మ్యాచ్‌లో తప్పుకోవడంతో జట్టుకు జస్‌ప్రీత్ బుమ్రా లేదా రోహిత్ శర్మ కెప్టెన్సీ వ్యవహరించే అవకాశం ఉంది.



# నేను తప్పు చేసిన మాట నిజమే: డేవిడ్ వార్నర్ కీలక వ్యాఖ్యలు



ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డేవిడ్ వార్నర్ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో తన తప్పును ఒప్పుకోవాలని నిర్ణయించుకున్నారు. గత నెలలో సిడ్నీలో పోలీసులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో వార్నర్ పట్టుబడ్డారు. ఆ సమయంలో సేవించిన మద్యం మోతాదు చట్టప్రకారం ఉండాల్సిన సాధారణ పరిమితి కంటే రెండు రెట్లు ఎక్కువగా ఉన్నట్లు పరీక్షల్లో తేలింది. ఈ కేసుకు సంబంధించి వేవర్లీ లోకల్ కోర్టులో విచారణ జరగాల్సి ఉండగా, వార్నర్ హాజరు కాకపోవడంతో కోర్టు దీనిని జూన్ నెలకు వాయిదా వేసింది.వార్నర్ తరపు న్యాయవాది బాబీ హిల్ ఈ విషయంపై స్పందిస్తూ తన క్లయింట్ చేసిన పనిని అతి బుద్ధిహీనమైన చర్యగా భావిస్తున్నారని మీడియాకు తెలిపారు. స్నేహితుని ఇంట్లో మూడు గ్లాసుల వైన్ తాగిన వార్నర్, ఉబర్( లో వెళ్లడానికి బదులుగా స్వయంగా కారు నడపాలని నిర్ణయించుకోవడం తప్పుడు నిర్ణయమని ఆయన అంగీకరించారు. అయితే పోలీసు స్టేషన్‌లో చేసిన రెండో శ్వాస పరీక్ష సమయంపై కొన్ని సాంకేతిక సందేహాలు ఉన్నట్లు తెలుస్తోంది.

# చరిత్ర సృష్టించిన కనోలి



సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ ఓడిపోయినా ఆ జట్టు యువ సంచలనం కూపర్ కనోలి అద్భుత సెంచరీతో ఆకట్టుకున్నాడు. భారీ లక్ష్య ఛేదనలో మరో ఎండ్‌లో సహకారం లేకున్నా పోరాటపటిమతో ఆత్మవిశ్వాసం ప్రదర్శించాడు. ఈ క్రమంలోనే శతకం బాదేశాడు. దీంతో కనోలి ఐపీఎల్‌లో అద్భుతమైన రికార్డు నెలకొల్పాడు. అతడి తాజా సెంచరీతో 10ఏళ్ల రికార్డు బ్రేక్ అయ్యింది. 22 ఏళ్ల కనోలి ఈ మ్యాచ్‌లో వన్ డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగాడు. మొత్తం 59 బంతుల్లో 107 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఇందులో 8 సిక్స్‌లు1 7 ఫోర్లు ఉండడం విశేషం. దీంతో కనోలి 19ఏళ్ల ఐపీఎల్ చరిత్రలో సెంచరీ నమోదు చేసిన అతిపిన్న విదేశీ ఆటగాడిగా అరుదైన రికార్డు కొట్టాడు. ఈ సెంచరీ నమోదు చేసే నాటికి కనోలి వయసు 22 ఏళ్ల 257 రోజులు. ఈ మ్యాచ్‌కు ముందు ఈ రికార్డు సౌతాఫ్రికా బ్యాటర్ క్వింటన్ డి కాక్ పేరిట ఉండేది. అతడు 2016లో దిల్లీ డేడ్‌డెవిల్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ, ఆర్సీబీపై సెంచరీ బాదాడు. ఆ రోజుకి డికాక్ వయసు 23ఏళ్ల 122 రోజులు. గత 10ఏళ్లుగా ఈ రికార్డు అతడి పేరిటే కొనసాగుతూ వస్తోంది. తాజా మ్యాచ్‌తో కనోలి ఆ రికార్డు బద్దలుకొట్టాడు.అలాగే ఈ మ్యాచ్‌తో యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ రికార్డును కూడా కనోలి బ్రేక్ చేశాడు. ఐపీఎల్‌లో పంజాబ్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ అత్యధిక వ్యక్తిగత స్కోర్ నమోదు చేసిన రెండో బ్యాటర్‌గా కనోలి నిలిచాడు. ఈ క్రమంలో అతడు క్రిస్ గేల్ (104 పరుగులు జం సన్‌రైజర్స్, 2018లో) ను అధిగమించాడు. ఈ లిస్ట్‌లో పాల్ పాల్థాటీ టాప్‌లో ఉన్నాడు. అతడు 2011లో చెన్నై సూపర్ కింగ్స్‌పై 120 రన్స్ చేశాడు. ఇక రెండో స్థానంలో కనోని ఉండగా, ఆ తర్వాత ఈ లిస్ట్‌లో వరుసగా డేవిడ్ మిల్లర్ (101), హషీమ్ ఆమ్లా (100), మయంక్ అగర్వాల్ (100) ఉన్నారు.కాగా, పంజాబ్ కింగ్స్ తరఫున 22ఏళ్లకే సెంచరీ బాదిన రెండో బ్యాటర్‌గా కనోలి నిలిచాడు. అతడి కంటే ముందు ప్రభ్‌సిమ్రన్ సింగ్ ఈ ఫీట్ సాధించాడు. ప్రభ్‌సిమ్రన్ 2023 ఎడిషన్‌లో దిల్లీ క్యాపిటల్స్‌పై సెంచరీ చేశాడు. అలాగే ఇదే ఏజ్‌లో పంజాబ్ కింగ్స్ తరఫున సింగిల్ ఎడిషన్‌లో అత్యధిక సిక్స్‌లు బాదిన ఆటగాడిగానూ రికార్డు కొట్టాడు. ఈ మ్యాచ్‌లో కనోలి 8 సిక్స్‌లు బాదాడు. ఇదివరకు కూడా ఈ రికార్డు కనోలి పేరిటే ఉంది. ఇదే సీజన్‌లో లఖ్‌నవూతో మ్యాచ్‌లో 7 సిక్స్‌లు కొట్టాడు.

# క్లారిటీ లేకుంటే టాప్ ప్లేయర్స్ ఉన్నా వేస్ట్: రిషభ్ పంత్

క్లారిటీ లేకుండా క్రికెట్‌లో రాణించడం కష్టమని లక్నో సూపర్ జెయింట్స్(రూా+) కెప్టెన్ రిషభ్ పంత్ అన్నాడు. స్పష్టత లేనప్పుడు జట్టులో ఎంత పెద్ద ప్లేయర్లు ఉన్నా వృథానేనని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)తో లక్నో వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగింది. టాస్ సందర్భంగా మాట్లాడిన రిషభ్ పంత్.. తమ జట్టును గాయాల బెడద వేధిస్తోందని తెలిపాడు. దాంతో తుది జట్టులో పలు మార్పులు చేశామని వెల్లడించాడు. ‘మా జట్టులో కొందరు ఆటగాళ్లకు గాయాలయ్యాయి. అందుకే ఇంగ్లిస్ స్థానంలో అర్షిన్ కుల్కర్ణి జట్టులోకి వచ్చాడు. ఇంగ్లిస్‌కు స్వల్ప గాయమైంది. మోహ్సిన్‌కు కూడా చిన్న గాయమైంది. దాంతో మణిమారన్ సిద్ధార్థ్ స్థానంలో షాబాజ్ అహ్మద్ బరిలోకి దిగాడు. మేం మరింత క్లారిటీతో ముందుకు సాగాలని నిర్ణయించుకున్నాం. మేమంతా అగ్రశ్రేణి ఆటగాళ్లమని మాకు తెలుసు. కానీ కొన్నిసార్లు క్రికెట్‌లో స్పష్టత లోపించినప్పుడు ఇలా పరాజయాలు ఎదురవుతుంటాయి. కాబట్టి చాలా వరకు మేం స్పష్టత గురించి మాట్లాడుకుంటున్నాం. బ్యాటింగ్ ఆర్డర్‌లో కూడా కొన్ని మార్పులు ఉన్నాయి. కాబట్టి వీటిని పరిష్కరించి వచ్చే సీజన్ నాటికి సిద్ధమవుతామని ఆశిస్తున్నాం. టీ20 క్రికెట్‌లో స్థిరమైన వాతావరణం ఉండటం చాలా అవసరం. కానీ అదే సమయంలో మార్పులు అవసరమైనప్పుడు ఆ మార్పులు చేయగలగాలి. ఎందుకంటే ప్రతిసారీ ఒకే పని చేయడం వల్ల ఒకే రకమైన ఫలితం రాకపోవచ్చు. కాబట్టి కొన్నిసార్లు కొత్తగా ప్రయత్నించాలి. ముఖ్యంగా ప్రస్తుతం మేం ఉన్న స్థితిలో ప్రయోగాలు చేయడం తప్పేం కాదు. ఇది 180-190 స్కోరు వచ్చే వికెట్‌లా కనిపిస్తోంది. గతంలో జరిగిన చాలా మ్యాచ్‌ల కంటే ఇది మెరుగైన వికెట్.’అని రిషభ్ పంత్ చెప్పుకొచ్చాడు. మరోవైపు టాస్ గెలిచిన రజత్ పాటిదార్ బౌలింగ్ ఎంచుకున్నాడు. పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పాడు. ‘చిన్నస్వామి స్టేడియం తరహాలో ప్రేక్షకుల గోల లేకపోయినా.. ఇప్పటికీ సందడిగానే ఉంది. ఇది గట్టి ఉపరితలం అని నేను భావిస్తున్నా. ఇది నల్ల రేగడి నేల పిచ్. పైగా ఇక్కడ గత 4-5 మ్యాచ్‌ల్లో తక్కువ స్కోర్లు నమోదయ్యాయి. మేం ప్రత్యర్థిని వీలైనంత తక్కువ స్కోరుకు పరిమితం చేయడానికి ప్రయత్నిస్తాం.గత మ్యాచ్ తర్వాత మాకు సుదీర్ఘ విరామం లభించింది. అందరూ మంచి మానసిక స్థితిలో కనిపిస్తున్నారు. ఆరు ఏడు రోజుల కష్టపడి చేసిన శిక్షణ తర్వాత మేం మళ్లీ కలిశాం. నేను చెప్పినట్లుగా.. టోర్నీ ఆసాంతం అందరూ బాగా రాణిస్తున్నారు. మేం ఈ గేమ్ కోసం ఎదురుచూస్తున్నాం. మేం పాత జట్టుతోనే బరిలోకి దిగుతున్నాం.’అని రిషభ్ పంత్ చెప్పుకొచ్చాడు.






# ఆద్యంతం వినోదభరితం

ఆనంది ఆర్ట్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ నిర్మాణంలో లావణ్య త్రిపాఠి కొణిదెల, దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో రానున్న చిత్రం 'సతీ లీలావతి'. తాతినేని సత్య దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని ఈనెల 8న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ రిలీజ్ చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం లావణ్య త్రిపాఠి మీడియాతో ముచ్చటించారు. 'సతీ లీలావతి' మూవీని ఆల్రెడీ చూశాను. చాలా బాగుంది. నాకు ఎంతో నమ్మకం ఉంది. ఇక ఆడియెన్స్ ఎలాంటి రిజల్ట్ ఇస్తారో అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. నేను ఇందులో డైరెక్టర్ పాత్రలో కనిపిస్తాను. సినిమా ఆద్యంతం ఎంటర్టైన్మెంట్ అద్భుతంగా ఉంటుంది. కామెడీని అందరూ ఎంజాయ్ చేస్తారు. నేను, నా మేనేజర్ సినిమా చూస్తూ బాగా నవ్వుకున్నాం. కొన్ని చోట్ల ఎమోషనల్‌గా ఉంటుంది. మంచి మెసెజ్ ఉన్నా కూడా ఏదో క్లాస్ పీకుతున్నట్టుగా అనిపించదు. ఈ సినిమాలో చూపించినట్టుగా రిలేషన్స్ బయటి ప్రపంచంలో ఉండవు. అలాంటి పరిస్థితి ఏ మహిళకీ రాకూడదు. నాకు రియల్ లైఫ్‌లో వరుణ్ లాంటి మంచి భర్త దొరికారు. ప్రస్తుతం నేను నా భర్త, కొడుకుతో హ్యాపీగా ఉన్నాను. ఈ సినిమా చేస్తున్నప్పుడు నేను ప్రెగ్నెంట్ అని తెలిసింది. అలా అని స్క్రిప్ట్‌లో ఎలాంటి మార్పులు చేయలేదు. కాకపోతే యాక్షన్ సీక్వెన్స్‌లో మార్పులు చేశారు. రామ్ చరణ్ మాకు ఎప్పుడూ సపోర్టివ్‌గానే ఉంటారు. మా కోసం ఆయన ట్రైలర్ రిలీజ్ చేయడం సంతోషంగా అనిపించింది. రామ్ చరణ్ రిలీజ్ చేయడంతో మాకు మరింత రీచ్ వచ్చింది. చిరంజీవి మా అందరినీ ఎంతో ఎంకరేజ్ చేస్తుంటారు. మేం కూడా ఆయనకు ట్రైలర్ చూపించాలని అనుకుంటున్నాం. దేవ్మోహన్ అద్భుతమైన నటుడు. కమల్ హాసన్ 'సతీ లీలావతి'తో పోల్చలేం. కానీ మా సినిమా మాత్రం వినోదాత్మకంగా సాగుతుంది. ఈ చిత్రం ఎంతో రిఫ్రెషింగ్‌గా ఉంటూ పూర్తి వినోదాత్మకంగా ఉంటుంది. నేను, వరుణ్ కలిసి నటించాలని ఉంది. మేమిద్దరం కలిసి నటించాలంటే ఆ కథ కచ్చితంగా చాలా భిన్నంగా ఉండాలి.

# పెద్ది ఎడిటింగ్ వర్క్ పూర్తి

**• 4న విడుదలకు రంగం సిద్ధం**




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ డైరెక్టర్ బుచ్చి బాబు సాన కాంబినేషన్‌లో వస్తున్న పెద్ది గురించి అదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ చిత్ర ఎడిటింగ్ వర్క్ పూర్తయినట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఈ సినిమా అవుట్‌పుట్ చిత్ర బృందం ఎంతో సంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా జూన్ 4న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. జూన్ 4న విడుదల కానున్నప్పటికీ, అంతకంటే ఒకరోజు ముందే అంటే జూన్ 3న భారీ స్థాయిలో ప్రీమియర్ షోలు ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. శివరాజ్ కుమార్, జగపతి బాబు, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ మరియు సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఓవర్సీస్‌లో మే 7 రాత్రి నుంచి 'పెద్ది' అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కానున్నట్లు నిర్మాణ సంస్థ తెలిపింది. విడుదల తేదీ దగ్గరపడుతుండడంతో టీమ్ ప్రచారం జోరు పెంచింది. తాజాగా సినిమా ఆర్ట్ డైరెక్టర్ అవినాశ్ కొల్లా పాల్గొని, పెద్ది గురించి పలు విశేషాలు పంచుకున్నారు. 'పెద్ది'లో 70-80ల మధ్య విజయనగరం బ్యాక్‌డ్రాప్ ఉంటుందన్నారు. పొలం గట్టుపై కూర్చొని క్రికెట్ చూస్తే ఎలాంటి ఫీలింగ్ కలుగుతుందో.. ఈ సినిమా చూసినా అదే ఫీలింగ్ కలుగుతుందన్నారు. మరోవైపు త్వరలోనే దీని ట్రైలర్ రానున్నట్లు వార్తలు వస్తున్నాయి.

# అగధ టీజర్ విడుదల




కామాక్షి భాస్కర్ల ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'అగధ'. ఎమ్మెస్ రాజు దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. విశ్వంలో ఎన్నో అతీత శక్తులు దాగున్నాయంటూ ప్రారంభమైన ఈ టీజర్ సినిమాపై ఆసక్తి కలిగిస్తోంది. 'అగధ' ముందు ఎవరి ఆటలు సాగవంటూ చెప్పే డైలాగ్ పాత్ర ప్రాధాన్యతను తెలియచేస్తోంది. ప్రతిక్షణం ప్రేక్షకుడికి ఉత్కంఠ కలిగించాలన్నదే తన ప్రయత్నమని డైరెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. విజువల్ ఎఫెక్ట్స్, గెటప్స్, ఆ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ , భయం గొలిపే లొకేషన్లు, విచిత్రమైన ఎక్స్ప్రెషన్స్ , మధ్య మధ్యలో ఆసక్తి రేకెత్తించే డైలాగ్స్ ఆకట్టుకుంటున్నాయి. 'ఆ వీడియోలో నువ్వు ఏం చూసావమ్మా' అని అడిగితే, ఒక అమ్మాయి భయంతో వణికిపోతూ 'అగ్... అగ్... అగధ' అని చెప్పడంతో 'అగధ' అంటే ఎవరు అనే ఆసక్తి కలుగుతుంది. 'అగధ' వచ్చేసిందమ్మా. 'అగధ' ముందు ఎవ్వరి ఆటలు సాగవు. రా... 'అగధా రా'అంటూ వినిపించే డైలాగ్స్ తో టీజర్ తాలూకు



# కార్తీతో మ్యాడ్ డైరెక్టర్ మూవీ

తమిళ స్టార్ హీరో కార్తీ, టాలీవుడ్ యంగ్ డైరెక్టర్ కళ్యాణ్ శంకర్ కాంబినేషన్‌లో ఒక సినిమా రాబోతుందనే విషయం తెలిసిందే. తాజాగా ఈ క్రేజీ ప్రాజెక్ట్ హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైనట్లు తెలుస్తుంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రం పూజా కార్యక్రమంతో అధికారికంగా పట్టాలెక్కింది. టాలీవుడ్‌లో 'మ్యాడ్' ,'మ్యాడ్ స్క్వేర్' చిత్రాలతో సూపర్ హిట్స్ అందుకున్న దర్శకుడు కళ్యాణ్ శంకర్, ఇప్పుడు హీరో కార్తీతో ఒక భారీ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌ను ఎ÷-లాన్ చేశారు. ఈ సినిమాలో కార్తీ సరసన మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించబోతుంది. నేడు హైదరాబాద్‌లో జరిగిన ముహూర్తపు వేడుకలో చిత్ర యూనిట్ సభ్యులు మరియు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నట్లు సమాచారం. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. కార్తీకి తెలుగులో ఉన్న క్రేజ్, కళ్యాణ్ శంకర్ మార్క్ హ్యూమర్ తోడవడంతో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సందడి చేయడం ఖాయమని ఫ్యాన్స్ భావిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.

# శంబాల డైరెక్టర్‌తో సందీప్ కిషన్ మూవీ

టాలెంటెడ్ నటుడు సందీప్ కిషన్ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు చిత్ర బృందం అదిరిపోయే కానుకను అందించింది. సందీప్ కెరీర్‌లో 33వ చిత్రంగా అత్యంత భారీ స్థాయిలో రూపొందనున్న కొత్త ప్రాజెక్ట్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఇటీవల 'శంబాల' చిత్రంతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు యుగంధర్ ముని ఈ చిత్రానికి దర్శకత్వం వహించబోతున్నాడు. ఇదొక సోషియో-ఫాంటసీ, మైథాలజికల్ అడ్వెంచర్ డ్రామాగా తెరకెక్కనుంది. 'మౌనంగా జన్మించాడు.. కాలాలను జయించేందుకు సిద్ధమయ్యాడు' అనే అర్థం వచ్చేలా విడుదల చేసిన ఈ చిత్ర అనౌన్స్‌మెంట్ పోస్టర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. ఈ పోస్టర్‌లో సింహం ఒక చిన్నారిని చూస్తూ గంభీరంగా కనిపిస్తుండగా, మధ్యలో ఉన్న కత్తి సినిమా నేపథ్యాన్ని ప్రతిబింబిస్తోంది. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజశేఖర్ అన్నభిమోజు, మహీధర్ రెడ్డి ఈ పాన్-ఇండియా చిత్రాన్ని అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. తెలుగుతో పాటు తమిళం, హిందీ భాషల్లో కూడా ఈ సినిమా విడుదల కానుంది. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం, ఈ ఏడాది ఆగస్టు నుంచి రెగ్యులర్ షూటింగ్‌కు వెళ్లనుంది.






# ఓటీటీలోకి తిమ్మరాజుపల్లి టీవీ

హీరో కిరణ్ అబ్బవరం నిర్మించిన చిత్రం 'తిమ్మరాజుపల్లి టీవీ'. సాయితేజ్, వేద జలంధర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా ఇటీవల విడుదలై అందరికీ బాల్యంలోని జ్ఞాపకాలను గుర్తుచేసింది. ఇప్పుడీ చిత్రం ఓటీటీ ప్రేక్షకుల ముందుకువచ్చేందుకు సిద్ధమైంది. మే 15 నుంచి ఆహా వేదికగా స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని అధికారికంగా తెలుపుతూ ఆహా పోస్టర్ విడుదల చేసింది. కొత్త నటీనటులను పరిచయం చేస్తూ వి.మునిరాజ్ ఈ సినిమాను తెరకెక్కించారు. టీవీలు అప్పుడప్పుడే ఊళ్లలోకి ప్రవేశిస్తున్న 90వ దశకం. తిమ్మరాజుపల్లి అనే పల్లెటూళ్లో జరిగే కథ ఇది. శివరాత్రి వచ్చిందంటే ఊరి వాళ్లంతా కలిసికట్టుగా చందాలేసుకుని పండగ ఘనంగా జరిపించడం.. ఆ సాయంత్రం అ÷-దదెకి తెచ్చుకున్న టీవీలో కొత్త సినిమాలు చూసి ఆనందించడం పరిపాటి. అలాంటి ఊళ్లోకి తొలిసారి సొంతంగా ఓ టీవీ కొనుక్కుని తెచ్చుకుంటాడు రాజప్ప (ప్రదీప్ కొ÷-టటె). ఆ ఊళ్లో చిల్లర దొంగతనాలు చేస్తూ గడిపేసే సతీష్ (సాయితేజ్) కూడా టీవీ చూడటానికని వచ్చి.. రాజప్ప చెల్లి శారద (వేద జలంధర్)తో ప్రేమాయణం సాగిస్తుంటాడు. ఓసారి ఈ ప్రేమ విషయం రాజప్పకి తెలియడంతో పెద్ద గొడవ జరుగుతుంది. సతీష్‌ని తీవ్రంగా అవమానించడంతో.. 'ఏ టీవీని చూసైతే విర్రవీగుతున్నావో దాన్ని లేకుండా చేస్తాన'ని సవాల్ విసురుతాడు. సరిగ్గా అదేరోజు రాత్రి రాజప్ప ఇంట్లో టీవీ దొంగతనం జరగడంతో ఆ నింద సతీష్‌పై పడుతుంది. మరి ఆ తర్వాత ఏమైంది అన్నది మిగిలిన కథ.


Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com